

భగవద్గీత, నాట్యశాస్త్రాలకు

యునెస్కో గుర్తింపు

మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు

గర్వించదగ్గ సమయం: ప్రధాని మోదీ

www.andhrajyothy.com

వెల (Price) : Rs. 6.50

వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పేజీలు: 14

శనివారం | 19-4-2025

సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 20

శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం తిథి: షష్ఠి సా. 6:22 తదుపరి సప్తమి, నక్షత్రం: మూల ఉ.10:21 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.8:37-10:21, రా.8:31-10:13, దుర్ముహూర్తం: ఉ.6:00-7:39, అమృతఘడియలు: ఉ.6:42-8:24, రాహుకాలం: 9:00-10:30, సూర్యోదయం: 6:00, సూర్యాస్తమయం: 6:28

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఐఎస్ఎస్‌కి

భారత వ్యోమగామి

వచ్చే నెలలో వెళ్లనున్న

వాయుసేన పైలట్ శుభాన్షు శుక్లా

యాక్సియం-4 మిషన్‌లో

భాగంగా మరో ముగ్గురితో కలిసి..

రెండు వారాలపాటు అక్కడే

పలు ప్రయోగాల నిర్వహణ

2

జేఈఈ మెయిన్

ఫలితాల విడుదల

24 మందికి 100 పర్సంటైల్

తెలంగాణ నుంచి

ముగ్గురు, ఏపీ నుంచి ఒకరు

తెలుగు విద్యార్థులకు

8, 16, 22, 24వ ర్యాంకులు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్ష నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) శుక్రవారం రాత్రి ఈ ఫలితాలను విడుదల చేసింది. శుక్రవారం మధ్యాహ్నం తుది కీ విడుదల చేసిన అధికారులు.. విద్యార్థులు సాధించిన పర్సంటైల్ స్కోరుతో ఫలితాలను విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించగా.. 24 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు విద్యార్థులు ఉన్నారు. తెలంగాణ నుంచి హర్ష ఎ.గుప్తా, వంగల అజయ్‌రెడ్డి, బనిబ్రత మజీ, ఏపీ నుంచి సాయిమనోజ్ఞ గుత్తికొండ 100 పర్సంటైల్ సాధించారు. కాగా, హర్ష ఎ.గుప్తా దేశ వ్యాప్తంగా 8వ ర్యాంకు సాధించగా, అజయ్ రెడ్డి ఆలిండియా 16వ ర్యాంకుతో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో టాప్‌లో నిలిచాడు. సాయిమనోజ్ఞ ఆలిండియా 22వ ర్యాంకు, బాలికల్లో 2వ ర్యాంకు సాధించింది. బనిబ్రత మజీకి ఆలిండియా 24వ ర్యాంకు లభించింది.

తెలంగాణకు జైపాన్

రాష్ట్రంలో జపాన్ దిగ్గజ కంపెనీల పెట్టుబడులు 11,062 కోట్లు

జపాన్‌ను ఉదయించే సూర్యుడి దేశమని పిలుస్తారు. మా ప్రభుత్వ నినాదం 'తెలంగాణ రైజింగ్'. ఈ రోజు తెలంగాణ.. జపాన్‌లో ఉదయిస్తోంది.

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఎన్టీటీ డేటా, నెయిసా ప్రతినిధులతో కుదుర్చుకున్న ఎంఓయూలు చూపుతున్న సీఎం రేవంత్, కంపెనీల ప్రతినిధులు

రూ.10,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వంతో ఎన్టీటీ డేటా, నెయిసా సంయుక్తంగా ఒప్పందం

25 వేల జీపీయూలతో 400 మెగావాట్ల డేటా సెంటర్ నిర్మాణం

రూ.562 కోట్ల పెట్టుబడులు పెట్టనున్న తోషిబా అనుబంధ కంపెనీ

హైదరాబాద్ అభివృద్ధికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నా

కలిసికట్టుగా ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దాం

జపాన్ పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్‌కు చెందిన రెండు దిగ్గజ కంపెనీలు ముందుకొచ్చాయి. ఆ దేశ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందంతో రెండో రోజైన శుక్రవారం రూ.11,062 కోట్లతో పరిశ్రమలను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి ఎన్టీటీ డేటా, నెయిసా సంయుక్తంగా రూ.10,500 కోట్లు, విద్యుత్తు సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు తోషిబా కార్పొరేషన్ అనుబంధ సంస్థ ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ) రూ.562 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ మేరకు

మిగతా 13వ పేజీలో...

ఆర్‌ఎస్ఎస్ తరహాలో

ప్రజల్ని కలవండి

పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లండి

కేవలం మీడియా, సోషల్ మీడియాను నమ్ముకుంటే సరిపోదు

బూత్ స్థాయి నుంచి పార్టీని నిర్మిద్దాం

కాంగ్రెస్ నేతలతో మీనాక్షీ నటరాజన్

3

కిషన్‌రెడ్డీ.. రాష్ట్రానికి

ఏం చేశావ్?

మతం, ఒవైసీ జపం తప్ప అభివృద్ధి ఏది?

మెట్రో విస్తరణ, విభజన హామీలు పట్టవా?

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ-బీఆర్ఎస్ కుమ్మక్కు: మహేశ్ కుమార్ గౌడ్

13



హైదరాబాద్‌లో సైదాబాద్ కాలని గాంధీ పార్క్ వద్ద ఓ కారుపై కూలిన భారీ వృక్షం

జడివాన!

హైదరాబాద్‌లో కుండపోత వర్షం

బండ్లగూడ కంచన్‌బాగ్‌లో 8 సెం.మీ.. లోతట్టు ప్రాంతాలు జలమయం

స్తంభించిన ట్రాఫిక్‌తో వాహనదారులకు ఇబ్బందులు

ఈదురు గాలులకు కూలిన చెట్లు.. విద్యుత్తు సరఫరాకు అంతరాయం

జీహెచ్ఎంసీ అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి పొన్నం

పలు జిల్లాల్లోనూ గాలివాన.. దెబ్బతిన్న పంటలు.. నేడు, రేపు వర్షాలే

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): అకాల వర్షానికి హైదరాబాద్ మహానగరం అతలాకుతలమైంది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండలు తీవ్రంగానే ఉన్నా.. సాయంత్రానికి ఒక్కసారిగా కారుమబ్బులు కమ్మేసి ఉరుములు, మెరుపులతో జడి వాన కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు కాలువలను తలపించాయి. చాలా చోట్ల ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలి కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల కార్లు, ఇతర వాహనాలు ధ్వంసమయ్యాయి. పలు ప్రాంతాల్లో వరద నీరు నిలిచి ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. బండ్లగూడ కంచన్‌బాగ్‌లో అత్యధికంగా 8 సెం.మీ. వర్షం కురిసింది. అస్మాన్‌గడ్ డివిజన్‌లో విద్యుత్తు తీగలపై చెట్టు విరిగి పడటంతో 60కి పైగా ఫీడర్లు ట్రిప్పయ్యాయి. ఎంజే మార్కెట్ నుంచి అబిడ్స్‌కు వచ్చే ప్రధాన రహదారి మార్గంలో రామకృష్ణ థియేటర్ ఎదురుగా నిర్మిస్తున్న నూతన భవనంపై నుంచి భారీ క్రేన్ కూలి కిందపడింది. దీంతో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆ సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. లంగర్‌హౌజ్, బేగంపేట, ఉప్పుగూడ, రామంతాపూర్, బషీర్‌బాగ్ ప్రాంతాల్లో చెట్లు కూలి కరెంట్ సరఫరా, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నాంపల్లి రెడ్‌హిల్స్‌లో రోడ్డుపై ఓ భారీ వృక్షం ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో

మిగతా 14వ పేజీలో...

హైదరాబాద్..

ప్రేమ నగరం

'మిస్ వరల్డ్'తో తెలంగాణ ముందుకు ప్రపంచం

చేనేత చీరలు, ఆభరణాలను పరిచయం చేయాలి

వచ్చినవారికి మన ఆతిథ్యాన్ని, సంస్కృతిని చూపించాలి

ఎక్కడి నుంచి వచ్చామన్నది కాదు.. ఎక్కడికి వెళ్లాలనేది ముఖ్యం

ఆ దిశగా మహిళలు ముందుకెళ్లాలి

మహేష్‌బాబు అంటే ఇష్టం.. తెలుగులో నటిస్తానేమో!

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎడారి రాష్ట్రమైన రాజస్థాన్‌లో.. చదువులకు నిలయమైన కోటా నగరంలో.. రైతు కుటుంబంలో పుట్టి.. 19 ఏళ్ల వయసులో మిస్ ఇండియా పోటీలో విజేతగా నిలిచి.. మిస్ వరల్డ్ 2025 వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అందాల సుందరి.. నందినీ గుప్తా! బాహ్యసౌందర్యం కాదు.. అంతఃసౌందర్యమే అసలైన అందం అని భావించి.. దివ్యాంగులకు అండగా నిలుస్తున్న మనసున్న మనిషి. 'హైదరాబాద్ ప్రేమ నగరం.. ఇక్కడి ప్రజలు నన్నెంతగానో

మిగతా 10వ పేజీలో...



మిస్ వరల్డ్ పోటీల్లో

చేనేత అందం!

పోటీల్లో రాష్ట్ర చేనేత వస్త్రాలను ధరించనున్న సుందరీమణులు

పోచంపల్లికి పోటీదారులు, ఐరోపా దేశాల ప్రతినిధులు

యాదగిరిగుట్టకు మరో బృందం

డూప్లికేట్ గాంధీ కుటుంబం

కుట్ర



నేషనల్ హెరాల్డ్ ఆస్తులు కాజేసే యత్నం

రాజ్యాంగానికి వారేమైనా అతీతులా?

యూపీఏ హయాంలోనే విచారణ మొదలు

సోనియా, రాహుల్ బెయిల్ తెచ్చుకుందీ అప్పుడే

ఇందులో మోదీకి, బీజేపీకి ఏం సంబంధం?

మజ్లిస్ సభకు రేవంత్ సర్కారు ఆర్థికసాయం

బెంగాల్ తరహా ముప్పు తలెత్తే ప్రమాదం: బండి

గవర్నర్‌తో కేంద్ర మంత్రి మర్యాదపూర్వక భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ కుటుంబం డూప్లికేట్ గాంధీ కుటుంబమని, నేషనల్ హెరాల్డ్‌కు చెందిన రూ.వేల కోట్ల ఆస్తులను కాజేసేందుకు కుట్ర పన్నిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆ కుటుంబం ఏమైనా

మిగతా 12వ పేజీలో...

జీహెచ్ఎంసీలో

వీధి లైట్లకూ

డబ్బుల్లేవు

బీఆర్ఎస్ హయాంలో రంగులేసి అభివృద్ధన్నారు

బీజేపీ డబుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

12



మా చట్టాలు

ఉల్లంఘించొద్దు!

ధిక్కరిస్తే తీవ్ర పర్యవసానాలు తప్పవు

విదేశీ విద్యార్థులకు అమెరికా హెచ్చరిక

అక్రమంగా వచ్చిన వారందరూ దేశం విడిచి పోవాలని విజ్ఞప్తి

ఇప్పటికే వెయ్యిమందికి పైగా విద్యార్థుల వీసాలు రద్దు

ట్రాఫిక్ ఉల్లంఘనల వంటి స్వల్ప కారణాలతోనే చర్యలు

అరెస్టు భయంతో చదువు మధ్యలో వదిలేసి స్వదేశాలకు కొందరు

కోర్టులను ఆశ్రయిస్తున్న మరికొందరు

2

దొరల కోసమే ధరణి

అందుకే దానిని బంగాళాఖాతంలో విసిరేశాం

పేదోడి చుట్టమైన భూభారతి చట్టాన్ని తెచ్చాం

ప్రతి రైతుకూ భూధార్ నంబర్: మంత్రి పొంగులేటి

ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో రెవెన్యూ సదస్సులు

హాజరైన మంత్రులు సీతక్క, సురేఖ, ఎమ్మెల్యేలు



ములుగు జిల్లాలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు సీతక్క, సురేఖ

ములుగు/ఆదిలాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గతంలో బీఆర్ఎస్ శ్రేణుల కోసమే కేసీఆర్ ధరణి చట్టాన్ని తీసుకొచ్చారని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూమితో సంబంధంలేని, గులాబీ చొక్కా వేసుకున్న వారికి పట్టాలు ఇచ్చి, రైతుబంధు పథకంతో లబ్ధి కలిగించారని ఆరోపించారు. ఖాస్తులో ఉన్న రైతులకు మాత్రం పట్టాలివ్వకుండా మోసం చేశారని, దాంతో వారి బతుకులు రోడ్డున పడ్డాయని తెలిపారు. ధరణి చట్టం పేదోడికి శత్రువుగా

మిగతా 13వ పేజీలో...



ఇంటికి పంపిన వాళ్లలో 2 వేల మందికి

మళ్లీ చాన్స్?

తొలగించిన రిటైర్డ్ సిబ్బంది కోసం విభాగాధిపతుల పట్టు

6,729 మందిలో 2 వేల మందిని తీసుకునేందుకు ఒత్తిళ్లు

కొత్తవారికి అవకాశాలు ఇవ్వరా? నిరుద్యోగుల్లో అసంతృప్తి

హైదరాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ తర్వాత కూడా కాంట్రాక్టు పద్ధతిలో ప్రభుత్వ విభాగాల్లో ఏళ్లుగా తిష్ఠవేసిన వారిని రాష్ట్ర ప్రభుత్వం తొలగించినా విభాగాధిపతులు మాత్రం వారిలో కొందరిని తీసుకోవాలనే పట్టుదలతో ఉన్నట్టు తెలుస్తోంది. అటెండర్ నుంచి ఐఏఎస్ దాకా వివిధ స్థాయిల్లో కొనసాగుతున్న 6,729 మందిని తొలగిస్తూ రేవంత్ రెడ్డి సర్కారు ఇటీవల నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే నెల తిరక్కుండానే వారిలో 2వేలమందిని తిరిగి తీసుకునేందుకు కొందరు

మిగతా 13వ పేజీలో...

మాటల్లో కాదు

చేతల్లో చూపండి

కంచ గచ్చిబౌలి భూముల అంశంపై విచారణ జరిపించండి

పర్యావరణ పరిరక్షణపై చిత్తశుద్ధి నిరూపించుకోండి

ప్రధాని మోదీకి బీఆర్ఎస్ నేత కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల అంశంలో మాటలతో సరిపెట్టకుండా.. అక్కడ జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. పర్యావరణ పరిరక్షణపై చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో శుక్రవారం ఓ పోస్టు చేశారు. కంచగచ్చిబౌలి అంశం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన రూ.10వేల కోట్ల ఆర్థిక మోసమని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ భూములు కేంద్రంగా జరిగిన ఆర్థిక అక్రమాలపై విచారణ చేపట్టి.. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటికాదని నిరూపించాలని కోరారు. కంచగచ్చిబౌలి భూములు తనఖాతో రూ.10,000 కోట్ల మేర జరిగిన ఆర్థిక కుంభకోణంపై దర్యాప్తు చేపట్టాలని

మిగతా 12వ పేజీలో...



నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం

మీ కాలేయం

సురక్షితమేనా?

తెలియకుండానే కబళించే లివర్ వ్యాధులు

సమస్యేమిటో గుర్తించే సరికే ప్రాణాపాయ స్థితి

రాష్ట్రంలో పెరుగుతున్న కాలేయ వ్యాధుల బాధితులు

అధిక కొవ్వు, రసాయనాలున్న ఆహారం, మద్యం.. ఊబకాయం, హెపటైటిస్ తదితరాలే కారణం

2013 నుంచి తెలంగాణలో 1,473 మందికి కాలేయ మార్పిడి చికిత్సలు

దాతల కోసం మరో 926 మంది ఎదురుచూపులు

12

భగవద్గీత, నాట్యశాస్త్రాలకు
యునెస్కో గుర్తింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి విశిష్ట గుర్తింపు లభించింది. హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీతకు, భరతముని రాసిన నాట్యశాస్త్రానికి యునెస్కో తన మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు కల్పించింది. ప్రఖ్యాత రిజిస్టర్‌లో వీటికి స్థానం లభించడంపై ప్రధాని మోదీ శుక్రవారం 'ఎక్స్'లో స్పందించారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్న భారతీయులైనా ఇది గర్వించదగ్గ క్షణం అన్నారు. కాలానికి అతీతమైన మన జ్ఞానానికి, గొప్పదైన సంస్కృతికి దక్కిన గుర్తింపు ఇది అని చెప్పారు. శతాబ్దాలుగా మన నాగరికత, చైతన్యాన్ని భగవద్గీత, నాట్యశాస్త్రం పెంచి పోషించాయని చెప్పారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ కేంద్రంగా దేశ సాంస్కృతిక జ్ఞానాన్ని ప్రతిష్ఠాపన చేయడానికి నరేంద్ర మోదీ నాయకత్వంలో నిర్విరామంగా కృషి జరుగుతోందని, దానికి లభించిన గుర్తింపే ఇది అని అమిత్ షా అన్నారు. వీటితో ఇప్పటివరకు మన దేశానికి చెందిన మొత్తం 14 ప్రతులకు స్థానం లభించినట్లయిందని షెకావత్ తెలిపారు. మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో మానవ జాతి వారసత్వానికి సంబంధించిన పుస్తకాలు, రాతప్రతులు, మ్యాప్స్, ఫొటోలు, ఆడియో, వీడియో రికార్డులకు చోటు కల్పిస్తారు. భగవద్గీత, నాట్యశాస్త్రంతోపాటు 74డాక్యుమెంటరీలకు కొత్తగా ఆ రిజిస్టర్‌లో స్థానం లభించింది.

నాలుగేళ్లలోపు పిల్లలకు దగ్గు మందుపై ఆంక్షలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: నాలుగేళ్లలోపు చిన్నారులకు వాడే దగ్గు మందులోని ఫిక్స్‌డ్ డ్రగ్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని నిర్ధారణకావడంతో వాటి తయారీ, అమ్మకాలపై కేంద్రం ఆంక్షలు విధించింది. క్లోర్ఫెనిరామైన్ మాలేట్, ఫినైల్ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్ సాధారణంగా దగ్గు సిరప్‌లో వాడతారు. జీఎస్‌కే, గ్లెన్‌మార్క్, అలెంబిక్ వంటివి ఈ ఫార్ములాను వాడుతున్నాయి. వీటిపై విషయ నిపుణుల కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించింది. దీంతో కేంద్ర ఆరోగ్య శాఖ గెజిట్ జారీ చేసింది. 'నాలుగేళ్లలోపు చిన్నారుల్లో ఈ ఎఫ్‌డీసీ దుష్ఫలితాలు కలిగిస్తుందని స్పష్టమైంది'అని గెజిట్‌లో పేర్కొన్నారు.

యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ విధిస్తారన్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. రూ.2 వేలు పైబడిన యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ వేయాలని కేంద్రం యోచిస్తోందంటూ కొన్ని వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ వార్తలపై శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ స్పందించింది. అవన్నీ పూర్తిగా తప్పుదోవ పట్టించే, నిరాధార, తప్పుడు వార్తలని తెలిపింది. ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనేదీ ప్రభుత్వం వద్ద లేదని స్పష్టం చేసింది. యూపీఐ లావాదేవీలపై ప్రస్తుతం ఎలాంటి మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) రుసుములు వసూలు చేయడం లేదని, అలాగే ఆయా లావాదేవీలపై జీఎస్టీ కూడా విధించడం లేదని వెల్లడించింది.

'శాటిలైట్ టోల్'పై నిర్ణయం తీసుకోలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: దేశవ్యాప్తంగా శాటిలైట్ ఆధారిత టోల్ వ్యవస్థ అమలుకు సంబంధించి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. వచ్చే మే 1 నుంచి శాటిలైట్ ఆధారిత టోల్ వ్యవస్థ అమల్లోకి రానున్నట్టు మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో ఈమేరకు మంత్రిత్వ శాఖ వివరణ ఇచ్చింది. టోల్ ప్లాజాల ద్వారా వాహనాలు సజావుగా వెళ్లేందుకు, ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకుగాను ఎంపిక చేసిన టోల్ ప్లాజాల వద్ద 'ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్)-ఫాస్టాగ్ ఆధారిత బారియర్‌లెస్ టోలింగ్ వ్యవస్థ'ను అమలు చేయనున్నట్టు ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ అడ్వాన్స్‌డ్ టోలింగ్ వ్యవస్థ.. వాహనాల నంబర్ ప్లేట్లను గుర్తించే ఏఎన్‌పీఆర్ టెక్నాలజీ, ప్రస్తుత ఫాస్టాగ్ వ్యవస్థను విళితం చేస్తుందని తెలిపింది.

తెలుగు అధికారికి సీబీడీటీలో స్థానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రత్యక్షపన్నుల బోర్డు(సీబీడీటీ)లో ఖాళీగా ఉన్న పదవులలో నలుగురు ఐఆర్ఎస్ అధికారులను కేబినెట్ నియామకాల కమిటీ నియమించింది. పంకజ్‌కుమార్ మిశ్రా, సంజయ్ బహదూర్, ఎల్.రాజశేఖర్ రెడ్డి, జి.అపర్ణరావు సీబీడీటీలో సభ్యులుగా నియమితులయ్యారు. కాగా, ఐఆర్ఎస్ అధికారి అయిన ఎల్.రాజశేఖర్‌రెడ్డి తెలుగువ్యక్తి కావడం విశేషం. ఆయన ఇదివరకు ఆదాయ పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా చెన్నైలో బాధ్యతలు నిర్వర్తించారు.

రాష్ట్రపతికి గడువు పెట్టి ఉండాల్సింది కాదు

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రస్తోగి వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: రాష్ట్రపతికి బిల్లుల విషయంలో గడువు విధించడం సరికాదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 రాష్ట్రపతిని ఆదేశించేందుకు సుప్రీంకోర్టుకు అధికారం ఇవ్వలేదని చెప్పారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్నారు. కాగా.. సుప్రీంకోర్టుపై ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ చేసిన విమర్శలను సీనియర్ న్యాయవాది, ఎంపీ కపిల్ సిబల్ తప్పుపట్టారు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లు మంత్రి మండలి సలహా మేరకు విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. అలాకాకుండా బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తనవద్దే పెట్టుకోవడం శాసనవ్యవస్థ అత్యున్నత అధికారాల్లోకి చొరబడటమేనన్నారు.

ఖలీస్థానీ ఉగ్రవాది అమెరికాలో అరెస్ట్

న్యూయార్క్, ఏప్రిల్ 18: ఉగ్రవాదులతో సంబంధాలు కలిగిన మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ హాపీ ఫాసియా అమెరికాలో పట్టుబడ్డాడు. ఐఎస్ఐ, బబ్బర్ ఖల్సా ఇంటర్‌నేషనల్ (బీకేఐ) వంటి రెండు అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హర్‌ప్రీత్‌ను ఎఫ్‌బీఐ టీం అరెస్ట్ చేసింది. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించాడని, పోలీసులకు దొరకకుండా బర్నర్ ఫోన్లను ఉపయోగించినట్టు ఎఫ్‌బీఐ వెల్లడించింది. పంజాబ్‌లో ఇటీవల జరిగిన 14 గ్రెనేడ్ దాడులతో అతనికి ప్రమేయం ఉన్నట్టు అధికారులు చెప్పారు. ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నాడని ఎన్ఐఏ ఈ ఏడాది ప్రారంభంలో హర్‌ప్రీత్‌పై కేసు నమోదు చేసింది.

మా చట్టాలు
ఉల్లంఘించొద్దు!



ధిక్కరిస్తే తీవ్ర పర్యవసానాలు.. విదేశీ విద్యార్థులకు అమెరికా హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: అమెరికా చట్టాలను ఉల్లంఘించడానికి ప్రయత్నించే విదేశీ విద్యార్థులు బహిష్కరణతో పాటు పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆ దేశ విదేశాంగ శాఖ హెచ్చరించింది. అక్రమ వలసల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం ఇమిగ్రేషన్ చట్టాలను కఠినంగా అమలు చేస్తోందని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మార్గరెట్ మెక్‌లియోడ్ వెల్లడించారు. 'మా చట్టాలను పాటించేవారికి అమెరికా మంచి అవకాశాలు కల్పిస్తుంది. కానీ చట్టాన్ని ఉల్లంఘించేవారు తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటారు' అని ఆమె స్పష్టం చేశారు. పీటీఐకి వర్చువల్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. జరిమానా పడకుండా ఉండాలంటే అమెరికా చట్టాలకు, వీసా ప్రమాణాలకు కట్టుబడి ఉండాలని చెప్పారు. సరిహద్దు భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, చట్టాలను ఉల్లంఘించి దేశంలోకి చొరబడేవారిని స్వాగతించబోమని పేర్కొన్నారు. భారతీయుల బంధువులతో సహా అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారంతా స్వచ్ఛందంగా తమ దేశానికి తిరిగి వెళ్లిపోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. 'మీ స్వదేశాలకు తిరిగి వెళ్లడానికి ఇంకా అవకాశం ఉంది. అందుకోసం డీహెచ్ఎస్‌ను సంప్రదించాలి. లేదా సీబీపీ యాప్‌ను ఉపయోగించాలి' అని మార్గరెట్ సూచించారు. కాగా, 2023-24 విద్యా సంవత్సరంలో 3.3 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు అమెరికాలోని ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందారు. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 23 శాతం అధికం. అయితే ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో భారతీయ విద్యార్థులకు జారీ చేసిన వీసాల సంఖ్య 30శాతం తగ్గుదల నమోదైంది.

విదేశీ విద్యార్థులకు గడ్డుకాలం

అమెరికాలో విదేశీ విద్యార్థులకు గడ్డుకాలం నడుస్తోంది. గత కొన్ని వారాల వ్యవధిలోనే వెయ్యి మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను, వారి చట్టబద్ధ హోదాను ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలంటూ బాధితుల్లో పలువురు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. విద్యార్థుల చట్టపరమైన హోదాను రద్దు చేయడానికి ఫెడరల్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వందలాది మంది నిర్బంధం, బహిష్కరణ ముప్పు ముంగిట్లో నిలిచారు. చిన్నచిన్న కాలేజీలతో పాటు హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రైవేట్ వర్సిటీలు, యూనివర్సిటీ ఆఫ్ మేరీలాండ్, ఒహియో స్టేట్ యూనివర్సిటీ వంటి పెద్ద ప్రభుత్వ సంస్థల్లోని విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. అసోసియేటెడ్ ప్రెస్ అంచనాల ప్రకారం.. గత మార్చి చివరివారం నుంచి ఇప్పటి వరకూ అమెరికా వ్యాప్తంగా 160 కాలేజీలు, వర్సిటీలకు చెందిన కనీసం 1,024 మంది విద్యార్థుల వీసాలు రద్దయ్యాయి. ఇంత హఠాత్తుగా తమ వీసాలు రద్దు చేయడానికి ప్రభుత్వం వద్ద సమర్థనీయ కారణాలేవీ లేవని డీహెచ్ఎస్‌కు వ్యతిరేకంగా కోర్టుల్లో దావాలు వేస్తున్న విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

వీసాల రద్దు ఎందుకంటే...?

అనేక కారణాల వల్ల వీసాలు రద్దయ్యే అవకాశం ఉన్నప్పటికీ ట్రాఫిక్ ఉల్లంఘనల వంటి చిన్న కారణాలే ఎక్కువగా ఉన్నాయని.. అదీ చాలాకాలం క్రితం నాటి ఘటనలు కూడా ఇప్పుడు తెరపైకి తెస్తున్నారని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నాయి. మరికొన్ని కేసుల్లో అసలు తమను ఎందుకు టార్గెట్ చేశారో అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో విదేశీ విద్యార్థి వీసాలను రద్దుచేసే విధానాన్ని డీహెచ్ఎస్ పాటిస్తోందని అర్థమవుతోందని మిషిగాన్ వర్సిటీ న్యాయవాదులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. డార్ట్‌మౌత్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న చైనా విద్యార్థి వీసా రద్దు చేసిన కేసులో న్యూహాంప్‌షైర్ ఫెడరల్ కోర్టు జడ్జి దాన్ని కొట్టివేస్తూ గతవారం ఉత్తర్వులు జారీ చేశారు. జార్జియా, కాలిఫోర్నియాల్లోనూ న్యాయవాదులు ఇటువంటి వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఈ పరిణామాలపై డీహెచ్ఎస్ అధికారులు నోరు మెదపడం లేదు. ఒకటి రెండు కేసులు మినహా చాలా కేసుల్లో పాలస్తీనా అనుకూల కార్యకలాపాల్లో తమ విద్యార్థులు పాల్గొన్న దాఖలాలు లేవని కాలేజీలు సైతం స్పష్టం చేస్తున్నాయి.

విద్యార్థుల్లో భయాందోళనలు

చట్టబద్ధమైన హోదా కోల్పోయిన విద్యార్థులు దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. లేకుంటే వారిని ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించే ప్రమాదం ఉంది. అరెస్టు భయంతో ఇప్పటికే కొంతమంది విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే వదిలేసి అమెరికా విడిచి స్వదేశాలకు వెళ్లిపోయారు. ప్రయాణ సమయంలో వీసా, పాస్‌పోర్టుతో పాటు ఇతర కీలక పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచిస్తున్నాయి. అయితే అరెస్టులు, వీసా రద్దు వంటి చర్యలు అంతర్జాతీయ విద్యార్థుల్లో అమెరికా పట్ల విముఖత కలిగిస్తాయని విద్యారంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ కారణంగా తమ వీసాను రద్దు చేస్తున్నారో స్పష్టత లేకపోవడం వారిలో భయాందోళనలకు కారణమవుతున్నాయని పేర్కొంటున్నారు.

విద్యార్థి వీసాల రద్దుపై కాంగ్రెస్ ఆందోళన

విదేశీ విద్యార్థుల వీసా రద్దు కేసుల్లో 50% భారతీయులవేనని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ (ఏఐఎల్ఏ) పేర్కొనడంపై కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏఐఎల్ఏ విడుదల చేసిన ప్రకటనను కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ 'ఎక్స్'లో షేర్ చేశారు. వీసా రద్దుకు కారణాలు స్పష్టంగా లేకపోవడం భయాందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. విదేశాంగ మంత్రి జైశంకర్ అసలు ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ మంత్రి దృష్టికి తీసుకెళ్లారా అని ఆయన ప్రశ్నించారు. కాగా, న్యాయవాదులు, విద్యార్థులు, వివిధ వర్సిటీల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం 327 మంది విదేశీ విద్యార్థుల వీసాలు రద్దయ్యాయని, వారిలో సగం మంది భారత్ నుంచి వచ్చినవారే కావడం గమనార్హం.

ఎలాన్ మస్క్‌కు ప్రధాని మోదీ ఫోన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 : ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాల్లో భాగస్వామ్యానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఈ సందర్భంగా తామిద్దరం భావించినట్లు ప్రధాని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ ఏడాది వాషింగ్టన్ డీసీలో తామిద్దరం సమావేశమై మాట్లాడుకున్న అంశాలూ తమ మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు తెలిపారు. టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాల్లో అమెరికాతో మరిన్ని భాగస్వామ్యాలు పెంపొందించుకోవాలని భారత్ కృత నిశ్చయంతో ఉందని ప్రధాని మస్క్‌కు వివరించారు. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలకవర్గంలో మస్క్ కీలకంగా ఉన్నారు. ఆయన సంస్థ టెస్లా భారత్‌లో ఒక ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. అంతేగాక మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ ద్వారా 'స్టార్ లింక్' అత్యధిక వేగ ఇంటర్‌నెట్ సేవలను భారత్‌లో అందించేందుకు రిలయన్స్ జియో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది.

లోకం తీరు



ట్రంప్ దూకుడుకు
కోర్టుల బ్రేకులు!

వాషింగ్టన్, ఏప్రిల్ 18: రెండో సారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చూపుతున్న దూకుడుకు అమెరికాలోని కోర్టులు బ్రేకులు వేస్తున్నాయి. వలస వచ్చినవారిని మూకుమ్మడిగా, వేగంగా వారి స్వదేశాలకు తిప్పిపంపేందుకు ట్రంప్ అమల్లోకి తెచ్చిన కొత్త పాలసీని నిలిపివేస్తూ అమెరికాలోని బోస్టన్ జిల్లా జడ్జి బ్రియాన్ మర్ఫీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా అమెరికాలోని వలసదారులు తమకు స్వదేశాల్లో ప్రాణహాని ఉందని, తిరిగి వెళితే తీవ్రంగా హింసిస్తారనే ఆందోళన వ్యక్తం చేస్తే.. వెంటనే తిప్పి పంపేయరు. ఈ అంశాన్ని లోతుగా పరిశీలించి, వలసదారులు చెప్పినది సరైనదే అయితే అమెరికాలోనే ఉండనిస్తారు. లేకుంటే తిప్పిపంపుతారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుంది. కానీ ట్రంప్ సర్కారు వేగంగా, మూకుమ్మడిగా వలసదారులను తిప్పిపంపేందుకు ఈ ప్రక్రియను పక్కనపెడుతూ కొత్త పాలసీని అమల్లోకి తెచ్చింది. దాని అమలును తాత్కాలికంగా నిలిపివేస్తూ బోస్టన్ జిల్లా జడ్జి సుమారు నెల రోజుల క్రితమే ఆదేశాలు ఇచ్చారు. కోర్టులో వేసిన పిటిషన్లను, వివిధ అంశాలను పరిశీలించి.. కోర్టులో విచారణ ముగిసేవరకు కొత్త పాలసీని నిలిపివేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ప్రభుత్వ ఖర్చు తగ్గించే క్రమంలో పలు ఫెడరల్ సంస్థల రద్దు, ఉద్యోగుల తొలగింపు దిశగా ట్రంప్ సర్కారు చేపట్టిన చర్యలకు మరో జిల్లా జడ్జి చెక్ పెట్టారు. 'వినియోగదారుల ఆర్థిక రక్షణ బ్యూరో (సీఎఫ్‌పీబీ)'ను రద్దు చేసి, అందులోని సుమారు 15 వందల మంది ఉద్యోగులను తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని కొలంబియా జిల్లా జడ్జి అమీ బెర్మన్ జాక్సన్ నిలిపివేశారు. ఈ బ్యూరోను కొనసాగించాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ ముగిసి, తీర్పు ఇచ్చేవరకు ఉద్యోగులెవరినీ తొలగించవద్దని ఆదేశించారు.

కులవివక్ష అంతానికి
'రోహిత్ వేముల' చట్టం చేయండి

కర్ణాటక సీఎంకు రాహుల్‌గాంధీ లేఖ

న్యూఢిల్లీ/బెంగళూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా భారత విద్యావ్యవస్థలో కులవివక్ష పోలేదని.. దీనికి స్వస్తి పలికేందుకు కర్ణాటకలో 'రోహిత్ వేముల చట్టం' తీసుకురావాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ సీఎం సిద్దరామయ్యకు సూచించారు. ఈ మేరకు ఈ నెల 16న లేఖ రాశారు. దానిని శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కులవివక్ష కారణంగా హెచ్‌సీయూకు చెందిన దళిత విద్యార్థి రోహిత్ వేముల 2016లో ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. "ప్రతిభావంతులైన రోహిత్ వేముల, పాయల్ తడ్వీ(మహారాష్ట్ర), దర్శన్ సోలంకీ (ముంబై) (ఆత్మ)హత్యలను ఎంత మాత్రం ఆమోదించలేం. దీనికి అంతం పలకడానికి ఇదే సమయం. అంబేడ్కర్, రోహిత్ సహా కోట్ల మందిలా మరే పిల్లవాడూ ఎదుర్కోకుండా రోహిత్ వేముల చట్టం చేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరుతున్నా" అని తెలిపారు.


అగ్ని-5ని మించి.. ధ్వని

- 6వేల నుంచి 10 వేల కిలోమీటర్ల రేంజ్!.. డీఆర్‌డీవో ఘనత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: రక్షణ పరిశోధనల్లో పలు అద్భుతాలు సాధిస్తున్న మన డీఆర్‌డీవో.. ధ్వని హైపర్‌సానిక్ గ్లైడ్ వెహికల్ (హెచ్‌జీవీ) ఫుల్ స్కేల్ మోడల్‌ను ఇటీవలే ఆవిష్కరించడం ద్వారా ప్రపంచం దృష్టిని మరోసారి ఆకర్షించింది. దాదాపు 29.5 మీటర్ల పొడుగు, 8 అడుగుల వెడల్పు ఉండే ఈ ధ్వని హెచ్‌జీవీ రేంజ్ ఎంతో డీఆర్‌డీవో వర్గాలు బయటకు వెల్లడించనప్పటికీ.. అది మన అమ్ములపొదిలో ఇప్పటికే ఉన్న అగ్ని-5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి రేంజ్ (5,500 కి.మీ) కన్నా ఎక్కువగా (6-10 వేల కిలోమీటర్ల దాకా) ఉంటుందని సమాచారం. అంటే.. మనదేశంలోని లాంచ్ సైట్ల నుంచి ఆసియా, యూరోప్‌తోపాటు ఉత్తర అమెరికాలోని కొన్ని భాగాల్లోని లక్ష్యాలను సైతం ఇది ఛేదించగలదు. కాగా.. ధ్వని హెచ్‌జీవీ ప్రయాణించే తీరు ప్రత్యేకంగా ఉంటుందని, తొలుత బాలిస్టిక్ బూస్ట్ దశ.. తర్వాత ఎక్స్‌టెండెడ్ గ్లైడ్ దశతో అది హైపర్‌సానిక్ వేగంతో సుదూరతీరాలకు ప్రయాణిస్తుందని రక్షణ నిపుణులు చెబుతున్నారు. గాల్లో వెళ్తుండగానే దిశ మార్చుకోగలిగే సామర్థ్యం ఉండే హెచ్‌జీవీలను సంప్రదాయ క్షిపణి రక్షణ వ్యవస్థలతో అడ్డుకోవడం దాదాపు అసాధ్యం.

ఐఎస్ఎస్‌కి భారతీయ వ్యోమగామి

- యాక్సియం-4 మిషన్‌లో భాగంగా మేలో వెళ్లనున్న పైలట్ శుభాన్షు
- రాకేశ్‌శర్మ తర్వాత ఓ భారతీయుడు రోదసిలోకి వెళ్లడం ఇదే తొలిసారి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: భారత వాయుసేన పైలట్, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా.. వచ్చే నెలలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కి వెళ్లనున్నారు. భారత అంతరిక్ష పరిశోధనల సంస్థ (ఇస్రో) ప్రాజెక్టులను శుక్రవారం ఇక్కడ సమీక్షించిన కేంద్ర మంత్రి జితేంద్రసింగ్.. ఈ విషయాన్ని వెల్లడించారు. శుక్లా చేయబోయే ఈ ప్రయాణాన్ని ఆయన.. అంతరిక్ష అన్వేషణల నవశకంలోకి భారత్ ధైర్యంగా వేస్తున్న అడుగులకు సంకేతంగా, అంతర్జాతీయ అంతరిక్ష భాగస్వామ్యాల విస్తరణలో ఇండియా అధిగమిస్తున్న కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఈ అంతర్జాతీయ భాగస్వామ్యాలు, గగన్‌యాన్ వంటి ప్రాజెక్టులు.. స్పేస్ టెక్నాలజీలో గ్లోబల్ లీడర్‌గా ఎదగాలన్న భారతదేశ చిత్తశుద్ధిని ప్రతిఫలిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే, శుక్లా ఐఎస్ఎస్‌కు వెళ్లేది ఇస్రో చేపట్టిన మిషన్‌లో భాగంగా కాదు. అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థ 'యాక్సియం స్పేస్' చేపట్టిన 'యాక్సియం 4' మిషన్‌లో భాగంగా మరో ముగ్గురు విదేశీ వ్యోమగాములతో కలిసి ఆయన వెళ్లనున్నారు. అమెరికన్ వ్యాపారదిగ్గజం ఈలన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ వ్యోమనౌక క్రూడ్రాగన్ వారిని ఐఎస్ఎస్‌కు చేరవేయనుంది. ఫ్లోరిడాలోని కెనెడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా క్రూడ్రాగన్‌ను దిగువ భూ కక్ష్యలోకి ప్రవేశపెడతారు. అమెరికన్ వ్యోమగామి, నాసాకు చెందిన పెగ్గీ వాట్సన్ కమాండర్‌గా ఉండే ఈ మిషన్‌లో.. శుక్లా పైలట్‌గా వ్యవహరిస్తారు. వీరితో పాటు.. పోలండ్‌కు చెందిన స్వావోష్ ఊజ్నైన్స్కీ, హంగరీకి చెందిన టైబోర్ కాపూ వెళ్లనున్నారు. ఆయా దేశాల నుంచి రోదసిలోకి వెళ్లనున్న తొలి వ్యోమగాములు వారే కావడం విశేషం. అలాగే.. రోదసి నుంచి భారతదేశం ఎలా కనపడుతోందని అడిగితే.. 'సారే జహాఁసే అచ్ఛా' అంటూ తొలి భారతీయ వ్యోమగామి రాకేశ్ శర్మ జవాబిచ్చిన నాలుగు దశాబ్దాల తర్వాత.. మరో భారతీయుడు అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే తొలిసారి!! ఈ మిషన్‌లో భాగంగా వారు రెండువారాలపాటు ఐఎస్ఎస్‌లోనే ఉంటారు. శుక్లా ఈ రెండువారాలూ అక్కడ పలు ప్రయోగాలు చేయనున్నారు.

శుక్లా నేపథ్యం..

శుభాన్షు శుక్లా 1985లో యూపీలోని లఖ్‌నవూలో జన్మించారు. 2006 జూన్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫైటర్ వింగ్‌లో చేరారు. ఎస్‌యు-30 ఎంకేఐ, మిగ్ 21, మిగ్ 29, జాగ్వార్, హాక్, డోర్నియర్, ఏఎన్-32 సహా పలు రకాల విమానాలను 2000 గంటల పాటు నడిపి అపార అనుభవాన్ని గడించారు. 2024 నాటికి గ్రూప్‌కెప్టెన్ స్థాయికి చేరుకున్నారు. తన కెరీర్‌లో ఎన్నో అవార్డులు, పతకాలు సాధించిన శుక్లాకు 2019లో ఇస్రో నుంచి పిలుపు వచ్చింది. దరిమిలా ఆయన మాస్కో(రష్యా)లోని యూరీ గగారిన్ కాస్మోనాట్ ట్రైనింగ్ సెంటర్‌లో వ్యోమగామి శిక్షణ పొందారు. ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌కు ఆయన్ను వ్యోమగామిగా ఎంపిక చేసినట్టు ప్రధాని మోదీ 2024 ఫిబ్రవరి 27న ప్రకటించారు.2024లోనే.. యాక్సియం 4 మిషన్‌కు ప్రధాన వ్యోమగామిగా శుక్లా ఎంపికయ్యారు. ఈ మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు వెళ్లడం వల్ల.. స్పేస్‌ఫ్లైట్ ఆపరేషన్స్, లాంచ్ ప్రోటోకాల్స్ వంటివాటిలో అనుభవం సంపాదించే అవకాశం ఆయనకు లభిస్తుంది. గగన్‌యాన్ మిషన్‌లో ఈ అనుభవాలు ఆయనకు ఎంతగానో ఉపకరిస్తాయి.

థార్ ఎడారిలో
పచ్చదనం పరవళ్లు!



థార్ ఎడారి విస్తరించి ఉన్న ప్రాంతంలోని ఓ గ్రామం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: భూమిపై అత్యంత వేడి ప్రాంతాల్లో థార్ ఎడారి కూడా ఒకటి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఎడారుల విస్తీర్ణం కూడా పెరుగుతూ ఉంది. కానీ.. భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న థార్ ఎడారి మాత్రం అందుకు భిన్నంగా పచ్చదనాన్ని పరుచుకుంటోంది. ఎటు చూసినా ఇసుక తప్ప మరేమీ కనిపించని ఈ ఎడారిలో గత రెండు దశాబ్దాలుగా వృక్ష సంపద ఆశ్చర్యకరంగా 38% పెరిగింది. ఒకప్పుడు ఇసుక దిబ్బలతో నిండి ఉన్న ఈ నేల క్రమంగా ఆకుపచ్చగా మారుతోందని ఉపగ్రహ డేటా స్పష్టం చేస్తోంది. భారత్‌లోని అతి పెద్ద ఎడారిలో ఈ అనూహ్యమైన మార్పునకు కారణం ఏమిటి..? అంటే.. వాతావరణ మార్పులు, మారుతున్న వర్షపాత నమూనాలు, మానవ ప్రయత్నాలు.. వెరసి ఇక్కడ పచ్చదనాన్ని తీసుకొస్తున్నాయని.. 'సెల్ రిపోర్ట్స్ సస్టెయినబిలిటీ'లో ప్రచురితమైన తాజా అధ్యయనం వెల్లడించింది. వాయవ్య భారతం, ఆగ్నేయ పాకిస్థాన్‌లలో సుమారు 2లక్షల చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్న థార్ ఎడారి ప్రాంతంలో సుమారు 1.6 కోట్ల మందికిపైగా నివసిస్తున్నారు. అధ్యయనంలో భాగంగా 2001 నుంచి 2023 వరకు ఉపగ్రహ చిత్రాలను పరిశోధకులు పరిశీలించారు. ఈ క్రమంలో థార్ ప్రాంతంలో రుతుపవనాల వర్షపాతం 64 శాతం పెరిగిందని వారు గుర్తించారు. కాలానుగుణ వర్షపాతంలో పెరుగుదల కారణంగా ఇక్కడ నేల తేమగా మారిందని, భూగర్భ జలాలు పెరగడంతో వృక్ష సంపద కూడా పెరిగిందని వారు తెలిపారు. పచ్చదనంతోపాటు మౌలిక సదుపాయాలు కూడా పెరిగి నివాస యోగ్యంగా మారడంతో వ్యవసాయం అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఎడారి నేల పచ్చగా మారడం ఆనందించదగ్గ విషయమే అయినప్పటికీ.. సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భూగర్భజలాల మితిమీరిన వినియోగం దీర్ఘకాలిక క్షీణతకు దారితీస్తుందని, ఇప్పుడిప్పుడే సాధిస్తున్న పురోగతికి ఇది ముప్పు వాటిల్లేలా చేస్తుందని చెబుతున్నారు. అలాగే పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కూడా ఈ ప్రాంత జనాభాపై ప్రభావం చూపిస్తాయని అన్నారు. కాబట్టి సుస్థిర అభివృద్ధి అన్నిటికంటే ముఖ్యమని చెప్పారు. పునరుద్పాదక శక్తి, స్మార్ట్ నీటి నిర్వహణ వ్యవస్థలపై దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

ఈ మార్పు మంచిదేనా..?

థార్ ఎడారిలో పచ్చదనం, నీటి వనరులు, వ్యవసాయం పెరగడం.. శుభపరిణామమే. అదేసమయంలో కొత్త ప్రమాదాలు కూడా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. వ్యవసాయం ఎక్కువగా చేస్తే ఆహార భద్రత ఉంటుంది. అయితే దీనికి వాతావరణం కూడా సహకరించాలి. భవిష్యత్తులో వాతావరణంలో విపరీతమైన మార్పులు వస్తాయని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వరదలు ముంచెత్తితే మౌలిక సదుపాయాలు దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అలాగే పెరుగుతున్న వృక్షజాలం కారణంగా స్థానిక జీవవైవిధ్యానికి ముప్పు తప్పదని, ముఖ్యంగా ఎడారి వాతావరణానికి అలవాటు పడిన జీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని చెబుతున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ తరహాలో.. ప్రజల్ని కలవండి

ప్రతి ఒక్కరితో నేరుగా మాట్లాడండి.. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లండి

- కేవలం మీడియా, సోషల్ మీడియాను నమ్ముకుంటే సరిపోదు
- బూత్ స్థాయి నుంచీ పార్టీని నిర్మించుకుందాం
- పాత, కొత్త నేతల సమస్యపై సీఎం వచ్చాక చర్చిస్తా
- చేవెళ్ల, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ నేతల సమావేశంలో.. మీనాక్షి నటరాజన్ దిశానిర్దేశం


గాంధీ భవన్‌లో జరిగిన సమీక్షలో మీనాక్షీ నటరాజన్, మహేశ్ గౌడ్, ఇతర నేతలు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సభ్యులు మనిషి మనిషినీ కలుస్తుంటారని.. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కూడా అదే తరహాలో ప్రజలను కలవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. ప్రభుత్వ పథకాలు, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కేవలం మీడియానో, సోషల్ మీడియానో నమ్ముకుంటే సరిపోదని స్పష్టం చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి ముఖాముఖిగా మాట్లాడాలని.. అప్పుడే ప్రజలు నాయకులకు, పార్టీకి, ప్రభుత్వానికి దగ్గరవుతారని చెప్పారు. శుక్రవారం గాంధీభవన్‌లో చేవెళ్ల, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో సమీక్షా సమావేశం జరిగింది. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ మంత్రులు గీతారెడ్డి, షబ్బీర్ అలీ, పార్టీ నేతలు కేఎల్ఆర్, ఎ.చంద్రశేఖర్ తదితరులు కూడా పాల్గొన్న ఈ సమావేశంలో మీనాక్షి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

పార్టీని బతికించుకున్న నేతలకు ప్రాధాన్యత ఏదీ?

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎందుకు తీసుకెళ్లలేక పోతున్నారని సమీక్ష సందర్భంగా పార్టీ నేతలను మీనాక్షి ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్న పదేళ్లు పార్టీని బతికించుకున్న నేతలకు క్షేత్రస్థాయిలో ప్రాధాన్యత లేకుండా పోయిందని.. అధికారాలన్నీ కొత్తగా పార్టీలోకి వచ్చిన వారి వద్దే ఉన్నాయని పలువురు సీనియర్లు బదులిచ్చారు. ప్రభుత్వ, పార్టీ పదవుల్లో పాత నేతలకు ప్రాధాన్యత ఇవ్వకుంటే కష్టమేనని పేర్కొన్నారు. ప్రజల్లోకి చొచ్చుకుపోవాలంటే నేతలు, కార్యకర్తలకు ప్రభుత్వ పదవుల్లో, పార్టీ పదవుల్లో ఉండాలని.. అలాంటివేమీ లేకపోవడం సమస్యగా మారిందని కొందరు నేతలు పేర్కొన్నారు. వీలైనంత త్వరగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కోరారు. పాత, కొత్త నేతల మధ్య సమన్వయం కోసం ఒక పరిష్కార మార్గాన్ని ఆలోచించాలని సూచించారు. దీనిపై మీనాక్షీ నటరాజన్ స్పందిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చాక ఆయనతో మాట్లాడి ఈ సమస్యకు పరిష్కార మార్గాన్ని ఆలోచిస్తామని తెలిపారు. పార్టీని నమ్ముకుని ఉన్న వారికి పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. ఎన్నికలప్పుడు హడావుడిగా బూత్ కమిటీలు వేయడం కాకుండా.. ఇప్పుడే గ్రామస్థాయి నుంచీ పార్టీ నిర్మాణం చేపడతామని, దీనితో స్థానిక ఎన్నికల్లో కూడా ప్రయోజనం ఉంటుందని చెప్పారు. కాగా, చేవెళ్ల లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ ఓటమికి కారణాలను మీనాక్షి ఆరా తీశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ... నాయకులు పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంలో వెనుకబడి పోతున్నామని పేర్కొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి.. అభివృద్ధి.. సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

ఏపీలో ఎస్సీ వర్గీకరణ రూల్స్ విడుదల

- రాష్ట్రంలో అమలుకు అంతా సిద్ధం
- 3 గ్రూపులుగా రిజర్వేషన్ ఫలాలు
- మహిళా రిజర్వేషన్ 33% ఆయా గ్రూపులకు సమాంతరంగా అమలు

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. దీనికి సంబంధించి.. 'ఎస్సీ వర్గీకరణ రూల్స్-2025' నోటిఫికేషన్ విడుదల చేసింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏపీ షెడ్యూల్డ్ కులాల(వర్గీకరణ) ఆర్డినెన్స్-2025ను జారీ చేశారు. దీంతో దీని అమలుకు విధివిధానాలతో కూడిన నిబంధనలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ రూల్స్ వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపింది. ఆర్డినెన్స్‌లో పేర్కొన్నట్లు ఎస్సీలను 3 గ్రూపులుగా వర్గీకరించారు. ఎస్సీ రిజర్వేషన్ 15 శాతాన్ని ఈ గ్రూపులకు పంపిణీ చేస్తారు. గ్రూప్-1లో 12 కులాలకు 1 శాతం, గ్రూప్-2 లోని 18 కులాలకు 6.5 శాతం, గ్రూప్-3లో 29 కులాలకు 7.5 శాతం రిజర్వేషన్ అమలు చేస్తారు. ఏయే గ్రూపులలో ఏయే కులాలు ఉన్నాయన్న జాబితాను ఇప్పటికే విడుదల చేశారు. అదే విధంగా 200 రోస్టర్ పాయింట్ల విధానాన్ని రెండు విడతలుగా అమలు చేయనున్నారు. మహిళలకు దక్కాల్సిన 33.33 శాతం రిజర్వేషన్లు ఆయా గ్రూపులు మూడింటికీ సమాంతరంగా అమలు చేస్తారు. అంటే, ప్రతి గ్రూపులో ఆయా మహిళలకు 33.33 శాతం దక్కేలా చూస్తారు. ఏదైనా నోటిఫికేషన్‌కు సంబంధించి రోస్టర్ ప్రకారం ఓ గ్రూప్‌కు సంబంధించిన అర్హులైన వారు లేకపోతే అదే గ్రూపునకు తదుపరి నోటిఫికేషన్‌లో అవకాశమిస్తారు. రెండో నోటిఫికేషన్‌లో కూడా ఆయా గ్రూప్‌నకు అభ్యర్థులు లేకపోతే మూడో నోటిఫికేషన్‌లో అవకాశం కల్పిస్తారు. ఉదాహరణకు ఎవరైనా ఎస్సీ గ్రూప్-1కి చెందిన అభ్యర్థి మొదటి నోటిఫికేషన్‌లో అర్హులు కాకపోతే ఆ పోస్టును రెండో నోటిఫికేషన్‌లో భర్తీ చేస్తారు. రెండో నోటిఫికేషన్‌లో కూడా అర్హత కలిగిన వారు గ్రూప్-1లో లేకపోతే ఎస్సీ గ్రూప్-2కు చెందిన వారితో మూడో నోటిఫికేషన్‌లో భర్తీ చేస్తారు. రెండు సైకిల్స్‌లో 200 పాయింట్ల రోస్టర్ విధానం అమలు చేయాలి. ఈ రూల్స్ రాష్ట్ర ప్రభుత్వం నియంత్రణలో ఉన్న అన్ని విద్యాసంస్థల్లో అమలవుతాయి. విద్యాసంస్థల్లో సీట్లు భర్తీ చేసే క్రమంలో ఒక గ్రూపు నుంచి అభ్యర్థులు భర్తీ కాకపోతే మరో గ్రూపు నుంచి భర్తీ చేస్తారు. భవిష్యత్తులో విద్యాసంస్థల నియామకాలు/అడ్మిషన్లకు ఈ రూల్స్ వర్తిస్తాయి. ఈ రూల్స్‌కు సంబంధించి ఏదైనా అనుమానాలు ఉంటే ప్రభుత్వం చర్చించి తదుపరి ఆదేశాలు ఇస్తుంది. సాధారణ పరిపాలనశాఖ, పాఠశాల విద్య, ఉన్నత విద్య, ఇతర అన్ని సచివాలయ శాఖలు ఈ రూల్స్‌కు అనుగుణంగా సవరణలు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'సురానా'.. ఘరానా మోసం!

- స్థిరాస్తి లావాదేవీల్లో రూ.100 కోట్ల నల్లధనం
- ఒకే ప్లాట్‌ను పలువురికి అమ్మేసిన వైనం
- సరైన అగ్రిమెంట్లు లేకుండానే బయానాలు
- సురానా, సాయిసూర్య డెవలపర్స్ యజమానుల వంచన
- విచారణలో గుర్తించిన ఈడీ అధికారులు
- సోదాల్లో రూ.74 లక్షలు, నల్లధనం సమాచారం స్వాధీనం
- హైదరాబాద్‌లో పదుల సంఖ్యలో ఫిర్యాదులు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సురానా గ్రూపు కంపెనీలు.. రూ.వేల కోట్ల రుణాలు తీసుకొని బ్యాంకులను ముంచేశాయి. ఈ కంపెనీలకు చెందిన మరో రెండు రియల్ ఎస్టేట్ సంస్థల బండారాన్ని ఈడీ అధికారులు బట్టబయలు చేశారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రెండు రోజుల క్రితం నిర్వహించిన సోదాల్లో రూ.100 కోట్ల నల్లధనం చలామణీకి సంబంధించిన ఆధారాలు లభించినట్లు అధికారులు తెలిపారు. సురానా గ్రూపునకు చెందిన భాగ్యనగర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చైర్మన్ నరేంద్ర సురానా, అనుబంధ సంస్థ అయిన సాయిసూర్య డెవలపర్స్ యజమాని సతీశ్‌చంద్ర గుప్తా పక్కా పథకం ప్రకారం పలువురిని మోసం చేసినట్లు ఈడీ విచారణలో గుర్తించారు. సొంతింటి కోసం బయానాలు ఇచ్చిన పలువుర్ని వంచించినట్లు తేల్చారు. ఈ రెండు కంపెనీల ద్వారా అనధికార లేఅవుట్లలో ప్లాట్లు అమ్మారని, అది కూడా ఒకే ప్లాట్‌ను బైనంబర్ల ద్వారా పలువురికి రిజిస్ట్రేషన్లు చేశారని, సరైన అగ్రిమెంట్లు లేకుండా నగదు రూపంలో డబ్బు తీసుకున్నారని విచారణలో గుర్తించారు. ఇలా రూ.100 కోట్లకు పైగా నల్లధనాన్ని సేకరించి, ఆ డబ్బును వివిధ మార్గాల ద్వారా దారి మళ్లించారని ఈడీ అధికారులు పేర్కొన్నారు. ఈ రెండు కంపెనీలపై హైదరాబాద్‌లోని వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదైన నేపథ్యంలో తాము ఈసీఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన సోదాల్లో రూ.74.50 లక్షల నగదు, రూ.100 కోట్ల నల్లధనానికి సంబంధించిన లెక్కలు గుర్తించామని చెప్పారు. నరేంద్ర సురానా కార్యాలయం నుంచి లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇక సతీశ్‌చంద్రపై ఇప్పటి వరకు పలు పోలీస్ స్టేషన్లలో 11 కేసులు నమోదైనట్లు చెప్పారు.

నెల రోజులైనా కాల్పుల విరమణ పాటించండి

- బస్తర్‌లో హింసను ఆపండి.. మావోయిస్టు పార్టీ లేఖ

చర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తాము కనీసం నెల రోజుల పాటు ఇరువైపుల నుంచి కాల్పుల విరమణ కోరుకుంటున్నామని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ నార్త్, వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో ప్రతినిధి రూపేష్ పేరిట శుక్రవారం ఓ లేఖ విడుదలైంది. ఆ లేఖ ప్రకారం.. ఏప్రిల్ 8న తామిచ్చిన మొదటి ప్రకటనపై స్పందించిన ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి విజయశర్మకు మావోయిస్టు పార్టీ తరఫున రూపేష్ ధన్యవాదాలు తెలియజేశారు. కగార్ పేరుతో జరుగుతున్న మారణకాండ చర్చల వల్లే ఆగుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై తాము విడుదల చేసిన తొలి లేఖ వెనక ఎలాంటి వ్యూహం లేదని స్పష్టం చేశారు. సమస్యను పరిష్కరించడానికి తమ సహచరులు.. సెంట్రల్ కమిటీ, ప్రత్యేక జోనల్ కమిటీలోని సభ్యులను కలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. చర్చల్లో ప్రాతినిధ్యం వహించే ప్రతినిధి బృందంతో పాటు సహచరులను కలవడానికి తమకు భద్రత హామీ అవసరమని వివరించారు. ఇందుకు గాను సాయుధ బలగాల కార్యకలాపాలను నెల రోజుల పాటు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. చర్చల సమయంలో ప్రభుత్వ సాయుధ బలగాలపై కాల్పులు జరపవద్దని తమ సహచరులకు ఇప్పటికే సూచించామని, ప్రభుత్వం కూడా స్పందించి కాల్పులు విరమణ పాటించాలని, బస్తర్‌లో హింసను ఆపాలని కోరారు. దాడి చెయ్యొద్దని తాము తమ బలగాలను ఆదేశిస్తూ లేఖ విడుదల చేసిన తర్వాత కేంద్ర బలగాలు ఎన్‌కౌంటర్లు చేశాయని ఆరోపించారు. మారణకాండ కొనసాగితే చర్చలు సాఫీగా సాగవని, సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి విజయశర్మను కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

బస్తర్‌లో కాల్పుల విరమణ అత్యవసరం

- భారత్ బచావో సభలో మేధావులు, రాజకీయ నేతలు

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బస్తర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మావోయిస్టు పార్టీల మధ్య కాల్పుల విరమణ జరగాలని, ఆదివాసీలను కాపాడుకోవాల్సిన బాధ్యత పౌర సమాజానిదేనని పలువురు మేధావులు, రాజకీయ నేతలు పిలుపునిచ్చారు. బస్తర్‌లో కాల్పుల విరమణకు మద్దతుగా భారత్ బచావో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన సదస్సులో తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సభలో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని షెడ్యూల్ 5, 6 లను ప్రభుత్వాలు కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల పట్ల మానవీయంగా వ్యవహరించాలని, మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపి బస్తర్‌లో కాల్పుల విరమణ ప్రకటించాలని కోరారు. ఆదివాసీ నాయకురాలు సోనిసోరి మాట్లాడుతూ బస్తర్‌లో సల్వా జూడుం పేరుతో విపరీతమైన హింస జరుగుతుందని, ఆదివాసులను అరెస్ట్ చేసి జైలులో పెట్టి చంపేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ మావోయిస్టు పార్టీతో చర్చలకు ప్రభుత్వాలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

22 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో 22 మంది మావోయిస్టులు ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట శుక్రవారం లొంగిపోయారు. లొంగిపోయిన వారు మావోయిస్టు పార్టీలోని పలు కమిటీల్లో పని చేశారని, సుకుమా జిల్లాలో మావోయిస్టులు జరిపిన పలు విధ్వంసకర ఘటనల్లో నిందితులని ఎస్పీ కిరణ్ చవాన్ వెల్లడించారు. వీరిపై ఉన్న సుమారు రూ.40లక్షల యాభై వేల రివార్డును వారికే అందజేశామని తెలియజేశారు. కాగా, మావోయిస్టులు ఇప్పటికైనా లొంగిపోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ ఏడాది ఇప్పటిదాకా సుకుమా జిల్లాలో సుమారు 76 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఎస్పీ చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

స్టాలిన్ సమరం

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కదనోత్సాహంలో ఉన్నారు. రోజుకో కొత్త అస్త్రాన్ని ప్రయోగిస్తూ, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల యుద్ధంలో నెగ్గుకొచ్చి, మళ్ళీ అధికారాన్ని వశం చేసుకోవడం, కుమారరత్నం వారసత్వాన్ని సుదృఢం చేసుకోవడం కోసం ఆయన అహరహం శ్రమిస్తున్నారు. ఎదురుగా కనిపించే ప్రధాన రాజకీయశత్రువు అన్నాడీఎంకేతో కంటే, తమిళనాడులోకి జొరబడుతున్న బీజేపీతో మరింత ప్రమాదం ఉన్నది కనుక బలమైన అస్త్రాలన్నింటినీ ఆ పార్టీ మీదే ఎక్కువగా సంధిస్తున్నారు. నీట్ పరీక్ష వంటివి ముందుకు తెచ్చి, ఈ రెండుపార్టీల మధ్య మళ్ళీ పొత్తుపొడవకుండా చేయాలన్న స్టాలిన్ ప్రయత్నాలు అంతిమంగా ఫలించలేదు. రెండాకుల మీద ఆధారపడనిదే తమిళనాట సొంతంగా కమల వికాసం సాధ్యంకాదని బీజేపీ నాయకులకూ, కేంద్రం అండదండలు లేనిదే స్టాలిన్‌ను నెగ్గుకురాలేమని పళనికీ అర్థమైపోవడంతో మళ్ళీ పొత్తు చిగురించింది. మూడు ఎన్నికల్లో పెదవి విరిచిన జనం, రేపటిరోజున మెచ్చుతారా, అమిత్ షా అంటున్నట్టుగా 2026లో ఈ కూటమికే అధికారం కట్టబెడతారా అన్నది అటుంచితే, రాబోయే రోజుల్లో స్టాలిన్ రాజకీయయుద్ధం మరింత తీవ్రరూపం దాల్చడం తథ్యం.

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి తన చర్యలూ చేష్టలతో స్టాలిన్‌కు చేజేతులా మేలు చేశారు. స్టాలిన్‌ను ఇరకాటంలో పెట్టాలని, మూడుచెరువుల నీళ్ళు తాగించాలన్న ప్రయత్నంలో కాస్తంత అతిగా, దూకుడుగా పోయి పరువుపోగొట్టుకున్నారు. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ఆయనతో పాటు, ఆయనను వెనకేసుకొస్తున్న బీజేపీ పెద్దలకు కూడా పెద్ద ఎదురుదెబ్బ. విపక్షపాలిత గవర్నర్లందరికీ పెద్ద హెచ్చరిక. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులమీద నిర్దిష్టకాలపరిమితిలోగా ఆమోద ముద్రవేయాలంటూ గవర్నర్లకు గడువు విధించిన ఆ తీర్పు ఫెడరల్ వ్యవస్థమీద, ప్రజాస్వామ్యం మీద గౌరవం ఉన్న అందరికీ నచ్చింది. రాష్ట్రపతికి కూడా ఆదేశాలిస్తారా, హద్దులుపెడతారా అంటూ ఇప్పుడు ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ ఆగ్రహిస్తున్నారు కానీ, పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా ఆయన ఎలా వ్యవహరించారో తెలియనిదేమీ కాదు. విపక్షాలు ఏలుతున్న రాష్ట్రాలన్నీ వరుసపెట్టి సుప్రీంకోర్టు శరణుజొచ్చవలసి వస్తూ, సదరు గవర్నర్లు అనునయంగా ఎంత చెప్పినా దారికిరానందువల్లనే రవి కేసులో సర్వోన్నత న్యాయస్థానం గట్టిగా, ఘాటుగా వ్యవహరించాల్సివచ్చింది.

ఈ తీర్పు అందించిన ఉత్సాహం కాబోలు, ఇప్పుడు స్టాలిన్ రాష్ట్రాల స్వయంసాధికారతమీద ముగ్గురు సభ్యులతో ఒక ఉన్నతస్థాయి కమిటీ ప్రకటించారు. బీజేపీ ఏలుబడిలో రాష్ట్రాల హక్కులన్నీ హరించుకుపోతున్న నేపథ్యంలో, ఈ కమిటీ అవసరమని, రాజ్యాంగంలోని విధివిధానాలన్నింటినీ గుదిగుచ్చి, సమీక్షించి, రాష్ట్రాల చట్టబద్ధ హక్కులను రక్షించడంతోపాటు, సహకార సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు దీని అవసరం ఉందని స్టాలిన్ అంటున్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మినహా మిగతా ఇద్దరికీ డీఎంకెతో ఉన్న అనుబంధం ఏనాటిదోనంటూ విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి. ఈ కమిటీ ఏర్పాటు లక్ష్యం తెలిసిందే కనుక, అది ఏమి చెప్పబోతున్నదో ఊహకు అందనిదేమీ కాదు. ఇక, ఇదేరీతిలో, అదే లక్ష్యంతో దాదాపు ఐదుదశాబ్దాల క్రితం రాజమన్నార్ కమిటీని అన్నాదురై నియమించడం, రాష్ట్రాలకు రాజ్యాంగం దఖలుపరిచిన అధికారాలు అన్నీఇన్నీ కావంటూ ఆ కమిటీ తన నివేదికలో కేంద్రాన్ని తీవ్రంగా తప్పుబట్టడం, స్టాలిన్ తండ్రి కరుణానిధి అందించిన ఈ నివేదికను ప్రధాని ఇందిరాగాంధీ తేలికగా కొట్టిపారేయడం చాలామందికి గుర్తు. సర్కారియా, పూంఛీ కమిషన్ల వంటివి ఎన్ని చెప్పినా కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చిందేమీ లేదు.

కేంద్రంతో స్టాలిన్ సాగిస్తున్న ఈ యుద్ధం వెనుక రాజకీయ అవసరాలు, ప్రయోజనాలు ఉన్నప్పటికీ, రాష్ట్రాల హక్కులు హరించుకుపోతున్న తరుణంలో ఇది అవసరం. నీట్, డీలిమిటేషన్ ఇత్యాది విషయాల్లో స్టాలిన్ వాదనలు విస్తృతమైన చర్చకు అవకాశం ఇచ్చాయి. విద్యమీద రాష్ట్రాలకు ఉన్న అధికారాలను హస్తగతం చేసుకొని కొత్త విద్యా విధానాన్నీ త్రిభాషా సూత్రాన్నీ రుద్దడం, వద్దూకాదూ అంటున్న రాష్ట్రాలను ఆర్థికంగా శిక్షించడం వంటివి జోరుగా సాగుతున్న కాలం ఇది. అడ్డుతోవలో సర్‌చార్జీలను తెచ్చి పన్నుల్లో రాష్ట్రాలకు అందించాల్సిన వాటాను సైతం కేంద్రం కుదించింది. జస్టిస్ జోసెఫ్ కురియన్ కమిటీ అసెంబ్లీ ఎన్నికల్లోగా మధ్యంతర నివేదిక సమర్పిస్తుంది కనుక, రాజకీయంగా స్టాలిన్ లక్ష్యం నెరవేరుతుంది. కానీ, అంతిమంగా వెలుగుచూడబోయే పూర్తినివేదిక కచ్చితంగా కేంద్రరాష్ట్ర సంబంధాలమీద కొత్త చర్చకు, మరింత లోతైన విశ్లేషణలకు వీలుకల్పిస్తుంది.

వినాశనబాటలో విశ్వవిద్యాలయాలు

'హార్వర్డ్ విశ్వవిద్యాలయం తన స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వాధీనం చేయబోదు. తన రాజ్యాంగ హక్కులు వదులుకోబోదు... ఏ పార్టీ ప్రభుత్వమైనా సరే ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఏమి బోధించాలి, ఏ విద్యార్థులను చేర్చుకోవాలి, ఏ సిబ్బందిని నియమించుకోవాలి, ఏ పరిశోధనలు జరపాలి అనే విషయాలు ఆదేశించజాలదు'... విశ్వవిద్యాలయ వ్యవహారాల నిర్వహణలో పాలకుల జోక్యానికి ప్రతిస్పందిస్తూ ఏ భారతీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఇంత నిక్కచ్చిగా మాట్లాడి ఉంటారు? సమాధానం 'ఎవ్వరూ కారు' అని మాత్రమే.

ఈ కాలమ్ ప్రారంభ మాటలు హార్వర్డ్ విశ్వవిద్యాలయ (అమెరికా సంయుక్త రాష్ట్రాల కంటే పురాతన సంస్థ) అధ్యక్షుడు అలాన్ గార్బర్‌వి. ఈ ధరిత్రిపై తన కంటే శక్తిమంతుడు అయిన వ్యక్తి మరొకడు లేడని విశ్వసిస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలను గార్బర్ ధిక్కరించారు. అందుకు ఆగ్రహించిన ట్రంప్ హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి 2.2 బిలియన్ డాలర్ల నిధుల విడుదలను నిలిపివేశారు. అయినప్పటికీ శ్వేత సౌధ ఆసామీ ఆదేశాలను పాటించేందుకు హార్వర్డ్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. గత నెలలో మరో ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం కొలంబియాకు 400మిలియన్ డాలర్లను మంజూరు చేసేందుకు ట్రంప్ నిరాకరించారు. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆయన షరతులకు కొలంబియా సమ్మతించింది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) వెబ్‌సైట్ ప్రకారం జనవరి 25, 2023 నాటికి భారత్‌లో 1074 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు 460; డీమ్డ్ విశ్వవిద్యాలయాలు 128, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు 56, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు 430 వెరసి మొత్తం 1074. స్వాతంత్ర్య సాధనకు చాలా పూర్వమే 1857లో ప్రారంభమైన కలకత్తా, మద్రాస్, బొంబే విశ్వవిద్యాలయాలు కూడా వీటిలో ఉన్నాయి. యూజీసీ గవర్నర్–ఛాన్సలర్ మధ్య అభిప్రాయ విభేదాలు కారణంగా మద్రాసు విశ్వవిద్యాలయానికి ఆగస్టు 2023 నుంచి వీసీ నియామకం జరగనేలేదు.

పార్లమెంటు చేసిన చట్టాలు, యూజీసీ చట్టం–1956ను యూజీసీ అమలుపరుస్తున్న తీరుతెన్నుల పుణ్యమా అని భారతీయ విశ్వవిద్యాలయాలు స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించలేకపోతున్నాయి. యూజీసీ చట్టంలోని 12వ సెక్షన్ ప్రకారం బోధనా ప్రమాణాలను నిర్ణయించడం, పరీక్షలు, పరిశోధనల నిర్వహణకు విశ్వవిద్యాలయాలకు యూజీసీ నిధులు ఇస్తుంది. 1984లో సెక్షన్ 12ఎ ను చేర్చి సెక్షన్ 14ను సవరించడం ద్వారా యూజీసీ అధికారాలను విస్తృతపరిచారు. నిధుల పంపిణీ అధికారాలు ఉన్న కారణంగా యూజీసీ విశ్వవిద్యాలయాలకు సంబంధించిన ప్రతి వ్యవహారంలోను నియమ విరుద్ధంగా జోక్యం చేసుకోవడం అధికమయింది. సదరు నిబంధనలు ఇచ్చిన అధికారాలతో ఒక విశ్వవిద్యాలయం స్వతంత్ర ప్రతిపత్తిని యూజీసీ పూర్తిగా హరించి వేయగలుగుతోంది.



విద్యావిషయక స్వేచ్ఛ కుదించుకు పోతోంది. యూజీసీ చట్టాన్ని రద్దు చేసి, పునః రూపొందించి, అమలుపరచని పక్షంలో విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తి ఒక సుదూర లక్ష్యంగా మాత్రమే ఉండిపోతుంది. పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో ఆర్థిక వనరులను సమకూర్చుకోకపోతే విద్యావిషయక స్వేచ్ఛ ఒక ఎండమావి అవుతుంది.

యూజీసీపై నియంత్రణ ద్వారా భావజాల పక్షపాతంతో వ్యవహరించే కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయ అధ్యాపకుల నియామకాలు, పాఠ్య ప్రణాళికల రూపకల్పన, పరిశోధనా రంగాలు, పరీక్షల నిర్వహణను పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తోంది. యూజీసీ నిర్దేశిస్తున్న కొన్ని అనుచిత నిబంధనలు: అధ్యాపకులు, ఇతర బోధనా సిబ్బంది విద్యార్హతలు, నియామకాలకు సంబంధించిన నిబంధనలు; నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్); నేషనల్ ఎలిజిబిలిటీ అండ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (నీట్); జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ); కామన్ యూనివర్శిటీ ఎంట్రెన్స్; ది లెర్నింగ్ అవుట్ కమ్స్ –బేస్డ్ ఫ్రేమ్‌వర్క్ (ఎల్ఓసీఎఫ్); చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్), నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్). వైస్ ఛాన్సలర్లు 'అవశిష్ట' అధికారాలను ఉపయోగించుకుంటున్న కారణంగా వీసీల ఎంపిక, నియామకం వ్యవహారాలను యూజీసీ తన నియంత్రణలోకి తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నది. నా అభిప్రాయంలో ప్రభుత్వ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల బోధన, బోధనేతర సిబ్బంది, ముఖ్యంగా వీసీల ఎంపిక, నియామకాలలో యూజీసీకి పాత్ర లేదు, ఉండకూడదు. మరి యూజీసీ అటువంటి పాత్ర నిర్వహించేందుకు అనుమతిస్తే అది విశ్వవిద్యాలయాల జాతీయాకరణకు రంగాన్ని సిద్ధం చేయడమే అవుతుంది.

విశ్వవిద్యాలయాపై విస్తృత నియంత్రణ ఉన్నత విద్యారంగంలో పరిస్థితుల మెరుగుదలకు దోహదం చేస్తుందా? ఏ భారతీయ విశ్వవిద్యాలయానికి ప్రపంచ అగ్రగామి 100 విశ్వవిద్యాలయాలలో స్థానం లభించడం లేదు. అత్యున్నత ర్యాంక్ పొందిన భారతీయ ఉన్నత విద్యాసంస్థ బాంబే ఐఐటి. ఈ సంస్థకు లభించిన ర్యాంక్ 118. అక్టోబర్ 21, 2024 నాటికి కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టుల సంఖ్య 5182 అని ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించింది. ఐఐటీ గ్రాడ్యుయేట్ల ఉద్యోగ నియామకాలు (ప్లేస్‌మెంట్స్) తగ్గిపోయాయని విద్యాశాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం వెల్లడించింది. 2021–22 నుంచి 2023–24 సంవత్సరాల మధ్య ఈ నియామకాలు పది శాతానికి పైగా తగ్గిపోయాయి. ఎన్ఐటీ గ్రాడ్యుయేట్ల ప్లేస్‌మెంట్‌లు కూడా 10.77 శాతం మేరకు తగ్గిపోయాయి. భారతీయ విశ్వవిద్యాలయాలలో శిక్షణపొంది నోబెల్ పురస్కారం పొందిన ఒకే ఒక్క భారతీయ శాస్త్రవేత్త సి.వి. రామన్ మాత్రమే.

విద్యావిషయక స్వేచ్ఛ కుదించుకుపోతోంది. ఇదొక ఆందోళనకరమైన పరిణామం. అసహన సమూహాలు జేఎన్‌యూ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, జమియా మిలియా, ఏఎమ్‌యూ, జాదవపూర్, జమ్ము సెంట్రల్ వర్శిటీలతో సహా పలు విశ్వవిద్యాలయాలు (వాటి అధ్యాపకులు, విద్యార్థులు)పై విమర్శనాస్త్రాలను సంధిస్తున్నాయి. భౌతిక దాడులకూ పాల్పడుతున్నాయి. యూజీసీ చట్టాన్ని రద్దు చేసి, పునః రూపొందించి, అమలుపరచనిపక్షంలో విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తి ఒక సుదూర లక్ష్యంగా మాత్రమే ఉండిపోతుంది. పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో ఆర్థిక వనరులను సమకూర్చుకోకపోతే విద్యావిషయక స్వేచ్ఛ ఒక ఎండమావి అవుతుంది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు బదులు సంపన్న కుటుంబాలు, కార్పొరేట్ సంస్థలు నిధులు సమకూర్చి ప్రమోట్ చేసే ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు పెరిగిపోతాయి. వితరణశీలతే ఆ భాగ్యవంతుల సంకల్పం కావచ్చు కానీ ఫలితం మాత్రమే పక్కా వ్యాపారమే సుమా!

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)


భారత ప్రస్థానం: జాలువారిన జ్ఞాపకాలు

గోపాల్‌కృష్ణ గాంధీ జీవన యాత్ర అష్ట పదులలోకి ప్రవేశించనున్నది. 22 ఏప్రిల్ 2020న ట్విటర్‌పై (అప్పటికింకా అది Xగా మారలేదు) ఒక థ్రెడ్ (ట్వీట్‌ల పరంపర)ను పోస్ట్ చేశాను. 'మన మధ్య నడయాడుతున్న ఒక విశిష్ట భారతీయుని 75వ జన్మదినోత్సవ సందర్భమిది: ఆ ప్రముఖుడు ప్రజాసేవకుడు, దౌత్యవేత్త, రచయిత, విద్వజ్జుడు గోపాల్‌కృష్ణ గాంధీ'. మాతృదేశానికి ఆయన అందించిన సేవలు, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, సౌహార్ద పూర్వకమైన నడవడి గురించి ప్రస్తుతిస్తూ చివరకు ఆయనకు నేను వ్యక్తిగతంగా ఎలా రుణపడి ఉన్నదీ పేర్కొన్నాను. ఆధునిక భారతదేశ చరిత్ర, మహాత్మాగాంధీ గురించి మరెవ్వరి కంటే కూడా ఎక్కువగా ఆయన నాకు బోధించారు'.

ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. మరి మూడు రోజుల్లో గోపాల్ 80వ వసంతంలోకి వెళ్లనున్నారు. ఇప్పుడు ఆయన, తన సొంత జీవన ప్రస్థానంతో సమాంతరంగా సాగిన మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య పురోగతి, తిరోగతిపై ఒక జ్ఞానదాయక గ్రంథాన్ని కానుకగా అందించడం ద్వారా నన్ను (ఇంకా ఎంతో మంది భారతీయులను) మరెంతగానో రుణగ్రస్తుడిని చేసుకున్నారు. తన విస్తృత అధ్యయనం, భారత్ గురించిన ప్రగాఢమైన అవగాహనతో చారిత్రక ఘటనల వృత్తాంతాలతో మేళవించిన వ్యక్తిగత జ్ఞాపకాల విలక్షణ చరిత్ర అది. ఆయన వచనం అద్భుతమైనది. మన ఆలోచనాశీలతను సునిశితం చేసేది, రచయిత స్ఫూర్తిదాయక జీవిత గమనాన్ని, మన రిపబ్లిక్ సమున్నత, సంక్షోభ భరిత ప్రస్థానాన్ని, మునుపెన్నడూ చూడని చాలా అరుదైన ఛాయచిత్రాలతో సహా అక్షరీకరించిన గ్రంథమది. హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ, తమిళ చలనచిత్రాల గురించిన ప్రేమ పూర్వకమైన ప్రస్తావనలు ఎన్నో ఉన్నాయి. సాహిత్యం, వైదుష్యం, ప్రజాసేవతో పాటు సినిమాలు సైతం ఆయన జీవితాన్ని ప్రభావదాయకంగా తీర్చిదిద్దాయన్నది స్పష్టం.

గోపాల్ తాజా గ్రంథం 'Undying Light : A Personal History of Independent India' స్వతంత్ర భారత తొలి సంవత్సరాలను, ప్రత్యేకించి మహాత్ముని చివరి నిరాహార దీక్షలు, ఆయన బలిదానం, నెహ్రూ–పటేల్ మధ్య విభేదాలు, దేశ హితానికై వారి సమన్వయ కృషి గురించి విశదమైన కథనాలతో ప్రారంభమవుతుంది. ఆ తరువాత కాలక్రమానుసారంగా ప్రతి సంవత్సరం గురించి క్లుప్త, ఉల్లాసకరమైన కథనాలతో కొనసాగి, చివరి దశాబ్దంన్నర కాలం గురించి ఒక ఏకీకృత అధ్యాయంతో ముగుస్తుంది.

స్వాతంత్ర్య ఆగమనం, దేశ విభజన తరుణంలో జన్మించిన గోపాల్‌కృష్ణ గాంధీ మన రిపబ్లిక్‌తో పాటు ఎదుగుతూ వచ్చారు. దేశభక్తి ప్రపూరితులైన తల్లిదండ్రులు దేవదాస్ (మహాత్ముని కుమారుడు), లక్ష్మి (రాజాజీ కుమార్తె) ఆయన మేధో పరిణామాన్ని ప్రభావితం చేశారు. తన తోబుట్టువులు తార, రాజ్‌మోహన్, రామచంద్ర గురించి కూడా గోపాల్ అవ్యాజ ప్రేమాదరాలతో రాశారు. ఇంకా వివాదాస్పద ప్రధానమంత్రులు, లోక విఖ్యాతులుకాని ఉపాధ్యాయులు, సంఘ సేవకులు, ఎంతో మంది ఆసక్తిదాయక ప్రభావశీల వ్యక్తుల గురించిన విశేషాలు కూడా మనకు గోపాల్ గ్రంథం ద్వారా తెలుస్తాయి. గోపాల్ తన మాతామహుడు చక్రవర్తుల రాజగోపాలాచారి (రాజాజీ) గురించి సహజంగానే ప్రముఖ ప్రాధాన్యంతో రాశారు. స్వతంత్ర భారతదేశంలో అత్యున్నత పదవిని అధిష్ఠించిన రాజాజీ, తన రాజకీయ జీవితోన్నతికి బాటలు వేసిన భారత జాతీయ కాంగ్రెస్‌ను విడనాడి 'స్వతంత్ర పార్టీ' అనే ప్రతిపక్షాన్ని వ్యవస్థాపించారు. 'తన జీవితంపై ఏకైక అతి పెద్ద ప్రభావం' తన మాతామహుడేనని గోపాల్ వివరించారు.



గోపాల్‌కృష్ణ గాంధీ 'Undying Light : A Personal History of Independent India' స్వతంత్ర భారతదేశ ప్రస్థానాన్ని వివరించింది. ఈ విశిష్ట కథనం, జాతి గమనాన్ని ప్రభావితం చేసిన ప్రధాన సంఘటనలు, వివాదాలను వ్యాఖ్యాన సహితంగా వర్ణించింది. 'భారత్ వెలుగు మసకబారవచ్చు కానీ అది అంతరించదు. భారత్ ఆత్మ తేజస్సు ప్రకాశిస్తూనే ఉంటుంది' అని గోపాల్ తన పుస్తకాన్ని ఈ ఆశావహమైన వాక్యంతో ముగించారు.

గోపాల్ పదే పదే ప్రస్తావించిన రెండో వ్యక్తి సాటిలేని సంగీత విదుషీమణి ఎమ్ఎస్ సుబ్బులక్ష్మి. కుటుంబ స్నేహితురాలు అయిన సుబ్బులక్ష్మి సంగీతం, సమున్నత వ్యక్తిత్వం గోపాల్ జీవితంపై ఒక అజరామరమైన ప్రభావం. ఆయనను బాగా ప్రభావితం చేసిన మూడో వ్యక్తి జయప్రకాశ్ నారాయణ్. ఆయన పరిపూర్ణ చిత్త శుద్ధి, ప్రశాంత వక్తృత్వం, ముఖ వర్చస్సు, అన్నిటినీ మించి ఆయన ఆంగ్ల భాషా గరిమ తనను బాగా ప్రభావితం చేశాయని గోపాల్ రాశారు. భారత్–చైనా సంఘర్షణ కాలంలో తన అభిమాని ఆహ్వానంపై జయప్రకాశ్ ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కళాశాలలో ఒక ఉపన్యాసం వెలువరించారు. 'స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతీయవాదం అంటే వలస పాలన నుంచి విముక్తికై పోరాడడం, కోల్పోయిన ఆత్మగౌరవాన్ని పునః సాధించుకోవడం, స్వావలంబన అహింసాత్మకంగా శాసనోల్లంఘన చేయడంగా వర్ధిల్లిందని చెప్పారు. స్వాతంత్ర్య సాధన అనంతరం అసహనం, యుద్ధోన్మాదం, ఇరుగు పొరుగు దేశాలను బెదిరించడం, శ్రుతి మించిన దేశభక్తిని జాతీయ వాదంగా అర్థం చేసుకుంటున్నారని జయప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశారు'.



■ రామచంద్ర గుహ

గతానుగతం

గోపాల్ మనో ప్రపంచం నుంచి జాలువారిన ఈ జ్ఞాపకమూ, 1960ల్లో ప్రభుత్వ వ్యవహారాల్లో ఆంగ్లభాష వాడకాన్ని పూర్తిగా త్యజించేందుకు జరిగిన ప్రయత్నాలపై కథనమూ రెండూ నేరుగా వర్తమానంతో సంభాషించేవే. గోపాల్ ఇలా రాశారు: 'నేను బాధతప్త హృదయంతో నలిగిపోయాను. హిందీని అభిమానిస్తాను, అయితే దాని సామ్రాజ్యవాద డాంబికాన్ని ద్వేషిస్తాను. భాష విషయమై రాజాజీ భావాలతో ప్రభావితుడిని అయిన నేను అధికార భాషగా ఇంగ్లీష్‌కు స్వస్తిచెప్పాలన్న ప్రతిపాదనను ఎటువంటి మినహాయింపు లేకుండా తీవ్రంగా వ్యతిరేకించాను'.

గోపాల్‌కృష్ణ గాంధీ 'Undying Light : A Personal History of Independent India' స్వతంత్ర భారతదేశ ప్రస్థానాన్ని వివరించింది. ఈ విశిష్ట కథనం, జాతి గమనాన్ని ప్రభావితం చేసిన ప్రధాన సంఘటనలు, వివాదాలను వ్యాఖ్యాన సహితంగా వర్ణించింది. ఈ నేపథ్యంలో, కర్ణాటక సంగీత కచేరీలో గాత్ర విద్వాంసుడికి వాద్య సహకారం అందించే వాయులీన వాద్యకారుడు సృజించే నాద లయలా, గోపాల్ స్వీయ జీవనయానం మనకు అవగతమవుతుంది. ఐఏఎస్ అధికారిగా గోపాల్ ఉద్యోగ జీవితం గ్రామీణ తంజావూరు ప్రాంతంలో ప్రారంభమయింది. ఆ తొలినాళ్లలో ఆయన ఒక సిరియన్ క్రైస్తవుడు, ఒక తమిళ జైనుడు, ఒక ముస్లిమ్‌తో కలిసి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆ ఉద్యోగ జీవితం ఉచ్చదశలో రాష్ట్రపతి కార్యదర్శిగా, పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పని చేశారు. ఆ తరువాత మూడు ఖండాలలో నాలుగు దేశాలలో ఐదు వేర్వేరు దౌత్య బాధ్యతల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఈ ఉన్నత విధుల నిర్వహణ గురించి గొప్ప ఖచ్చితత్వం, స్పష్టతతో గోపాల్ రాశారు. దక్షిణాఫ్రికా, శ్రీలంక రాజకీయాలపై ఆయన ఆలోచనాత్మకమైన వృత్తాంతాలు ఎంతో విలువైనవి.

తమిళులు, బెంగాలీలు, ఢిల్లీవాలాలు ఆయనకు బాగా సుపరిచితులే అయినప్పటికీ ఈ సువిశాల భారతదేశంలోని సకల సామాజిక, సాంస్కృతిక వైవిధ్యాల గురించి గోపాల్‌కు మంచి అవగాహన ఉన్నది. ఈశాన్య భారత సమస్యాత్మక సరిహద్దు ప్రాంతాలు, కశ్మీర్‌కు గోపాల్ తన కథనంలో సముచిత ప్రాధాన్యమిచ్చారు. ఆయన 'Undying Light' పలు ఆసక్తికరమైన ఉదంతాలను వెల్లడించింది. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైన తరువాత రాజాజీ, ఆయన కుమార్తె నామగిరి హైదరాబాద్‌ను సందర్శించారు. ఆ సందర్భంగా గవర్నర్–జనరల్ కుమార్తెకు నిజాం నవాబు వజ్రాలు పొదిగిన ఒక నెక్లెస్‌ను బహుమానంగా ఇచ్చారు. అయితే రాజాజీ ఆ ఆభరణాన్ని తీసుకునేందుకు అంగీకరించలేదు. వితంతువు అయిన తన కుమార్తెకు అటువంటి విలువైన ఆభరణాన్ని ఇవ్వటం సుముచితం కాదని రాజాజీ అభిప్రాయపడ్డారు. ఆ తరువాత నామగిరి తన తండ్రి వైఖరిని ఆక్షేపించారు. వజ్రాల నెక్లెస్‌ను తిరిగి ఇచ్చివేస్తూ 'మేము గాంధీ గారి శిష్యులం. అంత ఖరీదైన వస్తువులు మాకు అవసరం లేదు' అని చెప్పి ఉండవలసింది.

గాంధీ, రాజాజీల మనుమడుగా గోపాల్‌కు తమ కుటుంబ విశిష్ట నేపథ్యం గురించి, ఆ గొప్పదనం తన జీవితోన్నతికి ఎలా దోహదం చేసిందో, అప్పుడప్పుడూ ఎలా ఆటంకమయిందో గోపాల్‌కు బాగా తెలుసు. న్యూఢిల్లీలోని తమ స్వగృహానికి నిత్యం ఎంతో మంది అసాధారణ వ్యక్తులు వస్తూ పోతుండడాన్ని బాల్యం నుంచి సన్నిహితంగా పరిశీలించిన గోపాల్ ఇలా రాశారు: 'హరిజన సేవ' విషయమై మా కుటుంబానికి ఉజ్వలమయిన యశస్సు ఉన్నది. అయితే మా కుటుంబ సన్నిహిత, స్నేహితులలో దళిత వ్యక్తి ఎవరూ లేరు. అవును, ఒక దళితుడు కూడా లేడు. మాకు ముస్లిమ్ క్రిస్టియన్, సిక్కు స్నేహితులు ఉన్నారు. అమెరికాలో ఆఫ్రికన్ అమెరికన్లు ఎంతో మంది మాకు స్నేహితులే. యూదు మతస్థులూ ఎంతో మంది మాకు స్నేహితులే. అయితే ఒక్క భారతీయ దళితుడు కూడా లేడు'.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురించి గోపాల్ ఇలా రాశారు: 'ఆయన పాత నౌక ఎస్.ఎస్ ఇండియాకు కొత్త కెప్టెన్ కాదు; కొత్త నౌక ఎస్.ఎస్ భారత్‌కు కొత్త సరంగు. పాత నౌకకు ప్రజాస్వామిక గణతంత్రవాదం, లౌకికవాదం అనే ఇంజిన్లు ఉండగా కొత్త నౌక మెజారిటేరియన్ జాతీయవాదం, హిందుత్వ అనే ఇంజిన్లతో నడుస్తున్నది'. డిసెంబర్ 1992లో బాబ్రీమసీదు కూల్చివేతకు సంబంధించిన కథనంలో గోపాల్ తన డైరీ నుంచి రెండు వ్యాఖ్యలను ఉటంకించారు: '30 జనవరి 1948 తరువాత భారతదేశ చరిత్రలో ఇది (6, డిసెంబర్ 1992న బాబ్రీ కూల్చివేత) 'చీకటి క్షణం' అని పేర్కొంటూ ఆయన ఒక ప్రశ్నను సంధించారు: 'మనం ఒక నాగరికత పతనం అంచున ఉన్నామా?'

'అన్‌డైయింగ్ లైట్ ముగింపు అధ్యాయంలో వర్తమాన భారతదేశం ఎదుర్కొంటున్న కొన్ని ప్రధాన సమస్యల గురించి గోపాల్ ప్రస్తావించారు. అవి: విశృంఖలంగా పర్యావరణ విధ్వంసం, మత విద్వేషం, రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తి క్షీణించడం, రాజకీయ ఎజెండాలకు గతాన్ని ఆయుధంగా ఉపయోగించుకోవడం మొదలైనవి. గోపాల్‌కృష్ణ గాంధీ తన యవ్వనంలో ఆవాహన చేసుకుని, ఉద్యోగ, మేధో జీవితంలో స్ఫూర్తిదాయకంగా నిబద్ధమైన భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య ఆదర్శాలకు అవి పెనుసవాళ్లుగా పరిణమించాయి. అయినప్పటికీ గోపాల్ తన పుస్తకాన్ని ఈ ఆశావహమైన వాక్యంతో ముగించారు: 'భారత్ వెలుగు మసకబారవచ్చు కానీ అది అంతరించదు. భారత్ ఆత్మ తేజస్సు ప్రకాశిస్తూనే ఉంటుంది'.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

వెన్నాడుతున్న 'ఇంద్రవెల్లి' జ్ఞాపకాలు

ఏప్రిల్ 20, 1981. ఆదివాసీ గూడేలు, పల్లెలలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించే సభ ఉందని, అదే రోజు అంగడి కూడా ఉండడంతో రెండు పనులూ చూసుకువద్దామని, మన కొరకు పెట్టిన సంఘం వారు చెప్పేది విందాం అన్న ఉత్సాహంతో ఇంద్రవెల్లి సభకు గుంపులు గుంపులుగా కదిలారు ఆదివాసీలు.

ఈ సభకు వారం రోజుల ముందు నుంచే నిర్మల్, ఉట్నూర్, ఆదిలాబాద్ డివిజన్ ప్రజలకు రైతు కూలీ సంఘం వారు కరపత్రాలు పంచి, గూడేల ప్రజల సమస్యల పరిష్కారానికి సభకు రావాలని చాటింపు వేయించారు. పోలీసు అధికారుల అనుమతి కూడా తీసుకున్నారు. ఆ సభకు జనం తండోపతండాలుగా కదలడం చూసి ఇంద్రవెల్లి షావుకార్లు, దోపిడీదారులు, వలస వాదుల గుండెలు అదిరాయి. వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు అబద్ధపు సమాచారం ఇచ్చారు. 'ఆదివాసులు దాడులు చేయడానికి ఇంద్రవెల్లిని చుట్టుముడుతున్నారు. పల్లెలు, గోండు గూడేలు కదిలినాయి. మాకు ప్రాణ భయం ఉంది రక్షించండ'ని చెప్పడంతో, అప్పటి ఆదిలాబాద్ ఎస్పీ పోలీసు బలగాలను దించి, ఆదివాసీలను చుట్టుముట్టారు. అమాయక గోండు ప్రజలకు ఇదంతా అర్థం కాలేదు. దీనికి తోడు వారికి తెలుగు భాష అర్థం కాదు. పోలీసులకు గోండు భాష అర్థం కాలేదు. ఒక పోలీసు అధికారి వచ్చి 'ఇక్కడ (ఇంద్రవెల్లి) చుట్టపక్కల కూర్చోవడానికి, గుంపులు గుంపులుగా ఉండడానికి అనుమతి లేదు. వెళ్లిపోండి' అని హెచ్చరికలు జారీచేశారు. తొడసం కట్టి అనే ఆదివాసీ నాయకుడు లేచి ఆరు రోజుల ముందే సభ అనుమతి తీసుకున్నాం అన్నాడు. అతన్ని అరెస్టు చేశారు. కొంత మంది ముఖ్య నాయకులను 19వ తేదీనే అరెస్టు చేశారు. పోయినోళ్లను పోయినట్లే అరెస్టు చేస్తున్నారు. ఏం జరుగుతుందో వచ్చిన ప్రజలకు అర్థం కావడం లేదు. సభలో ఏం చెబుతారో, సమస్యలకు పరిష్కారం దొరుకుతుందేమోనని గుంపులు.. గుంపులుగా ఇంకా జనం వస్తూనే ఉన్నారు. సభ అయిన తరువాత అంగడి చేద్దామనుకున్నారు.

కనక హన్మంతు (నిజాం గూడ) రైతుకూలి సంఘం నాయకత్వంలో జనాన్ని కంట్రోల్ చేస్తున్నారు. జనం సభ స్థలానికి పోవడానికి తహతహలాడుతున్నారు. పోలీసులు పంపడం లేదు. విసుగు చెంది మన సభ, మన స్థలం ఎవరిదైనా గుంజుకుంటున్నామా! మన సభలో ఈ పోలీసులు ఎందుకూ! సభ స్థలంకై పోదం పదండని మహిళలు దండు పిట్టబొంగరం, వెట్టి ఇస్రూబాయి ధైర్యంతో ముందడుగు వేశారు. మహిళా దండు కదిలింది. అంతలోనే మగ పోలీసులు సభకు వెళ్లొద్దని ఆపే క్రమంలో మహిళల ఛాతీపై చేతులు వేసి వెనక్కి దొబ్బడంతో, కోపంతో ఆమె ఆ పోలీసును కొట్టి చంపింది. ఇదే అదునుగా పోలీసులు గోండు ప్రజలపై విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. భయంకరమైన శబ్దాలతో సభా ప్రదేశం దద్దరిల్లుతోంది. హాహాకారాలు, అరుపులు, కేకలు, ఏం జరుగుతుందో తెలియని స్థితి. గంట, గంటన్నర తరువాత చూస్తే భయంకరమైన దృశ్యాలు రక్తంతో భూమి తడిసింది. శరీరాల నుంచి రక్తం కారుతూనే ఉంది. శవాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఒకే లారీలో శవాలతో పాటు గాయాలతో ఉన్న వారిని, కొన ఊపిరితో కొట్టుకుంటున్నవారిని ఒకరి మీద ఒకరిని కట్టెల మోపులాగా వేయడంతో ఇంకొందరు ఊపిరాడక చనిపోయారు. ఆ కాల్పుల్లో 130 మంది వరకు చనిపోయారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కనిపించకుండా పోయిన వారి సంఖ్యకు అంతులేదు. ఆ సంఘటన తరువాత నుంచి వడ్గాం గ్రామం కనకరాము కనిపించకుండా పోతే కొన్ని నెలల తరువాత పోలీసులు వచ్చి అతడు కాల్పుల్లో మరణించాడని చెప్పి ఐదు వందల రూపాయలు చేతిలో పెట్టి పోయారు. ఇలా దాదాపు నాలుగున్నర దశాబ్దాల నుంచి జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉన్నాయి.



ప్రభుత్వాలు మారుతున్నాయి. అన్ని పార్టీలలో ఆదివాసీ నాయకులున్నారు. అయినా ఈ రోజుకీ అమరులందరినీ గుర్తించలేక పోతున్నారు. సమస్యల్ని పరిష్కరించలేకపోతున్నారు. గుర్తించిన అమరుల కుటుంబాలకైనా పరిహారం ఇచ్చారా అంటే అదీ లేదు. 45 ఏళ్ల క్రితం ఉన్న స్థితే నేటికీ కొనసాగుతోంది.

ప్రభుత్వాలు మారుతున్నాయి. నాయకులు మారుతున్నారు. అన్ని పార్టీలలో ఆదివాసీ నాయకులున్నారు. అయినా ఈ రోజుకీ అమరులందరినీ గుర్తించలేకపోతున్నారు. సమస్యల్ని పరిష్కరించలేకపోతున్నారు. గుర్తించిన అమరుల కుటుంబాలకైనా పరిహారం ఇచ్చారా అంటే అదీ లేదు. దోపిడీలు, షావుకార్ల, వడ్డీ వ్యాపారుల, చౌకీదార్ల, పోలీసుల బూటకపు హత్యలు, ఏజెన్సీ ఆదివాసీ రక్షణ చట్టాల ఉల్లంఘన... 45 సంవత్సరాల క్రితం ఉన్న స్థితే నేటికీ కొనసాగుతోంది. రూపాలు వేరు కాని దోపిడి పాతదే. ఆదివాసీ గోండుల సాంప్రదాయం ప్రకారం చనిపోయిన వారికి పూజలు కూడా చేయనీయకుండా, స్థూపాలు కట్టకుండా చేశారు. ఒకవేళ కట్టినా దొంగచాటుగా వాటిని కూల్చేసేవారు. 1982 నుంచి 1999 వరకు ఉన్న ప్రభుత్వాలు గ్రామాల్లో పోలీసు బలగాల పహారా ఏర్పరచి, నిషేధాజ్ఞలు పెట్టాయి. తెలంగాణ ఉద్యమంలో స్థూపం వద్దకు వచ్చిన నాయకులు ప్రమాణాలు చేసి, ఇంద్రవెల్లి అమరులు ఏ ఆశయం కోసం ప్రాణాలర్పించారో... తెలంగాణ వస్తే వారి ఆశయాలను నెరవేరుస్తామని చెప్పారు. నిషేధాజ్ఞలను ఎత్తివేస్తామని, ఆ ప్రదేశాన్ని స్మృతి వనం చేస్తామని, అటవీ హక్కుల చట్టాలు అమలుపరుస్తామని చెప్పారు.

2017లో ప్రస్తుతం ఉన్న అమరవీరుల స్థూపం స్థలంలో స్మరించుకోవడానికి, పూజకు అనుమతి కొరకు హైకోర్టులో ఈ వ్యాస రచయిత, తదితరులు కోర్టులో పిటిషన్ వేసి అనుమతి తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్, 20న పూజలు జరుగుతున్నాయి. 2017 నుంచి కోర్టు ఆదేశాలతో గూడేలలో పోలీసు కూంబింగ్ తగ్గించారు కానీ, 144 సెక్షన్ ఇప్పటికి అమలు చేస్తూనే ఉన్నారు.

ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఏజెన్సీ అటవీ హక్కుల చట్టాలు అమలుచేస్తామని నమ్మబలికి, పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్. ఇది ఎవరి అభివృద్ధి కోసం? ఆదివాసులు ఈ దేశ పౌరులు కాదా? అడవి, ఆదివాసులకు రక్షణ లేదు. ఎప్పుడేం జరుగుతుందోనని అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బిక్కు బిక్కుమంటు ఆదివాసులు రోజులు గడుపుతున్నారు. వారిని రక్షించడం ప్రభుత్వాల బాధ్యత కాదా?

■ ఆత్రం భుజంగరావు
ఇంద్రవెల్లి అమరవీరుల ఆశయ సాధన సమితి వ్యవస్థాపకులు

చెడగొట్టు వాన

అంతవరకూ దూపతో
బీళ్లు చినుకు కోసం
నోళ్లు తెరిచి ఎదురుచూసాయి

భూమికి పచ్చల కంఠాభరణ
హారాన్ని కానుకగా
వర్షం సమర్పించింది

జనవరి పైరగాలికి
మామిడి తోట ఎదమీంచి
జారుతున్న ఓణీని సవరించుకుంది

వరిపంట కోతకు వచ్చిందనే
సంబురంతో రైతు పోచమ్మకు
కర్రె కోడిని బలిచ్చి కల్లు సాక పోసిండు

ఎండాకాలం వాకిట్లో
నులక మంచంపై పక్కవేసి
వేపచెట్టు విసనకర్రతో విసిరినా
నిశిరాత్రికి ఉక్కపోస్తుంది

హోరుగాలి వడగండ్ల వాన ఉరుములు
భయాందోళనతో అరచినా
ఏ ఒక్క అర్జునుడు వచ్చి
పిడుగుపాటును ఆపలేకపోయాడు

తీరా తెల్లారి చూస్తే వరిపంట
వీరునిలా నేలకొరిగింది
నల్లపూసల దండ పెరిగిపోయినట్టు
నేల రాలిన వడ్లగింజలు

ఇరగ్గాసిన మామిడి చెట్టు
బిడ్డల్లాంటి కాయల్ని పోగొట్టుకున్న
శోక మాతృమూర్తిలా నిలబడింది

ఇంతవరకూ జీవగంజి పోసిన వర్షం
ఇప్పుడు పంటల కడుపు మంట
కడగండ్ల చెడగొట్టు వాన అయ్యింది

— జూకంటి జగన్నాథం

- 2016లో వరంగల్‌కు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి, హసన్‌పర్తిలో ఏర్పాటుకు కసరత్తు
- స్థలం కేటాయింపులో ఎడతెగని నిర్లక్ష్యం
- 2023లో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించేందుకు ప్రయత్నాలు
- వరంగల్‌లోనే ఏర్పాటు చేయాలని గతేడాది రక్షణశాఖ మంత్రికి సీఎం విజ్ఞప్తి
- తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏర్పాటు చేసే దిశగా అడుగులు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖతో ఓరుగల్లు వాసుల ఆశల గల్లంతు!



వరంగల్‌కు మంజూరైన సైనిక్‌స్కూల్‌ను అక్కడే ఏర్పాటు చేయాలంటూ కేంద్ర రక్షణ శాఖ మంత్రికి గతేడాది విన్నవించిన సీఎం రేవంత్, ఎంపీ కడియం కావ్య (ఫైల్)

సిరిసిల్ల లేదా హుస్నాబాద్‌లో సైనిక్‌స్కూల్ ఏర్పాటు చేయాలని బండి సంజయ్ ఇటీవల రక్షణశాఖ మంత్రికి రాసిన లేఖ

సైనిక్ స్కూల్.. లేనట్టేనా?

7

దేశవ్యాప్తంగా 21సైనిక్‌స్కూళ్లను మంజూరు చేస్తూ 2016లో ఉత్తర్వులిచ్చిన కేంద్ర ప్రభుత్వం.. అందులో ఓరుగల్లుకు చోటిచ్చింది. తెలంగాణకు సంబంధించి ఓ సైనిక్‌స్కూల్‌ను వరంగల్ జిల్లాకు కేటాయించింది. కానీ తొమ్మిదేళ్లుగా ఆ స్కూల్‌కు కావాల్సిన 50ఎకరాల స్థలం.. రూ.100కోట్లకు నిధులు కేటాయింపులు లేకపోవటంతో ఆ స్కూల్ చివరకు పొరుగు జిల్లాకు తరలిపోయే పరిస్థితి ఏర్పడింది. అప్పట్లో డిప్యూటీ సీఎంగా ఉన్న కడియం శ్రీహరి తన నియోజకవర్గం పరిధిలోని హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఎల్కుర్తిలో ఈ సైనిక పాఠశాల ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. కానీ నాటి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించడంలో నిర్లక్ష్యం చేసింది. దీంతో 2023లో సదరు సైనిక్ స్కూల్‌ను సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించేందుకు ప్రయత్నాలు జరిగాయి. పరిణామాలను గమనించిన సీఎం రేవంత్‌రెడ్డి.. సైనిక్ స్కూల్‌ను వరంగల్‌లోనే ఏర్పాటు చేయాలంటూ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. అయితే కేంద్రం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోకి సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇటీవల కేంద్ర రక్షణ శాఖ మంత్రికి లేఖ రాయడం ఓరుగల్లు వాసుల్లో కలవరం రేపుతోంది. ఇది కార్యరూపం దాల్చితే వరంగల్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు ఆశలు గల్లంతేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



ములుగు జిల్లా వెంకటాపూర్‌లో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వేదికపై మంత్రులు సీతక్క, సురేఖ, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు



రెవెన్యూ సదస్సుకు హాజరైన రైతులు

పేదోడి కన్నీటిని తుడిచేందుకే భూ భారతి

- అర్హులందరికీ పైసా ఖర్చులేకుండా న్యాయం చేస్తాం
- ధరణితో ఒరిగిందేం లేదు
- భూమి లేని పింక్ చొక్కావాళ్లకు పట్టాలిచ్చారు
- అందుకే దాన్ని బంగాళాఖాతంలో వి సిరేశాం..
- పేదోడి చుట్టమైన భూభారతి చట్టాన్ని తెచ్చాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ములుగు జిల్లా వెంకటాపూర్‌లో భూభారతి రెవెన్యూ సదస్సు
- హాజరైన మంత్రులు సీతక్క, సురేఖ, ఎంపీ, ఎమ్మెల్యేలు

7



మాట్లాడుతున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్

'కమ్యూనిటీ' పెద్దలదే సమాజ శాంతిని కాపాడే బాధ్యత

- సత్ఫలితాలనిస్తున్న మధ్యవర్తిత్వ విధానం
- హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్
- కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణ కార్యక్రమం ప్రారంభం

6

రాజ్యాంగ పరిరక్షణకు కలిసికట్టుగా పోరాడాలి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు

జూలైవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకే జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 49, 50డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో ప్రకాశ్‌రెడ్డి పేట ఆటో స్టాండ్ జంక్షన్ నుంచి జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ అభియాన్ పాదయాత్ర డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బలహీనవర్గాల ప్రజల ఆకాంక్ష నెరవేరడం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడాబాబులే ముఖ్యమన్నారు. పార్లమెంట్ సాక్షిగా బీజేపీ రాజ్యాంగాన్ని అణగదొక్కాలని చూస్తోందని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు అన్నివర్గాల ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ మూర్ఖత్వపు పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీజేపీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. దేశ ప్రజలకు ప్రేమ పంచాలనే సదుద్దేశంతో రాహుల్‌గాంధీ పాదయాత్ర చేస్తున్నారని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏనుగుల మానస రాంప్రసాద్, నెక్కొండ కవిత కిషన్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాజమల్లారెడ్డి, మహ్మద్ అఫ్సర్, డివిజన్ నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, బండారి జనార్దన్‌గౌడ్, దొంతి తిరుపతిరెడ్డి, మహ్మద్ బషీర్, మహ్మద్ ఫయాజ్, మజిద్ మీర్జా, రాము, దివ్య, సునీత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

- రజతోత్సవ సభను విజయవంతం చేయండి
- గ్రామస్థాయి నుంచి జనసమీకరణ జరగాలి
- సభకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యాలు కలుగవద్దు
- వరంగల్ సభపై ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ సమీక్ష
- హాజరైన ఉమ్మడి జిల్లా నేతలు





సభ ఏర్పాట్లపై సమీక్షకు హాజరైన నేతలు, మాట్లాడుతున్న కేసీఆర్

వరంగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నేతలంతా సమన్వయంతో పనిచేసి ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని, ఇందులో భాగంగా గ్రామ స్థాయి నుంచి భారీగా జనసమీకరణ జరగాలని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఉమ్మడి వరంగల్ నేతలకు సూచించారు. 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై శుక్రవారం ఆయన ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఒడితెల సతీష్ సభ ఏర్పాట్ల గురించి అధినేతకు వివరించారు. 1200 ఎకరాల్లో సభ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని, పార్కింగ్‌కు సంబంధించి పనులు పూర్తి చేశామని తెలిపారు. అలాగే 16కిలోమీటర్ల అప్రోచ్ రోడ్లు, 11కిలోమీటర్ల వరకు రోడ్డు పొడుగునా ర్యాంపులు నిర్మాణం చేశామని, 360 లైటింగ్ టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లుగా వివరించారు. ఒక టవర్‌లో 12లైట్లుంటాయని తెలిపారు. 10లక్షల వాటర్ బాటిళ్లు, 10లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు. శనివారం నుంచి సభ వేదికను నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి జనాన్ని తరలించాలన్నారు. ఏ గ్రామం నుంచి ఎంత మంది వస్తున్నారో రికార్డులు తయారు చేయాలన్నారు. అంచనాలకు వించి జనసమీకరణ జరుగాలని సూచించారు. సభతో తెలంగాణ రాజకీయాల్లో అనేక మార్పులు జరుగుతాయని, భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కవితతో పాటు మాజీ ఎమ్మెల్యేలు చంద్రావతి, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో కనిపించని ఎర్రబెల్లి, పల్లా

ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ సమక్షంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఏకైక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య లాంటి నేతలు కనిపించకపోవటం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల బీఆర్ఎస్ నేతల మధ్య సమన్వయం లేదని, వర్ధన్నపేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ విషయంలో ఎర్రబెల్లికి వ్యతిరేకంగా ఓ వర్గం పావులు కదిపిందనే ప్రచారం జరిగింది. దేవన్నపేట వద్ద నిర్వహించాల్సిన సభను ఈ కారణంగానే ఎల్కతుర్తికి తరలించారన్న వాదన వినిపించింది. అయితే నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాల్లో బిజీగా ఉండటం వల్లే ఎర్రబెల్లి సమీక్ష రాలేదని, తమలో ఎలాంటి విభేదాలు లేవని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

మైనర్ల డ్రైవింగ్‌ను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మైనర్ల డ్రైవింగ్‌ను ప్రోత్సహించేవారితో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్ల ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా వాహనతనిఖీల్లో పట్టుబడ్డ మైనర్లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నామని తెలిపారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు అబ్జర్వేషన్ హోంకు తరలిస్తున్నామన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వాహన యజమాని లేదా తల్లితండ్రులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామన్నారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇచ్చినా నేరమేనన్నారు. అలాంటి వ్యక్తులకు సైతం జరిమానా విధించడంతో పాటు వాహనాలు స్వాధీనం చేసుకుం టామన్నారు. మైనర్లు వాహనం నడుపుతూ ఏదైనా ప్రమాదం జరిగి మరణం సంభవిస్తే మోటార్ వాహన చట్టం అనుసరించి వాహన యజమానికి 3ఏళ్ల జైలు శిక్ష లేదా 25వేల జరిమానా విధిస్తామన్నారు. పట్టుబడ్డ మైనర్‌కు 25 ఏళ్లు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ అర్హత కోల్పోతాడని, వాహన రిజిస్ట్రేషన్ యేడాదిపాటు పాటు రద్దు చేస్తారన్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 63 మంది మైనర్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపిన సంఘటనల్లో 35,278 కేసులు నమోదు చేసి 12,552 వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడ్డ వాహనదారులకు రూ.16 లక్షల 47 వేల జరిమానా విధించామన్నారు. ఇప్పటికైనా తల్లితండ్రులు, వాహన యజమానులు మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులకు వాహనాలు ఇచ్చి చిక్కుల్లో పడొద్దని సీపీ సూచించారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

కాజీపేటలో క్రీస్తు సిలువ యాత్ర

కాజీపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో శుక్రవారం పలు చర్చిలలో గుడ్‌ఫ్రై డేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తును స్తుతిస్తూ సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రభువు మానవాళికి ఇచ్చిన సందేశాన్ని పాస్టర్‌లు, ఫాదర్‌లు చదివి వినిపించారు. సెయింట్ జోసఫ్ చర్చిలో ఫాదర్ బల్లు ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం సిలువమార్గం నిర్వహించారు. క్రీస్తు సిలువను మోస్తూ ఆయన పడిన శ్రమలను ఓ క్రైస్తవుడు వేసిన ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. సిలువను మోస్తూ కొరడా దెబ్బలు తింటూ సిలువమార్గం ప్రదర్శన చేస్తూ కాజీపేట పురవీధుల్లో ర్యాలీ చేశారు. క్రీస్తు చేసిన త్యాగాన్ని గుర్తుచేశారు. పరిశుద్ధ సిలువ మార్గంలో ఏసు వేషధారణలతో కీర్తనలు ఆలపిస్తూ ప్రదర్శనలు చేపట్టారు. ఫాతిమానగర్ కేథడ్రిల్ చర్చిలో సైతం శిలువ మార్గం నిర్వహించారు. క్రీస్తు సిలువపై ఉన్న విగ్రహ ప్రదర్శన చేశారు. సాయంత్రం ఆంథోని క్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చి ఫాదర్ కాసుమర్రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేసి దేవుడి ఆశీర్వాదం ఇచ్చారు. సోమిడి బాలయేసు దేవాలయంలో మానవుల కోసం కీస్తు ఏ విధంగా మరణించాడో పురవీధులలో సిలువ యాత్ర నిర్వహించారు. చర్చి కమిటీ అధ్యక్షుడు కుమ్మరి నాగరాజు, ఉపాధ్యక్షుడు మాచర్ల జయాకర్, సెక్రటరీ కుమ్మరి రవికుమార్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్దఎత్తున హాజరయ్యారు.



కాజీపేటలో సిలువ యాత్ర ప్రదర్శన

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మక పథకం

ఎమ్మెల్యే మురళీనాయక్



మహమూద్‌పట్నం దళితవాడలో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు రేషన్ షాపుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం అందించే స్కీం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న చరిత్రాత్మక పథకమని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని మహమూద్‌పట్నం దళితవాడలో శుక్రవారం ఇస్సంపల్లి సువర్ణయుగందర్ దంపతుల ఇంట్లో వారి కుటుంబంతో కలిసి సన్నబియ్యంతో వండిన భోజనాన్ని ఎమ్మెల్యే ఆరగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎవరూ చేయని విధంగా పేదలకు సన్నబియ్యం ఇవ్వడమనేది కాంగ్రెస్ ప్రభుత్వానికి పేటెంట్ హక్కు లాంటిదని అన్నారు. అనంతరం గ్రామంతోపాటు ఉప్పరపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, సొసైటీ చైర్మన్లు మర్రి రంగారావు, దీకొండ వెంకన్న, గుగులోత్ దస్రూనాయక్ అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, అజ్మీర సురేష్ నాయక్, బండారు వెంకన్న, దయాకర్, చిలువేరు సమ్మయ్య గౌడ్, నూకల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ భూక్య శ్రీనివాస్, డీటీ ఎర్రయ్య, ఏవో బి.వెంకన్న పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు, పీఆర్సీ బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చావ రవి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ డీఏలు, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. హనుమకొండలోని యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన కుటుంబ సంక్షేమ నిధి సర్వసభ్య సమావేశానికి రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినప్పటికీ ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడుదల చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. యూటీఎఫ్ కుటుంబ సక్షేమ నిధి పథకంలో ఇప్పటి వరకు 10వేల మంది సభ్యులుగా చేరారన్నారు. ఈ పథకంలో చేరిన వారికి సాధారణ, ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు విరాళాలు సేకరించి ప్రతీ కుటుంబానికి రూ.6 లక్షలు ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 37మంది ఉపాధ్యాయులకు చెల్లించామన్నారు. ఈ సమావేశంలో నాయకులు నాగమల్లేశ్వర్‌రావు, రంజిత్‌కుమార్,సుజన్‌ప్రసాద్‌రావు, వెంకటేశ్వర్‌రావు, రవీందర్‌రాజు, రాజు, వెంకట్‌రెడ్డి, దామోదర్, రఫూఫ్, శ్రీనివాస్, సమ్మక్క, రవీందర్, రమేష్, కుమారస్వామి, విజయ్, కుమారస్వామి, రాజిరెడ్డి, రవీందర్, రాయబోస్, అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కమ్యూనిటీ' పెద్దలదే సమాజ శాంతిని కాపాడే బాధ్యత

- సత్ఫలితాలనిస్తున్న మధ్యవర్తిత్వ విధానం
- హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్
- కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణ కార్యక్రమం ప్రారంభం



మాట్లాడుతున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్

వరంగల్ లీగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వ్యక్తులు, సమూహాల మధ్య వచ్చే వివాదాలను శాంతియుతంగా పరిష్కరించి, ప్రశాంతమైన సమాజాన్ని స్థాపించడానికి కమ్యూనిటీ పెద్దలు నడుం బిగించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని సహకార భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించి ఆయా జిల్లాల న్యాయ సేవాసంస్థలు గుర్తించిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని చీఫ్ జస్టిస్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ.. ఏ వివాదమైనా, ఒక వ్యక్తి మధ్యనో లేదా సమూహాల మధ్యనో ఏర్పడుతుందని, అయితే ఆ వ్యక్తిగానీ సమూహం గానీ ఏదో ఒక కమ్యూనిటీకి చెందిన వారై ఉంటారన్నారు. అటువంటి పరిస్థితుల్లో అదే కమ్యూనిటీకి చెందిన పెద్దవారు వారికి నచ్చచెప్పినట్లయితే వివాదాలు సుహృద్భావ వాతావరణంలో పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని, ఈ బృహత్తర ఆలోచన నుంచి ఉద్భవించినదే కమ్యూనిటీ మీడియేషన్ విధానమన్నారు. మొదటి సారిగా భారతదేశంలో కేరళ రాష్ట్రంలో ఈ విధానం విజయవంతమైందని తెలిపారు. సమాజంలోని కమ్యూనిటీ పెద్దలు కోర్టుల దాకా రాకుండా వేల సంఖ్యలో వివాదాలను పరిష్కరించారన్నారు. ఆ తరువాత 2023లో వచ్చిన మీడియేషన్ చట్టం ఈ విధానానికి చట్టబద్ధత కల్పించిందని ఆయనఅన్నారు. ముఖ్యంగా కొన్ని దశాబ్దాలుగా సమాజంలో భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు, పిల్లలమధ్య తగాదాలు పెరిగిపోతున్నాయని, వీటికి చక్కటి పరిష్కారం కమ్యూనిటీ మీడియే షన్ అని జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు.ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, ఇంటిలో సర్దిచెప్పే పెద్దలు లేకపోవడం, భార్యాభర్తల మధ్య ఈగోలు వారి మధ్య వివాదాలకు ఎక్కువ కారణం అవుతున్నాయని, వీటిని కమ్యూనిటీ పెద్దలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయస్థానాలలో కేసులు ఉంటే ఇరుపక్షాలలో ఒకరు గెలిస్తే మరొకరు పైకోర్టుకు వెళ్తారని, కానీ కమ్యూనిటీ మీడియేషన్ విధానంలో వివాదం పరిష్కారమైతే వ్యక్తులే కాకుండా కుటుంబాలు కూడా సంతోషంగా ఉంటాయని, ఇటువంటి గురుతర బాధ్యతలను పెద్దలు తమ భుజస్కందాల మీద వేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఒక విశ్రాంత వైస్ చాన్సలర్ కమ్యూనిటీ మీడియేటర్‌గా సాధించిన విజయాలను జస్టిస్ సుజోయ్ పాల్ వివరించారు. కలహించుకుంటున్న భార్యాభర్తలకు ఒక తండ్రిలాగా, తాతలాగా నచ్చచెప్పి వారిని కలిపినట్లు ఆయన చెప్పారన్నారు.

రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్ పంచాక్షరి మాట్లాడుతూ.. నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్‌లలో ఈ కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు విజయవంతంగా పని చేస్తున్నారని ప్రశంసించారు. గత ఏప్రిల్ 7వ తేదీన కామారెడ్డిలో ఒకే సారి 12 కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వీబీ నిర్మలాగీతాంబ, సీహెచ్ రమేష్‌బాబు, ఇతర జిల్లాల న్యాయమూర్తులు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయి కుమార్, క్షమా దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

చెరువుల వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలి

- పిల్లలు వాటిలో పడకుండా చర్యలు తీసుకోవాలి
- హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు సీనియర్ సిటిజన్స్ వినతి

హనుమకొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా వేసవి జలాశయాల వద్ద సరైన రక్షణ చర్యలు చేపట్టాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం నగరానికి వచ్చిన హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్‌కు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేంధర్ నాయత్వంలో ప్రతినిధి వర్గం వినతిపత్రం అందచేసింది. వేసవిలో ఈత పేరిట చిన్న పిల్లలు, యువకులు జలాశయాల్లో మునిగి ప్రాణాలు కోల్పోకుండా పటిష్టమైన చర్యలు తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి తగు ఆదేశాలు ఇవ్వాలని ఆ వినతి పత్రంలో కోరారు. వేసవి పాఠశాలలకు సెలవుల సందర్భంగా చెరువులు, కుంటలు, కాలువల్లో ఈతకు వెళ్లి ఏటా 800 నుంచి 900 మంది చిన్నారులు జలాశయాల్లో మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి అకాల మరణల నివారణకు ప్రమాదకరంగా ఉన్న బావులు, నీటి గుంతలు, చెరువులు, కుంటలు, కాలువల వద్ద ప్రమాద హెచ్చరికలను ఏర్పాటు చేయాలని, కాపలాదారులను నియమించాలని, గ్రామాల్లో చాటింపు వేయాలని కోరారు.

ప్రతీ గ్రామంలో ఉండే విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ (వీసీపీసీ)లను చిన్నారుల సంరక్షణ విషయమై అప్రమత్తం చేయాలని, వేసవి సెలవుల్లో తగు జాగ్రత్తలు తసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. జిల్లా స్థాయిలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై తగిన ఆదేశాలు జారీ చేయాలని చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్‌ను కోరారు. చీఫ్ జస్టిస్‌ను కలిసిన వారిలో మార్క రవీందర్ గౌడ్, జార్జ్, తాడూరి లక్ష్మి నారాయణ, గంగారపు యాదగిరి, పరికిపండ్ల వేణు తదితరులు ఉన్నారు.

వరంగల్ జిల్లాకు మరో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటు చేయాలి

- ఉమ్మడి జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధుల డిమాండ్
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతి పత్రం

వరంగల్ లీగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లాకు మరో ఫ్యామిలీ కోర్టును ఏర్పాటు చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కమ్యూనిటీ వలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి హనుమకొండకు విచ్చేసిన ప్రధాన న్యాయమూర్తికి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. హనుమకొండలో ఉన్న ఫ్యామిలీ కోర్టుకు కూడా రెగ్యులర్ జడ్జిని నియమించాలని వారు విజ్ఞప్తి చేశారు. రెండేళ్ల నుంచి ఫ్యామిలీ కోర్టులో కేసులు పరిష్కారానికి నోచుకోవడం లేదని, ఈ విషయంలో ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే సమస్య పరిష్కరించాలని వారు కోరారు. అలాగే హనుమకొండ, వరంగల్ కోర్టులో మౌళికంగా పేర్కొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రతీకోర్టులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వరంగల్ కోర్టులో పెరిగిన సివిల్ కేసుల భారం తగ్గించడానికి మరో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని, కొత్తగా ఏర్పాటైన ఏసీబీ కోర్టుకు జడ్జిని వెంటనే నియమించాలని కోరారు.

కాగా, న్యాయవాద ప్రతినిధులు అందజేసిన వినతి పత్రంపై ప్రధాన న్యాయమూర్తి సుజయ్‌పాల్ సానుకూలంగా స్పందించినట్లు హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్ తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన కార్యదర్శులు డి.రమాకాంత్, కొత్త రవి, ఉపాధ్యక్షుడు మైదం జయపాల్, సంయుక్త కార్యదర్శులు ఎం.శ్రీధర్, ఆర్.శశిరేఖ, నాగేంద్ర, క్రీడా జాయింట్ సెక్రటరీలు ఎం.శివప్రసాద్, సి.మల్లేశం, గ్రంథాలయ సెక్రటరీలు జి.కిశోర్ కుమార్, కె.వెంకటేష్, కార్యవర్గ సభ్యులు పి.కమలాకర్, శివకుమార్, డి.సునిల్, నిఖిల్, స్వాతి, ఇందిరవేద కుమారి, ఆశీర్వాదం, రాజేశ్వర్ రావు, ఎస్.శ్రీనివాస్, ఇజ్జగిరి సురేష్, కె.నిర్మలజ్యోతి, ఎం.రాజు, జె.రవి, ఎం.మేఘనాథ్, ఎం.మహేందర్, టి.అరుణ తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసిన హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు

కాజీపేట మీదుగా 22 నుంచి వేసవి ప్రత్యేక రైళ్లు

కాజీపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈనెల 22 నుంచి ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (07077) చర్లపల్లి- డెహ్రాడూన్ స్పెషల్ రైలు ఈ నెల 22 నుంచి వచ్చేనెల 27 వరకు ప్రతీ మంగళవారం నడుస్తోంది. (070778) డెహ్రాడూన్ - చర్లపల్లి ఈనెల 24 నుంచి వచ్చేనెల 29 వరకు ప్రతీ గురువారం నడుస్తుంది. (08263)బిలాస్‌పూర్-కాచిగూడల మధ్య నడిచే ఈ స్పెషల్ రైలు మే 12 నుంచి జూన్ 2 వరకు ప్రతీ సోమవారం నడుస్తుంది. (08264) కాచిగూడ - బిలాస్‌పూర్‌ల మధ్య నడిచే ఈ స్పెషల్ రైలు మే 13 నుంచి జూన్ 3 వరకు ప్రతీ మంగళవారం నడుస్తుందని రైల్వే అధికారులు చెప్పారు. ఈరైలు కాజీపేట జంక్షన్, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్ష, నాగ్‌పూర్, ఇటార్సీ, రాణి కమలపాడు, బిన, జాన్సీ, ఆగ్రా, మదుర, హజరత్ నిజాముద్దీన్, మీరట్, రూర్కీ, హరిద్వార్ రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

26 నుంచి పీజీ కోర్సుల ఆఖరు సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 26 నుంచి ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సుల(నాన్ ప్రొఫెషనల్స్) ఆఖరు సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు తెలిపారు. ఏప్రిల్ 26, 28, 30, మే 2, 5, 7వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పరీక్షల నియంత్రణాధికారులు పేర్కొన్నారు.

రోహిణి ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రద్దు?

మహబూబాబాద్ జిల్లాలో రెండు ఆస్పత్రులవి కూడా..

సీఎంఆర్ఎఫ్ చెక్కుల కుంభకోణంలో సర్కారు చర్యలు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల స్కామ్ ఆరోపణలతో హనుమకొండ సుబేదారిలోని రోహిణి మెడికేర్ ప్రయివేట్ లిమిటెడ్ ఆస్పత్రి గుర్తింపును శుక్రవారం రద్దు చేసినట్లు తెలిసింది. గతంలో సీఎం రిలీఫ్‌ఫండ్ నిధుల వ్యవహారంలో రాష్ట్రంలోని 28 ఆస్పత్రులు తప్పుడు, అనుమానాస్పద బిల్లులు సమర్పించి కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ విచారణ జరిపించింది. హనుమకొండలోని రోహిణి మెడికేర్ ప్రయివేట్ లిమిటెడ్ నకిలీ బిల్లులు అందించి మోసానికి పాల్పడినట్లు సీఐడీ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెండ్ యాక్ట్ - 2010 కింద రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 28 ప్రయివేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఇందులో హనుమకొండ నుంచి రోహిణి ఆస్పత్రి, మహబూబాబాద్ నుంచి రెండు ఆస్పత్రులు ఉన్నట్లు తెలుస్తోంది.

తెలంగాణను దోచుకున్న కేసీఆర్

కూరపాటి వెంకట్ నారాయణ



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కూరపాటి వెంకట్ నారాయణ, పుల్లూరు సుధాకర్

వడ్డెపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అప్పులు లేని మిగులు బడ్జెట్ గల తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేతిలో పెడితే దాన్ని నిలువున దోచుకున్న చరిత్ర కేసీఆర్‌దేనని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి రూ.7లక్షల కోట్ల రుణభారాన్ని మోపి రాబోయే 20 ఏళ్ల కాలంలో తెలంగాణ సమాజం పన్నులుచెల్లించి అప్పులు తీర్చాల్సిన విధంగా కేసీఆర్‌రాష్ట్రాన్ని మార్చారని తెలిపారు. కేసీఆర్ దుర్మార్గపు పాలన వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై కోలుకోలేని దుస్థితికి చేరుకుందని పేర్కొన్నారు. ప్రజలకు భవిష్యత్తులో అవసరమైన భూములు, ఆస్తులు అమ్మి కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టాల్సిన దుర్గతి పట్టిందని ఆరోపించారు. బంగారు తెలంగాణను భ్రష్టు పట్టించి మద్యం విక్రయాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కేసీఆరే నడిపి ప్రజానీకాన్ని మద్యం మత్తులో దింపారని దుయ్యబట్టారు. తెలంగాణ సమాజాన్ని మరోసారి మోసం చేసేందుకు రజతోత్సవాల పేరుతో మళ్లీ సభలు, సమావేశాలు పెట్టుతూ మోసం చేసేందుకు కాలుకు బలపం కట్టుకొని నేతలు తిరుగుతున్నారని తెలిపారు. వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కూరపాటి వెంకట్‌నారాయణ కోరారు. ధరణి పోర్టల్ పేద, మధ్యతరగతి రైతుల పాలిట శాపంగా మార్చింది కేసీఆరేనని విమర్శించారు. తెలంగాణసాధనలో ముఖ్య భూమిక పోషించిన ఉద్యమకారులకు మొండి చెయ్యి చూపారని ఆరోపించారు.

తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం చైతన్యవంతమై బీఆర్ఎస్ నేత కేసీఆర్ కల్లబొల్లి మాటలకు మోసపోవద్దని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్లు సోమ రాంమూర్తి, పల్లపు సమ్మయ్య, జిల్లా నేతలు చిల్లా రాజేంద్రప్రసాద్, అనుముల రమేష్, రాచకొండ ప్రవీణ్‌కుమార్, శానబోయిన అశోక్, కృష్ణ, ప్రభాకర్ గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో సిగరెట్ తాగిన వ్యక్తిపై కేసు

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అడవిలో సిగరెట్ తాగిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏటూరునాగారం ఫారెస్టు దక్షిణ విభాగ రేంజ్ అధికారి అబ్దుల్ రహ్మాన్ తెలిపారు. శుక్రవారం ఏటూరునాగారం దక్షిణ రేంజ్ పరిధిలోని అడవిలో వెంకటాపురం మండలానికి చెందిన జాడి సాయినాథ్ అగ్గిపెట్టెను కలిగి సిగరెట్ తాగుతుండగా అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రూ.5వేల జరిమానా విధించినట్లు తెలిపారు. వేసవిలో కార్చిచ్చు సంఘటనలు సంభవించకుండా ఇలాంటి చర్యలు తీసుకుంటున్నామని, అటవీ సంపదకు నష్టం కలిగించే పనులు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అడవుల్లో చెలరేగే మంటలను అదుపులో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఉరేసుకుని మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

కాజీపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడింది. కాజీపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..కాజీపేట దర్గాకు చెందిన ఆమంచ అర్చన(32) భూపాలపల్లిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. ఈమెకు 2022లో వివాహమై విడాకులయ్యాయి. అప్పట్నుంచే మానసిక వేదనకు గురవుతోంది. కొన్నిరోజులుగా ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. డ్యూటీకి సెలవు పెట్టి దర్గాలోని తన సొంత ఇంట్లో ఉంటోంది. శుక్రవారం దర్గాలో తన పెంట్ హౌస్‌లో తలుపులు వేసుకుని చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకుల సమాచారం మేరకు మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లవన్‌కుమార్ తెలిపారు.

స్టెరాయిడ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు


- రూ.20వేల మందులు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాం నాయక్

మట్టెవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదకరమైన స్టెరాయిడ్స్ టాబ్లెట్స్, ఇంజక్షన్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని వరంగల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఏసీపీ నందిరాం నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ డాక్టర్స్‌కాలనీకి చెందిన కందగట్ల శ్రవణ్ కుమార్ అలియాస్ కిరణ్ అనే వ్యక్తి లైసెన్స్ లేకుండా స్టెరాయిడ్స్ విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో మట్టెవాడ పోలీసులు, నార్కోటిక్స్ సిబ్బంది డాక్టర్స్ కాలనీలోని శ్రవణ్‌కుమార్ ఇంట్లో తనిఖీ చేయగా స్టెరాయిడ్స్ టాబ్లెట్స్, ఇంజక్షన్లు లభించాయి. ముందుగా శ్రవణ్‌కుమార్ సుబేదారి ప్రాంతంలోని జేడీ జిమ్ ట్రైనింగ్ తీసుకుంటున్న సమయంలో హనుమకొండ ప్రాంతానికి చెందిన ప్రశాంత్ పరిచయం అయ్యాడు. స్టెరాయిడ్స్ తీసుకుంటే కండరాలు బాగా వస్తాయని, శరీరాకృతి పెంచుకోవచ్చని ప్రశాంత్ చెప్పాడు. దీంతో అప్పటి నుంచి శ్రవణ్ కుమార్ ఇంజక్షన్స్ వేసుకొని జిమ్ చేస్తూ ఉన్నాడు. ఇలా ఐదేళ్ల నుంచి స్టెరాయిడ్స్ తీసుకుంటూ ఉన్నాడు. ఈక్రమంలో వైజాగ్‌కు చెందిన మణికంఠ, ఆనంద్‌ల వద్ద ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి స్టెరాయిడ్స్ తెప్పిస్తున్నాడు. తొందరగా శరీరాకృతితో పాటు కండరాలు పెంచుకోవచ్చని యువకులను నమ్మించి స్టెరాయిడ్స్ టాబ్లెట్స్, ఇంజక్షన్లు విక్రయిస్తూ పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాడు. నిందితుడి వద్ద రూ.20వేల విలువజేసే స్టెరాయిడ్స్ టాబ్లెట్స్, ఇంజక్షన్లు స్వాధీనపర్చుకున్నారు. శ్రవణ్‌కుమార్‌తో పాటు హనుమకొండకు చెందిన ప్రశాంత్, వైజాగ్‌కు చెందిన మణికంఠ, ఆనంద్‌లపై కేసు నమోదు చేశారు. ఈ సమావేశంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్‌ఐ విఠల్ పాల్గొన్నారు.

రామప్పలో అంతర్జాతీయ హెరిటేజ్ దినోత్సవం

హెరిటేజ్ దినోత్సవంలో ప్రొఫెసర్ పాండురంగారావు తదితరులు, రామప్ప ఆలయంలో డైరీని ఆవిష్కరిస్తున్న అర్చకులు

వెంకటాపూర్, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చారిత్రక కట్టడాల (హెరిటేజ్) దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాక అధ్యక్షుడు ప్రొఫెసర్ పాండురంగారావు, తెలంగాణ రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాశ్‌రావు హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా దోహదపడే అంశాలపై చర్చించారు. రామప్ప దేవాలయ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు దేవప్రతాప్, సాంబయ్య, గణపతి, రామప్ప పరిరక్షణ సమితి కన్వీనర్ అకిరెడ్డి రామ్మోహన్‌రావు, నీట్ వరంగల్ ప్రొఫెసర్లు జీఆర్‌సీ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలుగు డైరీ ఆవిష్కరణ

రామప్ప దేవాలయంలో తెలుగు డైరీని తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, ఉపాధ్యక్షుడు కోమళ్లపల్లి శరీశ్‌శర్మ, మోహన మఠం ఉమాశంకర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ రామప్ప దేవాలయంలో కేంద్ర పురావస్తుశాఖ ఆధీనంలో ఉన్న నేపథ్యంలో మంత్రి సీతక్క, దేవాలయం ముందు భాగంలో టూరిజం శాఖతో కలిపి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అర్చక ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జేఏసీ పక్షాన వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. త్వరలోనే సదస్సు ఏర్పాటు చేసి అర్చకుల సమస్యలు పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని చెప్పారు.

పేదోడి కన్నీటిని తుడిచేందుకే

భూ భారతి

అర్హులందరికీ పైసా ఖర్చులేకుండా న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న మంత్రులు సీతక్క, కొండ సురేఖ

- ధరణితో ఒరిగిందేం లేదు
- భూమి లేని పింక్ చొక్కావాళ్లకు పట్టా ఇచ్చారు
- అందుకే దాన్ని బంగాళాఖాతంలో విసిరేశాం
- పేదోడి చుట్టమైన భూభారతి చట్టాన్ని తెచ్చాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ములుగు జిల్లా వెంకటాపూర్‌లో భూభారతి రెవెన్యూ సదస్సు
- హాజరైన మంత్రులు సీతక్క, సురేఖ, ఎంపీ, ఎమ్మెల్యేలు

ములుగు / వెంకటాపూర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పేదోడి కన్నీటిని తుడిచేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం పైలెట్ ప్రాజెక్టులో ఎంపిక చేసిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తెచ్చి రైతులను మోసం చేస్తే.. తాము దానిని బంగాళాఖాతంలో తొక్కి భూ భారతి చట్టాన్ని తెచ్చామన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో ఇంత వరకు ఎలాంటి పత్రాలు లేని ఆబాది అని పిలుచుకునే నివాస గృహాలకు డాక్యుమెంట్లు ఇచ్చే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. భూభారతి వల్ల పెండింగ్‌లో ఉన్న 9.24 లక్షల దరఖాస్తుదారులకు ఒక్క పైసా ఖర్చులేకుండా న్యాయం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో చుట్టమనుకున్న చట్టం పేదోడికి శత్రువుగా మారిందని, ధరణి పోర్టల్‌తో రైతుల బతుకులు రోడ్డున పడ్డాయన్నారు. భూమితో సంబంధంలేని పింకు చొక్కా వేసుకున్నోళ్లకు పట్టాలు ఇచ్చి, రైతు బంధు ద్వారా లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. కాస్తులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వకుండా మోసం చేశారని గుర్తు చేశారు. దొర పార్టు బీ తీసుకొచ్చి అందులో 18 లక్షల ఎకరాల భూమికి సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారన్నారు. వాటిలో 6 లక్షల ఎకరాలకుపైగా పేదలకు చెందినవేనన్నారు., ధరణితో కొండనాలుకకు మందు వేస్తే ఉన్ననాలుక ఊడినట్లు అయ్యిందని ఎద్దేవా చేశారు. 2020 భూ చట్టం వల్ల ప్రజలకు విసుగొచ్చిందని, అందుకే ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు న్యాయం చేసేందుకు భూ భారతి చట్టాన్ని తెచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వేయర్ల కొరత వేధిస్తోందని, అర్హులైన 6వేల మందికి శిక్షణ ఇచ్చి ప్రతీ గ్రామానికి పంపిస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయంలో తప్పు ఏమైనా జరిగితే దానిని సరిదిద్దుకుంటామని, గత ప్రభుత్వంలో దొర ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే వెనక్కి తగ్గేదే లేదన్నట్టు వ్యవహరించేవాడని వ్యాఖ్యానించారు. భూ భారతి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖ కార్యాలయం, సీసీఎల్ఏ కార్యాలయాలను అనుసంధానం చేస్తున్నామని, త్వరలోనే టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. గిరిజనులు, గిరిజనేతరులుండే ప్రాంతాల్లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని, దొర అర్ధరాత్రి తీసుకున్న నిర్ణయాలకు వీఆర్వో వ్యవస్థ లేకుండా పోయిందని, దీంతో గ్రామ స్థాయి అధికారులు లేక ప్రజలు చెప్పులరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందన్నారు. వారి బాధ చూడలేకనే భూ భారతిలో 14 నూతన చట్టాలను తీసుకొచ్చామన్నారు. దీంతో కోర్టుకు వెళ్లకుండానే రైతుల భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ధరణి దళారులు, గులాబీ పార్టీ గులాములిచ్చే డబ్బులతో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూలగొడితే ప్రజలే గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు.

రైతు కళ్లల్లో ఆనందం కోసమే : మానుకోట ఎంపీ బలరాంనాయక్

రాష్ట్రంలోని రైతుల కళ్లలో ఆనందం నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు పరుస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా నూతన పథకాలను కూడా అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యంతో పేదలు కడుపునిండా అన్నం తింటున్నారని అన్నారు.



సభలో మాట్లాడుతున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఎంపీ బలరాం నాయక్

ధరణి పేరిట రైతులను దగా చేశారు : గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చి రైతులను దగా చేసిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పదేళ్ల కాలంలో భూములకు హక్కులు కల్పించలేక విఫలమైందని దుయ్యబట్టారు. గ్రామ స్థాయిలో వీఆర్ఏలను తొలగించి వారికి అన్యాయం చేశారని గుర్తు చేశారు. దున్నేవాడికే భూమి హక్కు కల్పించాలనే ఉద్దేశంతో భూ భారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందన్నారు.

కొత్త చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కేఆర్ నాగరాజు, వర్ధన్నపేట ఎమ్మెల్యే

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి నూతన చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కోరారు. రైతుల పాపం తగిలే గత ప్రభుత్వం ఓటమి పాలైందని వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ(ఫైనాన్స్) రామకృష్ణారావు, రెవెన్యూ సెక్రటరీ బుద్ధ ప్రకాశ్, ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆర్డీవో వెంకటేశం, వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూమితో రైతులది తల్లీ బిడ్డల అనుబంధం

- మంత్రి సీతక్క

భూమికి రైతుకు ఉన్న అనుబంధం తల్లీబిడ్డలకున్న అనుబంధంలాంటిదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ముందున్న భూములకు సంబంధించిన హక్కులను వారు అధికారంలోకి వచ్చాక తొలగించారని ఆరోపించారు. ఎవరి భూమి వారికే చెందాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చారని, గత ప్రభుత్వం అధికారులను దొంగలను చేసి, వీఆర్‌వోలను పక్కకు పెట్టిందని ఆరోపించారు. ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అందుకే తెల్లరేషన్ కార్డున్న ప్రతీ ఒక్కరికి సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, గుంట భూమి లేని పేదలకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ చేసిన అరాచకాలకు చెక్ పెట్టేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు.

దేశానికి రైతు వెన్నెముక

- మంత్రి సురేఖ

రైతు దేశానికి వెన్నెముకని.. రైతు లేనిదే రాజ్యం లేదని, ఆ రైతు ఆరుగాలం కష్ట పడి పండిస్తేనే మన ఆరువేళ్లు నోట్లోకి పోతాయని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులను అన్ని విధాల ఆదుకున్నారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చి రైతుల నోట్లో మట్టి కొట్టిందని విమర్శించారు. రైతుల కళ్లలో నీళ్లు చూడలేకనే సీఎం రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చారని అన్నారు.

వెంకటాపూర్ రెవెన్యూ సదస్సులో 746 దరఖాస్తులు

వెంకటాపూర్, ఏప్రిల్ 18, (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 746 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బాద గిరిబాబు తెలిపారు. కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు రాలేదంటూ 308, కొత్తపట్టాదారు పాస్‌పుస్తకంలో వివరాలు తప్పుగా నమోదయ్యాయంటూ 24, విస్తీర్ణం తక్కువ నమోదయ్యాయంటూ 10, నిషేధిత జాబితాలో 2, సాదాబైనాలో 268, ఈ-సర్టిఫికెట్ రాలేదంటూ 10, అసైండ్ భూమి సమస్య అంటూ 65, సర్వే సబ్ డివిజన్ సమస్యంటూ 2, భూసేకరణ సమస్య అంటూ 1, ఇతర సమస్యలపై 58 దరకాస్తులు వచ్చాయని వివరించారు.

ధరణిలో పేరు నమోదు కాలే..



నా పేరు మీద భూమిని మార్చాలని కోరుతూ పదేళ్లుగా అన్ని కార్యాలయాల చుట్టూ తిరిగా. అయినా సమస్యకు పరిష్కారం లభించలేదు. గతంలో సాదా బైనామా ద్వారా పత్రాలు ఇచ్చినప్పటికీ ధరణి పోర్టల్‌లో పేరు నమోదు కాకపోవడంతో రైతుబంధు అందలేదు. బ్యాంకులు రుణాలివ్వడం లేదు. ఈ ఇబ్బందులను గుర్తించి నూతన భూ భారతిలో పట్టా అందజేయాలని కోరుతున్నా.

- తైనవేణి సరోజన, వెంకటాపూర్

మోకాపై ఉన్నా పట్టా రాలే..



నేను సాగు చేసుకుంటున్న భూమిలో పలు రకాల పంటలు పండిస్తున్నప్పటికీ ధరణి వల్ల నేటి వరకూ పట్టా రాలేదు. మోకాపై ఉన్నప్పటికీ ఇతరుల పేరుపై భూమి ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా నా పేరుపై పట్టా చేయండి.

- తుత్తూరు పర్వతాలు, వెంకటాపూర్

ధరణితో ఇబ్బందులు ఎదుర్కొన్నా..



ధరణితో అనేక ఇబ్బందులకు గురయ్యాను. నా భూమిని నా పేరు మీద మార్చుకోవడానికి చెప్పులు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగా. అయినా పనికాలేదు. ఈభూభారతిలోనైనా నాకు న్యాయం చేయాలని వెడుకుంటున్నా.

- మొగిళి, వెంకటాపూర్

రేపటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు

- పది పరీక్షకు 2,679 మంది, ఇంటర్‌కు 4,707 మంది విద్యార్థుల హాజరు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 34 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందం గౌడ్ తెలిపారు. ఈ నెల 20 నుంచి 26 వరకు టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయి. 26 నుంచి మే 3 వరకు ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. పది, ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, ప్రత్యేకమైన సబ్జెక్టుల పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. పదో తరగతి పరీక్షకు 2,679 మంది హాజరవుతుండగా, ఇంటర్మీడియెట్ పరీక్షకు 4,707 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇక పరీక్షల నిర్వహణ కోసం 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, 34 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 36 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు. ఇక ప్రతీ పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ కోసం 35 మందిని నియమించగా, ఇన్విజిలేషన్ చేసేందుకు 418 మందిని నియమించారు. ఇక ఫ్లయింగ్ స్క్వాడ్ కోసం 9 మందిని నియమించారు. కాగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు కావాల్సిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేశామని సదానందం చెప్పారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలని, పరీక్షా కేంద్రాల్లోకి ఇన్విజిలేటర్లు, విద్యార్థుల సెల్‌ఫోన్లు అనుమతించడం లేదని తెలిపారు.


జిల్లాల వారిగా ఇలా...

జిల్లా	ఇంటర్	పది	సెంటర్లు
వరంగల్	504	703	7
హనుమకొండ	417	1067	6
జనగామ	1011	388	6
భూపాలపల్లి	411	291	3
మహబూబాబాద్	708	485	6
ములుగు	807	594	6
మొత్తం	4,707	2,679	34

ఆదర్శనీయం రఘునాథచార్యస్వామి

దశ గ్రంథకర్త తిరునగరి వెంకటేశ్వర్లు


హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సంస్కృతం, సాహిత్యం, వ్యాకరణం, వేదాంతం, ఉపనిషత్తులతో పాటు ఆళ్వార్ దివ్య ప్రబంధాలు, భగవత్ రామానుజులు ప్రవేశపెట్టిన శ్రీవైష్ణవత్వాన్ని సరళం చేసి తన రచనల ద్వారా భక్తులందరికీ అందుబాటులోకి తీసుకువచ్చిన సాహితీ చైతన్య శిఖరం నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యస్వామి అని వరంగల్ నాలాయిర దివ్య ప్రబంధ పారాయణగోష్ఠి వ్యవస్థాపకుడు, దశ గ్రంథకర్త తిరునగరి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం రఘునాథ చార్యస్వామి శత తిరునక్షత్రోత్సవం సందర్భంగా హనుమకొండ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం చిన్నకోవెలలో తాను రాసిన వస్తు తాముపయాతోహం ఆధ్యాత్మిక గ్రంథాన్ని అక్షర నీరాజనంగా ఆయన సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు చెరురుపల్లి నర్సింహాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి రఘునాథచార్యస్వామి తనియను పఠించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురుతుల్యూగా అన్నింటి మార్గదర్శనంగా ఉన్న రఘునాథచార్యస్వామి బహుముఖ సేవలు అనన్య సామన్యమైనవన్నారు. ఆలయ అర్చకుడు నర్సింహాచారి ఈ సందర్భంగా ఈ ఆలయ జీర్ణోద్ధరణ చేసి ఈనాటి స్థితికి కారకులైన వారు రఘునాథచార్యస్వామి అంటూ ఆలయంలో జరిగే ప్రతీ కార్యక్రమానికి వారు హాజరయ్యేవారని, సీతారాముడంటే వారికి ఎంతో ఇష్టదైవమని పేర్కొన్నారు. ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో జరిగిన రఘునాథచార్యస్వామి తిరునక్షత్రోత్సవ వేడుకల్లో సముద్రాల పురుషోత్తమచార్య రచించిన రఘునాథ అష్టోత్తర శతనామార్చన, మంగళశాసనం, తనియ విన్నపం నిర్వహించారు. టీకే శ్రీనివాసాచార్యులు, కండ్లకుంట వెంకటనర్సింహాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు రఘురామాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు. వరంగల్ ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వర ఆలయం, ఏకశిలా పార్కు రామాలయం, రెవెన్యూ రామాల యంలోనూ రఘునాథచార్యస్వామి శత తిరునక్షత్ర వేడుకలను సత్ సంప్రదాయ పరిరక్షణ సభ్యులు, సంప్రదాయవాదులు, భక్తులు జరుపుకున్నారు.



చిన్న కోవెలలో రఘునాథచార్యస్వామికి అక్షర నీరాజనం

సైనిక్ స్కూల్.. లేనట్టేనా?

- 2016లో వరంగల్‌కు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి, హసన్‌పర్తిలో ఏర్పాటుకు కసరత్తు
- తొమ్మిదేళ్లపాటు స్థలం కేటాయించని గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- 2023లో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించేందుకు ప్రయత్నాలు
- వరంగల్‌లోనే ఏర్పాటు చేయాలని 2024లో రక్షణశాఖ మంత్రికి సీఎం విజ్ఞప్తి
- తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏర్పాటు చేసే దిశగా అడుగులు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖతో ఓరుగల్లు వాసుల ఆశల గల్లంతు!



కేంద్ర రక్షణ మంత్రితో బండి సంజయ్ (ఫైల్)

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కేంద్ర ప్రభుత్వం 2016లో దేశవ్యాప్తంగా 21సైనిక్ స్కూళ్లను మంజూరు చేసిన క్రమంలో తెలంగాణకు సంబంధించి వరంగల్ జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కడియం శ్రీహరి ఉపముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు మంజూరైన సైనిక్ స్కూల్‌ను తన అసెంబ్లీ నియోజకవర్గం స్టేషన్‌ఘనపూర్ పరిధిలోని హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామశివారులో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కావాల్సిన భూమి, భవనాల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం రూ.100కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఎలుకుర్తి గ్రామంలోని సర్వే నెంబరు 160లో మొత్తం 229ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉంది. ఇందులో నుంచి 50 ఎకరాలను సైనిక్ స్కూల్‌కు కేటాయించాలని అధికారులు ప్రయత్నించారు. ఆ భూములను సైనిక్ స్కూల్ కోసం తీసుకుని రైతులకు పరిహారం ఇస్తామని అధికారులు చెప్పినా ఆచరణకు నోచుకోలేదు. రైతులను ఒప్పించి 50ఎకరాల భూమిని సేకరించటంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. దీంతో హసన్‌పర్తి మండలంలో ఎర్రగట్టుగుట్ట సమీపంలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. అయితే ఈ స్థలాన్ని కూడా సైనిక్ స్కూల్‌కు కేటాయించి, కేంద్రంతో ఎంవోయూ కుదుర్చుకోవటంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే విమర్శలు ఉన్నాయి. అటు ఎలుకుర్తి, ఇటు హసన్‌పర్తిలో ఎక్కడ కూడా సైనిక్ స్కూల్‌కు గత ప్రభుత్వం భూ కేటాయింపులు చేయలేదు. ప్రధానంగా గత ప్రభుత్వం భూసేకరణకు కావాల్సిన నిధులను విడుదల చేయకపోవటంతో వరంగల్‌కు వచ్చిన సైనిక్‌స్కూల్ కాగితాలకే పరిమిత మైంది.

వరంగల్‌లో ఏర్పాటు చేయాలని సీఎం ఒత్తిడి..

సైనిక్ స్కూల్‌కు కావాల్సిన భూమి, నిధులను గత ప్రభుత్వం కేటాయించకపోవటంతో వరంగల్ స్కూల్ ఏర్పాటు అంశం తెరమరుగైంది. ప్రభుత్వం నుంచి కూడా కేంద్రంపై సైనిక్ స్కూల్ విషయంలో ఎలాంటి ఒత్తిడి లేకపోవటంతో 2023 మరోచోటుకు తరలించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ప్రధానంగా 2023 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్‌లోని డిఫెన్స్ భూముల్లో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని అక్కడి నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ మేరకు 2024 జనవరిలో తెలంగాణ సీఎస్‌కు కేంద్రం ఓ లేఖ రాసింది. అయితే డిఫెన్స్ భూముల్లో సైనిక్ స్కూల్ ఏర్పాటు సాధ్యం కాకపోతే, ఏపీ లేదా ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తారనే ప్రచారం అప్పట్లో జరిగింది. దీంతో సైనిక్ స్కూల్ వరంగల్‌లో ఉంటుందా... ఇతర ప్రాంతాలకు తరలుతుందా అనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో 24 జూన్ 2024లో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి వరంగల్‌కు మంజూరైన సైనిక్ స్కూల్‌కు కావాల్సిన భూములు, నిధులు ఇస్తామని, వెంటనే ఎంవోయూ కుదుర్చుకునేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య కూడా రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అయితే గత ప్రభుత్వం భూ కేటాయింపులు చేయకపోవటంతో సైనిక్ స్కూల్ పనులు ప్రారంభం కాలేదని, వరంగల్‌లో ఎలుకుర్తి లేదా మరో చోట స్థలాన్ని కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చారు. అయితే సైనిక్ స్కూల్ ఏర్పాటుపై ఏలాంటి హామీ రాకపోవటంతో వరంగల్ సైనిక్ స్కూల్ ఏర్పాటుపై అప్పట్లోనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి.

కరీంనగర్‌లో ఏర్పాటుకు బండి ప్రయత్నాలు..

వరంగల్ సైనిక్ స్కూల్ అంశం తొమ్మిదేళ్లుగా ఎటూ తేలకుండా ఉన్న నేపథ్యంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బ ండి సంజయ్ అప్రమత్తమయ్యారు. సైనిక్ స్కూల్‌ను ఈ నెల 15వ తేదీన కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిరిసిల్ల లేదా హుస్నాబాద్ ప్రాంతంలో సైనిక్‌స్కూల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి రాజ్‌నాథ్‌సింగ్ సానుకూలంగా స్పందించినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో తొమ్మిదేళ్లుగా వరంగల్‌ను ఊరిస్తున్న సైనిక్ స్కూల్ ఇక రానాట్టేనా? అనే చర్చ ఓరుగల్లు వాసుల్లో జరుగుతోంది.

ప్రైవేట్ భాగస్వామ్యంతో..

సైనిక్ స్కూల్స్‌ను గతంలో మాదిరిగా పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో కాకుండా ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది. ఈ క్రమంలో వరంగల్‌లో కూడా ఈ విధానంలో ఏర్పాటుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకుంటే బాగుండేదని, కరీంనగర్‌తో పాటు వరంగల్‌పై కూడా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలనే డిమాండ్ వినిపిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైనిక్ స్కూల్‌కు స్థలం కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తే.. బీజేపీ వరంగల్ వచ్చిన సైనిక్ స్కూల్‌ను కరీంనగర్‌కు తరలించుకుపోతోందన్న ఆరోపణాలను ఎదుర్కోవాల్సి వస్తుందనే చర్చ జరుగుతోంది.

వరంగల్‌లోనే సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి



సైనిక్ స్కూల్ ఏర్పాటు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలం కేటాయించకుండా నిర్లక్ష్యం చేసింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మేం రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి వరంగల్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం విజ్ఞప్తి చేశాం. అయినా కేంద్రం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. కరీంనగర్‌కు సైనిక్ స్కూల్ రావడాన్ని స్వాగతిస్తున్నాం. కానీ, తొమ్మిదేళ్ల కిందట వరంగల్‌కు మంజూరైనా సైనిక్ స్కూల్‌కు కేంద్రాన్ని తరలించుకుపోవడం, ఇక ఈ స్కూల్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకుండా కేంద్రం వివక్ష చూపడం సరైంది కాదు. వరంగల్‌కు సైనిక్ స్కూల్ కోసం మరోసారి సీఎంతో కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తా.

- డాక్టర్ కడియం కావ్య, ఎంపీ, వరంగల్

కాంట్రాక్టు, పార్టుటైమ్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, పార్టుటైమ్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు పృథ్వీ, నరసింహారావులు డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా వర్సిటీ అధ్యాపకులకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో బాలకృష్ణ, కావ్య, అనూష, గణేశ్, యాదగిరి, సాధన, లోకేశ్, శ్రీజ, వంశీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేతలు పృథ్వీ, నరసింహారావు

హ్యాండ్‌బాల్ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



హ్యాండ్‌బాల్ పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 27 వరకు హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న నాయిని విశాల్‌రెడ్డి మెమోరియల్ 7వ తెలంగాణ హ్యాండ్ బాల్ టాలెంట్ హంట్ క్రీడాపోటీల వాల్‌పోస్టర్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు శ్యామల పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



9వ డివిజన్ రాయపురలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ ఖాజా సిరాజొద్దీన్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ మేయర్ సిరాజొద్దీన్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ 9వ డివిజన్ రాయపురలో డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి సిరాజొద్దీన్ బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు 9వ డివిజన్ నుంచి మహిళలు, యువత, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దేవులపల్లి ప్రదీప్, కోమాకుల ప్రశాంత్, అజిత్‌కుమార్, భవాని మధు, ప్రవీణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవుల పట్ల దయ చూపితేనే మానవ మనుగడ

▸▸ మహర్షి గోశాల అధ్యక్షుడు సర్జన రమేష్



పిచ్చుక గూళ్లు, వరి గొలుసులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జీవుల పట్ల దయ చూపితేనే మానవ మనుగడ సాధ్యమని మహర్షి గోశాల అధ్యక్షుడు సర్జన రమేష్ అన్నారు. మండలంలోని చింతగట్టు శ్రీ వినాయక మండపం ద్వారకా సిటీలో మహర్షి గోశాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎం ఫౌండేషన్ సహకారంతో పిచ్చుక గూళ్లు-వరి గొలుసుల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్వారకా సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు కత్తి మొగిళి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, ప్రసాద్‌రెడ్డి, సంజీవ్ కుమార్, దేవేందర్‌రెడ్డి, సీతారామరావు, సందీప్‌కుమార్, వెంకట్‌రెడ్డి, స్వామి నాయక్, వేణు, రాముచారి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

హసన్‌పర్తి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లిలో శుక్రవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశాల మేరకు ప్రగతి గ్రామ సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ఆకుతోట ప్రభాకర్, ఐకేపీ సీప ముంజ స్వరూప, ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వట్టె శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తోకల లక్ష్మారెడ్డి, ఆత్మకూరు మార్కెట్ డైరెక్టర్ జూడి రాజీవ్‌గాంధీ, మడిపల్లి గ్రామ అధ్యక్షుడు మాచర్ల మహేందర్, జంపాల రమేష్, జక్కుల రవిందర్, నీలకంఠం సంఘం అధ్యక్షురాలు కందికొండ శిరిష, జంపాల రమాదేవి, ముంజ లాస్య, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాంబే గృహాలు

• బెంబేలెత్తుతున్న లబ్ధిదారులు



వడ్డెపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): 57వ డివిజన్ పరిధిలోని వాజ్‌పాయ్ కాలనీలో 20 ఏళ్ల కిందట వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన (వాంబే) పథకం కింద లబ్ధిదారులకు నిర్మించిన గృహాలు శిథిలావస్థలో మగ్గుతున్నాయి. 2003లో ఎన్డీఏ హయాంలో మురికి వాడలు, పేద ప్రజలకు కనీస వసతి సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో వాంబే గృహాలను నిర్మించారు. వీటి ఆలనా పాలనా కొరవడి ప్రస్తుతం అప్పుడు నిర్మించిన గృహాలు జీర్ణావస్థకు చేరుకొని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వాజ్‌పాయ్ కాలనీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద ప్రజల కోసం జీ+2లో సుమారు 99 గృహాలను నిర్మించి లబ్ధిదారులకు అప్పగించారు. ఒకవైపు పేదరికం మరో వైపు శిథిలమైన గృహాల్లో నివసించడం వారికి కత్తిమీద సాముల మారింది. ఎప్పుడు కూలిపోతాయో తెలియని దయనీయ పరిస్థితుల్లో పేదలంతా కొట్టుమిట్టాడుతున్నారు. రెండేళ్లుగా గృహాలపై కప్పులు పెచ్చులూడి మీద పడడంతో వారంతా రేయింబవళ్లు జంకుతూనే ఉన్నారు. 99 గృహాల్లో ప్రస్తుతం సుమారు 160పై చిలుకు కుటుంబాలు మనుగడ కొనసాగిస్తున్నాయి. శిథిలమైన తమ గృహాలస్థానంలో పక్కనే ఉన్న స్థలాన్ని కలిపి సుమారు 400 డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇందిరమమ్మ పథకం కింద నిర్మించి ఇవ్వాలని వాంబే గృహాల లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నేటి నుంచి కాంగ్రెస్ ఆదివాసీ శ్రేణుల సమ్మేళనం

- 21వ తేదీ వరకు హరిత హోటల్‌లో కార్యక్రమం
- హక్కులు, చట్టాలతో పాటు పార్టీ పరమైన అంశాలపై శిక్షణ
- రేపు హాజరుకానున్న రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్
- టీపీసీసీ చీఫ్ మహేశ్ సహా పలువురు ముఖ్య నేతలు కూడా..
- డీసీసీ భవన్‌లో జిల్లా నేతలతో మీనాక్షి సమావేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఆదివాసీ శ్రేణుల సమ్మేళనం శనివారం నుంచి మూడు రోజుల పాటు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ వేదికగా జరుగనుంది. శని, ఆది, సోమవారాల్లో రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమాలు జరగనున్నాయి. ఇటీవల జైపూర్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశాల్లో అధినేత రాహుల్‌గాంధీ దేశ వ్యాప్తంగా ఆదివాసీ సమ్మేళనాలు నిర్వహించాలని ఆదేశించగా.. రాష్ట్రంలో ఇప్పటికే రెండు జిల్లాల్లో నిర్వహణ చేపట్టారు. అందులో భాగంగా 19, 20, 21తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ శ్రేణులకు సమ్మేళనం నిర్వహించేందుకు జిల్లా కాంగ్రెస్ నేతలు సిద్ధమయ్యారు. ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్యనాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుగులోతు రవీందర్‌నాయక్ సమ్మేళనం నిర్వహణ కోసం ఆదివాసీ శ్రేణులను సిద్ధం చేశారు. ఈ సమ్మేళనంలో ఆదివాసీల హక్కులు, చట్టాలతో పాటు పార్టీ పరమైన అంశాలపై అవగాహన కల్పించనున్నారు. శనివారం జరిగే సమ్మేళనం ప్రారంభ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు కొప్పుల రాజు, రాహుల్‌బాల్ లాంటి అగ్రనేతలతో పాటు పలువురు టీపీసీసీ నేతలు పాల్గొననున్నారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు కూడా హాజరు కానున్నారు. 20వ తేదీ ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరవుతారు. 21న ముగింపు కార్యక్రమంలో సీడబ్ల్యూసీ, టీపీసీసీ నేతలతో పాటు పలువురు మంత్రులు, ఆదివాసీ కాంగ్రెస్ నేతలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

డీసీసీ భవన్‌లో మీనాక్షి నటరాజన్ భేటీ

రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం మీనాక్షి నటరాజన్ తొలిసారి వరంగల్ వస్తున్నారు. ఆమె ఆదివాసీ సమ్మేళనానికి వస్తున్నప్పటికీ పార్టీ పరంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఆదివారం సమ్మేళనంలో పాల్గొన్న అనంతరం ఆమె కాంగ్రెస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో పార్టీ నేతలతో భేటీ అవుతారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మీనాక్షి నటరాజన్‌తో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా ఈ సమావేశంలో పాల్గొని ఉమ్మడి జిల్లాలో పార్టీ పరిస్థితిపై చర్చించడంతో పాటు నేతలకు దిశా, నిర్దేశం చేస్తారని సమాచారం.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలుసబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మడికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని కడిపికొండ, బొడగుట్ట, అయోధ్యపురం, రాజీవ్ గృహకల్ప, సూర్యకుటీర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 9.30 వరకు, మడికొండ టెక్స్‌టైల్ పార్కు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



టేకులగూడెంలో సిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

మడికొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గ్రామ పురవీధుల్లో సిలువ యాత్రను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో క్రైస్తవ భక్తులు, విశ్వాసులతో పాటు టేకులగూడెం ప్యారీస్ ప్రీస్ట్ ఫాదర్ బాలస్వామి, పాస్టర్ మాతంగి దాసు, సంఘ పెద్దలు కదిరేజాన్, కందక ఆరోగ్యం, మాతంగి పౌలు, మాతంగి భాస్కర్, మాచర్ల కుమారస్వామి, మాతంగి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంపై రాళ్లతో దాడి.. వ్యక్తిపై కేసు

కాజీపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దేవాలయంపై రాళ్లతో దాడిచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాజీపేట ఎస్సై లవన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజీపేట చైతన్యపురిలోని వేంకటేశ్వర దేవాలయంపై శుక్రవారం అదేప్రాంతానికి చెందిన రిజ్వాన్ అనే వ్యక్తి రాళ్లతో దాడి చేశారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రిజ్వాన్ అనే వ్యక్తికి గతంలో జరిగిన ప్రమాదంలో తలకు తీవ్రగాయం కాగా, మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. ఇంట్లో కూడా ఇదే విధంగా వస్తువులు పగలకొడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోందని పోలీసులు చెప్పారు. రిజ్వాన్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మడికొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మడికొండలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన మేరకు.. ఎలుకుర్తి గ్రామ శివారు ఔటర్ రింగ్ రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు సుమారు 50 ఏళ్ల వయస్సు ఉంటాడని తెలిపారు. 5.5 అడుగు ఎత్తు ఉండి, తెలుపు, నలుపు గడ్డం, మీసాలు కలిగి ఉన్నాడు. కుడిచేతిపై పచ్చబొట్టు ఉంది. తెలుపు రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు భైరి లింగమూర్తి ఫిర్యాదు మేరకు శవ పంచనామా చేసి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై రాజ్‌కుమార్ కోరారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ కోచైర్మన్‌గా అశోక్



వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ కోచైర్మన్‌గా టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ ఎన్నికయ్యారు. గురువారం రాత్రి టీఎన్జీవోస్ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మిల్స్ కాలనీ పీఎస్ పరిధిలోని కరీమాబాద్ వాటర్ ట్యాంకు సమీపంలో ఓ ఇంటిపై పేకాటాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి రూ.22,390 నగదు, రెండు సెల్‌ఫోన్‌లు సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. హనుమకొండ హనుమాన్‌నగర్ డబ్బాలకు చెందిన నార్లగిరి యాకయ్య, రంగశాయిపేటకు చెందిన పందిరి భీరయ్య, కరీమాబాద్‌కు చెందిన బత్తోజ్ వేణు పట్టుబడగా స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు. కరీమాబాద్‌కు చెందిన కుమారస్వామి సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చెన్నం మధు

వడ్డెపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పబ్లిక్ గార్డెన్ బస్టాప్ వద్ద బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఇమ్మడి సంతోష్ కుమార్, కందగట్ల శ్రీకాంత్ సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ అనుముల రమేష్, చార్టర్డ్ అకౌంటెంట్ తిప్పర్తి రాఘవరెడ్డి, సామాజిక వేత్తలు అందె ఉదయ్‌కుమార్, లక్ష్మణ్, సురేందర్, కార్తీకేయరాజ్, విష్ణువర్ధన్‌రాజ్, ఇమ్మడి యువన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

▸▸ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొట్ల చక్రపాణి



హౌసింగ్ బోర్డు కాలనీలో ఇంటింటా సర్వే చేస్తున్న నేతలు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 8వ డివిజన్ ఇందిరానగర్‌లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ 8వ డివిజన్ ఇందిరానగర్‌ను చక్రపాణి సందర్శించి డివిజన్‌లో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, అంతర్గత రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా స్థానిక ప్రజల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. డివిజన్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. డివిజన్‌లో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, 6 గ్యారంటీలు అందించాలని చక్రపాణి ప్రభుత్వాన్ని కోరారు. పాలకుల పనితీరును ఎండగడుతూ, ప్రజల సమస్యల పరిష్కరించాలని నిరసిస్తూ ఈ నెల 21న తలపెట్టిన ధర్నాకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్త్ ఏరియా మండల నాయకులు ఒంటెల పాపయ్య, మల్లేశం, ఇందిరానగర్ కాలనీవాసులు లక్ష్మీ, రాధ, అనీత, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

• వడ్డెపల్లి : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ మెంబర్ ధరావత్ భాను నాయక్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని హౌసింగ్ బోర్డుకాలనీలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా భాను నాయక్ మాట్లాడుతూ.. హౌసింగ్ బోర్డు కాలనీలో 30 ఏళ్లుగా ఉంటున్న ఇళ్ల యజమానులకు ఫెనాల్టీలు వేసి మున్సిపల్ అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆరోపించారు. కాలనీలో డ్రెయినేజీ, పారిశుధ్య, మంచినీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని అన్నారు. కమ్యూనిటీ హాల్ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సర్వేలో సీపీఎం నేతలు రాజేష్, ఉదయ్, షమీమ్, తేలూరి ఉప్పలయ్య, లత తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలు

ముఖాముఖి



గడ్డం అశోక్ కుమార్, లైబ్రేరియన్, బాలల గ్రంథాలయం పబ్లిక్ గార్డెన్, హనుమకొండ

ఆంధ్రజ్యోతి: గ్రంథాలయం పనివేళలు ఏవీ?

లైబ్రేరియన్: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు.

ఆంధ్రజ్యోతి: ఏఏ పుస్తకాలు ఉన్నాయి?

లైబ్రేరియన్: గ్రూప్స్-1, 2, 3, 4 సంబంధించిన పుస్తకాలతో పాటు ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: దిన, వార, మాస పత్రికలు ఎన్ని వస్తాయి?

లైబ్రేరియన్: తెలుగు దిన పత్రికలు 7, ఇంగ్లీష్ 3తో పాటు వార పత్రికలు 2, మాస పత్రికలు 3 వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: ప్రతీ రోజు పాఠకులు ఎంత మంది వస్తారు?

లైబ్రేరియన్: ప్రతీ రోజు సుమారు 80 నుంచి 90 మంది వరకు పాఠకులు వస్తారు.

ఆంధ్రజ్యోతి: సౌకర్యాలు ఉన్నాయా?

లైబ్రేరియన్: పాఠకుల కోసం టాయిలెట్స్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి.

- వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి)

సదాశయ ఫౌండేషన్ సేవలకు సహకరించాలి



హనుమకొండలో సమావేశమైన సదాశయ ఫౌండేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యులు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సదాశయ ఫౌండేషన్ సేవలకు ప్రభుత్వం సహకరించాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శావణ్‌కుమార్ కోరారు. శుక్రవారం హనుమకొండ సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్త, అవయవ, శరీర, నేత్ర, చర్మదానాలతో పాటు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను గ్రామాలకు విస్తరించడంలో భాగంగా ప్రభుత్వం సహకరించాలని తెలిపారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాలకు బాధ్యులను ఎన్నుకుని, పలు తీర్మానాలను ఆమోదించినట్లు వివరించారు.

వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా జి.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ఎ.సంపత్ కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కె.శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సదానందం, మహబూబాబాద్ జిల్లా కన్వీనర్‌గా ఎస్‌డీ.గౌస్, ములుగు కన్వీనర్‌గా పెండ్యాల ప్రభాకర్, జనగామ జిల్లా కన్వీనర్‌గా వి.కుమారస్వామిలను నియమించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ సిహెచ్.దళపతి, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేయూ ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన అధ్యాపకులు



ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌కు సమాచారం ఇస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులు ఏప్రిల్ 19 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు శుక్రవారం కేయూ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్‌ను కలిసి తమ సమ్మెకు సంబంధించిన సమాచారాన్ని అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కొన్ని రోజులుగా వర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన, ప్రదర్శనలు చేపట్టారు. దీనిలో భాగంగా శనివారం నుంచి తామంతా వర్సిటీలో నిరవధిక సమ్మె చేపడుతామని పోలీసులకు ఇచ్చిన సమాచారంలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వర్సిటీ వీసీతో పాటు రిజిస్ట్రార్‌లను కలిసి ఇటీవల సమ్మె నోటీస్ అందచేశారు. ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వారిలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, డాక్టర్ సాధు రాజేశ్, డాక్టర్ మాదాసి కనుకయ్యలున్నారు.

వారసత్వ సంపదను భావితరాలకు అందించాలి

▸▸ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్



అగ్గలయ్య గుట్టను సందర్శించిన వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వారసత్వ సంపదను భావిభారత పౌరులకు, భవిష్యత్ తరాలకు అందించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని అగ్గలయ్య గుట్టను సందర్శించారు. వందల ఏళ్ల నాటి గుట్టల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ హయాంలో రూ.1.5కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఈ ప్రదేశాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్ది అగ్గలయ్య చరిత్రకు గుర్తింపు తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రాచీనకాలంలో వైద్య సేవలు, పరిశోధనలు ఈ ప్రాంతంలో చేసినట్లు వినయ్ భాస్కర్ తెలిపారు. చారిత్రక ప్రదేశాలను గుర్తించి తరతరాలు గుర్తుంచుకునేలా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు గండ్రకోట రాకేష్ యాదవ్, పబ్బోజు శ్రీకాంతాచారి, మూటిక రాజు, బయ్య శోభన్, పులి అర్జున్, రవీందర్, హరికృష్ణ, కొండ బాబు, సమ్మయ్య, జబ్బర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 19 ఏప్రిల్ 2025

బచ్చలి ఆరోగ్యానికి నెచ్చెలి

కారం, వగరు, తీపి ఈ మూడురుచులు కలగలసిన ఆకు కూర బచ్చలి. దీనిలో పాలకూరతో సమానమైన పోషకతత్వాలు ఉంటాయి. ఇది తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. భోజన కుతూహల గ్రంథంలో దీనిని పోతకి లేదా ఉపోదకీ అని పేర్కొన్నారు. ఈ బచ్చలిలో రెండు రకాలు ఉన్నాయి. ఆకుపచ్చ కాండం, ఆకుపచ్చ ఆకులతో ఉన్న బచ్చలిని బసెల్లా ఆల్బా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. ఎర్రని కాండం, ముదురు ఆకుపచ్చ ఆకులు కలిగిన బచ్చలిని బసెల్లా రుబ్రా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. దీని గింజలు ఊదా రంగులో ఉంటాయి. ఈ రంగును తెలుగు వారు బచ్చలిపండు రంగు అనే పిలుస్తారు.

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

చాలా మంది బచ్చలి కూర వేడి చేస్తుందని భావిస్తారు. కానీ ఇది వాతాన్ని, వేడిని- రెండింటినీ అదుపు చేస్తుంది. ఆయుర్వేద గ్రంథాల్లో బచ్చలి కూర వల్ల ప్రయోజనాలను వివరించారు. ఆ ప్రయోజనాలు..

- ఇది రక్తశుద్ధికి తోడ్పడుతుంది. ఎముకలకు పుష్టినిస్తుంది.
- అనేక రకాల స్త్రీ సమస్యలకు ఇది పరిష్కారం. సంతాన ప్రాప్తినిస్తుంది. గర్భాశయపోషకంగా పనిచేస్తుంది.
- బచ్చలి ఆకును నమిలితే నోటిపూతను నివారిస్తుంది. ఈ ఆకు రసంలో పసుపు కలిపి పెడితే గాయాలు త్వరగా మానతాయి. కాలిన గాయాలకు ఈ ఆకు రసం మందుగా పనిచేస్తుంది. ఈ రసాన్ని రాస్తే దురదలు తగ్గుతాయి.
- బచ్చలి కూరకు మూత్ర పిండాల్లో రాళ్లను కరిగించే స్వభావముంది.
- బచ్చలి కూరలో జిగురు పదార్థం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మలబద్ధకం ఉన్నవారు బచ్చలికూరను తింటే మంచిది.

• గంగరాజు అరుణాదేవి

రకరకాల వంటలు

తెలుగువారు కంద బచ్చలి కూరను అన్ని శుభ కార్యాల్లోనూ వండుతారు. ఇక బచ్చలికూరతో రకరకాల రుచికరమైన వంటలు చేసుకోవచ్చు.

- బచ్చలికూరలో నూనె వేసి తాలింపు వేసి మూత పెట్టి మగ్గనిస్తే మెత్తగా అవుతుంది. దీనిలో ఉడికిన కందిపప్పు లేదా పెసర పప్పు వేసి పప్పుగా చేసుకోవచ్చు.
- బచ్చలికూరను సన్నగా తరిగి దీనిలో శనగ పిండి లేదా మొక్కజొన్న పిండి కలిపి కొద్దిగా నూనె వేసి వేయిస్తే రుచికరమైన కూర అవుతుంది. దీనిలో కొందరు కొబ్బరి తురుము, నువ్వుపప్పు కూడా వేస్తారు.




- బచ్చలి కూరను సన్నగా తరిగి దానిని నూనెలో దోరగా వేయించాలి. ఆ తర్వాత దానిలో తాలింపు, కొద్దిగా చింతపండు వేయాలి. దీనిని మిక్సీలో వేసి రుబ్బి పచ్చడిగా కూడా చేసుకోవచ్చు.

దోసకాయ చేపల పులుసు

కావాల్సిన పదార్థాలు: చేప ముక్కలు- పావు కిలో, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, నూనె- పావు కప్పు, ఆవాలు- పావు చెంచా, మెంతులు- పావు చెంచా, ఎండు మిర్చి- 4, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- రెండు రెమ్మలు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, పసుపు- అర చెంచా, కారం- ఒక చెంచా, గరం మసాలా పొడి- ఒక చెంచా, టమాటా గుజ్జు- అర కప్పు, ఉప్పు- తగినంత, చింతపండు రసం- ఒక కప్పు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం: ముందుగా చేప ముక్కలను నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాత వీటిని ఒక గిన్నెలోకి తీసుకుని అందులో పావు చెంచా పసుపు, పావు చెంచా ఉప్పు, పావు చెంచా కారం వేసి చేత్తో కలపాలి.

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడిచేయాలి. తరవాత ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి, కరివేపాకు, పావు చెంచా పసుపు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా కలపాలి. ఇవన్నీ దోరగా వేగాక అర చెంచా ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత దోసకాయ ముక్కలు వేసి కలిపి మూతపెట్టి మగ్గించాలి. అయిదు నిమిషాల తరవాత ముప్పావు చెంచా కారం, గరం మసాలా పొడి వేసి కలపాలి. ఇవి కొద్దిగా వేగాక టమాటా గుజ్జు, చింతపండు రసం వేసి బాగా కలపాలి. అయిదు నిమిషాల తరవాత అర చెంచా ఉప్పు వేసి, రెండు గ్లాసుల నీళ్లు పోసి మరిగించాలి. తరవాత చేప ముక్కలు వేసి మూతపెట్టి మగ్గించాలి. ఆరు నిమిషాల తరవాత మూత తీసి కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పులుసు వేడి వేడి అన్నంలోకి బాగుంటుంది.



జాగ్రత్తలు

- రోహు, కట్లా, శీలావతి, కొరమీను చేపలతో ఈ పులుసు చేసుకోవచ్చు. కానీ ముల్లు ఉండే రోహు చేపతో చేసిన పులుసు రుచికరంగా ఉంటుంది.
- దోసకాయ, చేప ముక్కలను మరీ మెత్తగా మగ్గించకూడదు.

వంటిల్లు

మనం దోసకాయలతో ఇగురు, పప్పు, ఆవకాయ... ఇలా ఎన్నో రకాలు చేస్తూ ఉంటాం. టమాటా, చిక్కుళ్లు లాంటివి చేర్చి రకరకాల కూరలు కూడా వండేస్తూ ఉంటాం. ఇవి కాక దోసకాయలతో మాంసాహార రుచులు కూడా ప్రయత్నించవచ్చు. దోసకాయలను విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసం ఈ వంటకాలు.

దోసకాయతో వెరైటీగా..



దోసకాయ వంకాయ పచ్చడి

కావాల్సిన పదార్థాలు

- దోసకాయ ముక్కలు- ఒక కప్పు, వంకాయ ముక్కలు- ఒక కప్పు, టమాటా ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- పన్నెండు, చింతపండు- నిమ్మకాయంత, కొత్తిమీర- ఒక చిన్న కట్ట, కరివేపాకు- రెండు రెమ్మలు, జీలకర్ర- ఒక చెంచా, అవాలు- పావు చెంచా, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, నూనె- నాలుగు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, పచ్చిశనగపప్పు- ఒక చెంచా, మినప్పప్పు- ఒక చెంచా, ఎండు మిర్చి- ఒకటి, ఇంగువ- చిటికెడు

తయారీ విధానం

- స్టవ్ మీద గిన్నెపెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, కొద్దిగా పసుపు, పచ్చిమిర్చి ముక్కలు, వంకాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. తరవాత టమాటా ముక్కలు, చింతపండు, కొద్దిగా ఉప్పు వేసి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత అర కప్పు దోసకాయ ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. మిక్సీ గిన్నెలో వెల్లుల్లి రెబ్బలు, వేయించిన వంకాయ-టమాటా ముక్కల మిశ్రమం వేసి కచ్చాపచ్చాగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీయాలి. స్టవ్ మీద తాలింపు గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, ఆవాలు, ఇంగువ, కొద్దిగా పసుపు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, ఎండు మిర్చి, కరివేపాకు, కొత్తిమీర తరుగు, అరకప్పు దోసకాయ ముక్కలు వేసి కలపాలి. ఈ తాలింపు మిశ్రమాన్ని పచ్చడిలో వేసి బాగా కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. ఈ పచ్చడి అన్నంలోకి రుచిగా ఉంటుంది.



దోసకాయ...
పులుపు, తీపి కలగలసిన రుచిలో ఉంటుంది. ఇందులో ఐరన్, కాల్షియం, పొటాషియం లాంటి మినరల్స్‌తోపాటు ఎ, సి, కె విటమిన్లు కూడా పుష్కలంగా ఉంటాయి. దోసకాయను తరచూ తినడం వల్ల ఎముకలు బలపడతాయి. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీరానికి కావాల్సినంత తేమ లభిస్తుంది. చర్మం మృదువుగా బిగుతుగా మారుతుంది. రక్తపోటు, మూత్రపిండాల సమస్యలు తగ్గుతాయి. దోసకాయలో ఉండే కుకుర్బిటాసిన్ ... మూత్రాశయ క్యాన్సర్‌ను నివారిస్తుంది.

జాగ్రత్తలు

- దోసకాయను చిన్న ముక్కలుగా కోయాలి. పొడవాటి వంకాయలు తీసుకుంటే పచ్చడి రుచిగా ఉంటుంది.
- గ్రైండ్ చేసేటప్పుడు కొన్ని వేయించిన పల్లీలు వేస్తే పచ్చడికి కమ్మదనం వస్తుంది.
- ఈ పచ్చడిని రోట్లో చేస్తే రుచి అద్భుతంగా ఉంటుంది.

దోసకాయ చికెన్ కూర

కావాల్సిన పదార్థాలు


- చికెన్- 300 గ్రాములు, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- రెండు కప్పులు, పచ్చిమిర్చి- మూడు, కారం- ఒకటిన్నర చెంచాలు, ఉప్పు- ఒకటిన్నర చెంచాలు, పసుపు- అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, ఎండుమిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ధనియాల పొడి- అర చెంచా, నూనె- మూడు చెంచాలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం

- ఒక గిన్నెలో చికెన్ ముక్కలు, అర చెంచా ఉప్పు, అర చెంచా కారం, అరచెంచా అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలిపి అరగంటసేపు నానబెట్టాలి.
- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, పసుపు వేసి దోరగా వేపాలి. ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. ఇవన్నీ వేగాక నానబెట్టిన చికెన్ ముక్కలు వేసి కలపాలి. గిన్నెమీద మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత దోసకాయ ముక్కలు, ఒక చెంచా కారం, ఒక చెంచా ఉప్పు, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. అరగ్లాసు నీళ్లు పోసి మరో అయిదు నిమిషాలు మగ్గించాలి. చివరలో కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కూర రోటీ, చపాతీ, పుల్కా, వేడి అన్నంలోకి బాగుంటుంది.

జాగ్రత్తలు

- చికెన్ ముక్కలు మగ్గుతున్నప్పుడు అందులో ఒక గరిటెడు పెరుగు కలిపితే కూర రుచిగా ఉంటుంది.
- దోసకాయను పెద్ద ముక్కలుగా కోయాలి.



పర్సనల్ కేర్

చెవిలో పురుగు దూరితే..!

ఒక్కోసారి చెవిలోకి చీమలు, బొద్దింకలు లాంటి చిన్న చిన్న పురుగులు దూరి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. లోపలికి వెళ్లినంత సులువుగా అవి బయటికి రావు. వీటిని బయటికి రప్పించడానికి నిపుణులు చెబుతున్న చిట్కాలివి...

- చెవిలోకి ఏదైనా పురుగు ప్రవేశిస్తే వెంటనే చీకటి గదిలోకి వెళ్లి టార్చ్ లేదా మొబైల్ లైట్‌ను చెవిలో చూపించాలి. వెలుగును చూసిన వెంటనే కొన్ని రకాల పురుగులు బయటికి వచ్చేస్తాయి.
- చెవిలో ఆలివ్ నూనె లేదంటే బేబీ ఆయిల్ చుక్కలు వేస్తే ఆ నూనెతోపాటే పురుగు బయటికి వస్తుంది.
- గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ నీటిని చుక్కలుగా చెవిలో వేస్తే లోపలికి వెళ్లిన పురుగు బయటికి వచ్చేస్తుంది.
- ఆల్కహాల్‌లో చిన్న దూది వుండను ముంచి దాన్ని చెవి రంధ్రం దగ్గర పెడితే ఆ ఘాటుకి పురుగు బయటికి వచ్చేస్తుంది. అలా రాని పక్షంలో ఒక చుక్క ఆల్కహాల్‌ని వేలితో తీసుకుని చెవిలోపల రాస్తే ఫలితం కనిపిస్తుంది.
- చెవిలోకి పురుగు దూరినప్పుడు బడ్స్, పిన్నీసు, అగ్గిపుల్ల, సూది లాంటి వాటితో దాన్ని బయటికి తీసే ప్రయత్నం చేయకూడదు. ఇలా చేస్తే చెవి నొప్పి పెరుగుతుంది.
- ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ పురుగు బయటికి రాకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి.



సెలెబ్ టాక్

ఎప్పటికీ కొత్త కొత్త ఫ్యాషన్ పోకడలు పుట్టుకొస్తూనే ఉంటాయి. దాంతో పాత దుస్తులను బీరువాలకే పరిమితం చేసేస్తూ ఉంటాం. కానీ పాతబడిపోయిన పట్టు చీరలు, కుర్తాలకు కొత్త రూపాన్ని ఎందుకు ఇవ్వకూడదు? అని ప్రశ్నిస్తోంది బాలీవుడ్ తార, రచయిత్రి, ఇంటీరియర్ డెకార్ ఔత్సాహికవేత్త, ట్వింకిల్ ఖన్నా! పాత వస్త్రాలకు కొత్త హంగులు జోడిస్తూ, వాటికి ఇంటి అలంకరణలో చోటు కల్పిస్తున్న ట్వింకిల్ ఇంకా ఏమంటోందో తెలుసుకుందాం!



పాత వాటికి కొత్త కళ

"ఇంటికి పండుగ శోభ తీసుకురావడం కోసం అలంకరణ వస్తువుల మీద డబ్బును వృథా చేయవలసిన అవసరం ఏమాత్రం లేదు. దుకాణంలో కొనే ఖరీదైన అలంకరణ వస్తువులకు బదులుగా, ఇంట్లో ఉపయోగించకుండా భద్రపరిచిన వస్త్రాలను పునర్వినియోగించుకునే మార్గాల మీద దృష్టి పెట్టండి. పాత చీరలు, కుర్తాలు, దుపట్టాలతో ఒక గ్యాలరీని రూపొందించుకోండి. మన ఇంట్లో గోడలకు పెయింటింగ్‌లు, ఫొటోలను వేలాడదీస్తూ ఉంటాం. ఆకట్టుకునే వాల్ హ్యాంగింగ్స్‌ను తగిలిస్తూ ఉంటాం. ఇవన్నీ అందరి ఇళ్లలో ఉండేవే! కానీ వినూత్నంగా కనిపించడం కోసం కొంత సృజనాత్మకంగా ఆలోచించాలి.

పాత జ్ఞాపకాలు పదిలంగా...

మన పెళ్లి నాటి పట్టుచీరలు, బహుమతులుగా అందుకున్న పట్టు కుర్తాలు, సెక్విన్ వర్క్‌తో కూడిన లెహంగాలు, దుపట్టాలు లాంటివి మన బీరువాల్లో ఏళ్ల తరబడి మగ్గుతూ ఉంటాయి. పాతబడేకొద్దీ అవన్నీ పిగిలిపోయి, వాడుకోడానికి వీల్లేకుండా పాడైపోతూ ఉంటాయి. ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఆ వస్త్రాలతో ముడిపడి ఉంటాయి కాబట్టి వాటిని పారేయలేం. అలాగని వాడుకోలేం! ఇలాంటి మీమాంసకు చెక్ పెట్టి, వాటితో ఆకర్షణీయమైన వాల్ డెకార్ తయారు చేసుకోండి.



అంతులేనన్ని ప్రత్యామ్నాయాలు

పాత చీరలు, స్కార్ఫ్‌లు, కుషన్ కవర్లు, పాత దుపట్టాలను బయటకు తీసి, వాటికి మన పాత ఆర్ట్‌వర్క్స్ జోడించి కొత్త రూపాన్ని అందించాలి. అలాగే పాత వస్త్రాలను లెక్కలేనన్ని అవసరాలకు కూడా వాడుకోవచ్చు. వాటితో కుషన్ కవర్లు కుట్టుకోవచ్చు. టేబుల్ రన్నర్స్, ల్యాంప్‌షేడ్స్, కర్టెన్లు తయారుచేసుకోవచ్చు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీలను జోడించి, ఫ్రేమ్ కట్టించి గోడలకు తగిలించుకోవచ్చు. ఇలా పాత వస్త్రాలు, దుస్తులకు కొత్త కళను జోడించి వాడుకోవడం వల్ల పాత జ్ఞాపకాలను సజీవంగా ఉంచుకోవచ్చు. అలాగే దాంతోపాటు, ఇంటి అలంకరణ కూడా వినూత్నంగా మార్చుకోవచ్చు. మీరూ ప్రయత్నించి చూడండి."

మేకప్

ఎండల్లో చూడచక్కగా...

ఎండ వేడి, ఉక్కపోత పెరుగుతున్నాయి. కాబట్టి పాత మేకప్ సాధనాలకు స్వస్తి చెప్పి, వేసవికి తగిన వాటిని ఎంచుకోవాలి. అందుకోసం...

ప్రైమర్: గాల్లోని తేమ వల్ల చర్మరంధ్రాలు అవసరానికి మించి పని చేస్తూ స్వేదాన్నీ, చర్మపు సహజనూనె...సీబమ్‌నూ స్రవిస్తూ ఉంటాయి. దాంతో వేసవి మేకప్‌తో ముఖం జిడ్డుగా మారిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, నుదురు, చుబుకాలకు ప్రైమర్ అప్లై చేసుకోవాలి.

పౌడర్: మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఫౌండేషన్ లేదా కన్‌సీలర్ పూసుకున్న తర్వాత, ముఖం మీద ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా లూజ్ పౌడర్ ఉపయోగించాలి. బేకింగ్ అనే ఈ ప్రక్రియ వల్ల బేస్ మేకప్ ముఖానికి అంటుకుపోయి, ఎక్కువ కాలం చెదిరిపోకుండా నిలుస్తుంది.

ఫౌండేషన్: వేడికి మేకప్ కరిగిపోకుండా ఉండాలంటే, తేలికపాటి ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. ఫేస్ టింట్ కూడా వాడుకోవచ్చు. లైట్‌వెయిట్ ఆకృతి కలిగి ఉండే ఫౌండేషన్ ఎంచుకున్నా, ఫేస్ టింట్‌ను ఎంచుకున్నా వీలైనంత పరిమితంగానే వాడుకోవాలి.



మస్కారా: ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ మస్కారా వాడుకోవాలి. అలాగే కనురెప్పల కోసం సింగిల్ మెటాలిక్ ఐషాడోలనే ఎంచుకోవాలి. ఎండలో, ఉక్కపోతలో ఎక్కువ సమయం గడపవలసిన సందర్భాల్లో కారిపోకుండా ఉండే వాటర్‌ప్రూఫ్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.

లిప్ టింట్: టింట్ వల్ల పెదవులు సహజసిద్ధ మెరుపును సంతరించుకుంటాయి. టింట్ లేకపోతే, పౌడర్ బ్లష్, లిప్ బామ్‌లను సమపాళ్లలో కలుపుకుని లిప్ టింట్‌గా వాడుకోవచ్చు. బ్లష్ లేకపోతే దానికి బదులుగా లిప్ లైనర్ లేదా క్రీమీ లిప్‌స్టిక్‌ను కూడా వాడుకోవచ్చు.

హైదరాబాద్.. ప్రేమ నగరం



(మొదటిపేజీ తరువాయి)

ఆదరించారు' అంటూ.. 'ఆంధ్రజ్యోతి'కి ఆమె ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు..

రైతు కుటుంబంలో పుట్టిన మీకు అందాలపోటీలపై ఆసక్తి ఎలా కలిగింది?

నాకు తొమ్మిది, పదేళ్ల వయసులో ఉండగా ఐశ్వర్యరాయ్ గురించి తెలిసింది. ఆమె ఎవరు? మిస్ వరల్డ్‌గా ఎలా ఎంపికైంది అని అమ్మను అడిగా. 'దేవదాస్' సినిమాలో ఐశ్వర్యరాయ్ అందం చూసి ఆశ్చర్యపోయా. ఆ రోజే నేను కూడా అందాల కిరీటం దక్కించుకోవాలని అనుకున్నా. తర్వాత కాలంలో ముంబై వచ్చి చదువుకుంటూనే నా లక్ష్యం వైపు దృష్టిపెట్టా. తొలుత మిస్ రాజస్థాన్ పోటీల్లో కిరీటం దక్కించుకున్నా. 2023లో 'ఫెమినా మిస్ ఇండియా' పోటీల్లో గెలిచి.. ఇప్పుడు తెలంగాణలో జరిగే మిస్ వరల్డ్ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించబోతున్నా.

ఈ ప్రయాణంలో మీకు ఎదురైన అత్యంత సంక్లిష్టమైన సందర్భం ఏంటి? దాన్ని ఎలా అధిగమించారు?

నేను చాలా ఆశావాదిని. కష్టాలవైపు చూడను. ఏదీ కష్టం అనుకోను. ఎప్పుడూ సానుకూలత వైపే ఉంటా. నా రంగం, నా లక్ష్యంపై పూర్తి శ్రద్ధ పెడతా. అదే లోకంగా ఉంటాను. సవాళ్లు ఎదురైతే.. వాటిని ఎంతవరకూ అవకాశాలుగా మార్చుకోవచ్చు అనే ఆలోచిస్తాను.

అందాలపోటీల్లో పాల్గొంటూనే మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ఇంత బిజీలో అదెలా సాధ్యమైంది?

మా నాన్నకు చదువంటే ఇష్టం. చిన్నప్పటినుంచి చదువుపైనే దృష్టి పెట్టాలని చెప్పేవారు. అందాల పోటీల వైపు వెళ్లేటప్పుడు కూడా ముందు తటపటాయించారు. కానీ ముంబైలో నా కష్టం, నా శ్రమ, నా తపన చూసి.. నా ఆకాంక్షను అర్థం చేసుకున్నారు. మిస్ రాజస్థాన్‌గా గెలిచాక ఆయన ఇంకా మనస్ఫూర్తిగా మద్దతు ఇచ్చారు. మరి ఆయన కోరికను కూడా నెరవేర్చాలి కదా! అందుకే చదువు కొనసాగించా. ముంబైలోని లాలా లజపతిరాయ్ కళాశాల నుంచి మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశా.

మిస్ ఇండియా పోటీల్లో మీరు ఏక్తా(ఐక్యత) అన్న థీమ్ తీసుకున్నారు. అదే ఎందుకు తీసుకున్నారు?

మిస్ ఇండియా వరల్డ్ అయినా ఇంకే అందాల పోటీలైనా కేవలం అందమే కాదు. మనసు, తెలివితేటలు అన్నీ చూస్తారు. మిస్ వరల్డ్ పోటీల్లో 1972 నుంచి ఒక థీమ్ ఉంది. అది.. 'ఒక లక్ష్యం కోసం అందం'. అంటే పోటీల్లో పాల్గొన్న వారి లక్ష్యం? ఆ దిశగా వారు చేయబోయే కార్యక్రమాల గురించి కూడా అడుగుతారు. ఇందులో భాగంగా మిస్ ఇండియా వరల్డ్ పోటీల్లో కూడా నా థీమ్ ఏంటని అడిగినప్పుడు.. ఏక్తా(ఐక్యత, కలిసి ఉండడం, అంతా ఒక్కటే) అని చెప్పా. దీనివెనక ఒక చిన్న కథ ఉంది. మా మావయ్యకు డౌన్ సిండ్రోమ్ ఉంది. కానీ, ఆయన ఎప్పుడూ మానసిక స్థైర్యంతో ఉండేవారు. నాకు విద్యతో పాటు సహనం, శ్రమ లాంటివన్నీ ఆయనే నేర్పారు. ఒక్కోసారి హోటల్‌కు వెళ్లినప్పుడు ఇలాంటివారిని వేరే టేబుల్‌పై కూర్చోమనేవారు. నాకు ఏడుపొచ్చేది. అలాంటివారికి స్థైర్యం ఇచ్చి దగ్గరకు తీసుకోవాలి కానీ.. అలా దూరం పెట్టడం సరి కాదు. అందుకే నేను ఏక్తా థీమ్ తీసుకున్నా. ఇతరుల పట్ల దయ అనేది షరతులతో ఉండకూడదు. మిస్ ఇండియా వరల్డ్ గెలిచాక ఏక్తా ప్రాజెక్టులో భాగంగా అనేకమంది దివ్యాంగులతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నా. వారి పక్కనే ఉండి.. వారు నిలబడేందుకు కావలసిన మానసిక స్థైర్యం ఇవ్వడమే నా లక్ష్యం.

సొంత దేశంలో పోటీలు.. సొంత దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నానన్న ఒత్తిడి ఏమైనా ఉందా?

నేను ఆశావాదిని. దేశ ప్రజలందరి మద్దతూ నాకు ఉంటుందనే సంపూర్ణ విశ్వాసంతో ఈ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నా. మిస్ ఇండియా పోటీలో గెలిచాక.. ఈ రెండేళ్లలో ఎంతో పరిణతి చెందా. మిస్ వరల్డ్ పోటీలకు నన్ను నేను తీర్చిదిద్దుకున్నా. కాబట్టి ఒత్తిడి ఏమీ లేదు.

హైదరాబాద్ చూశారు కదా.. ఎలా అనిపించింది?

హైదరాబాద్ ఒక ప్రేమ నగరం (ఏ సిటీ ఆఫ్ ప్యార్, ఇష్క్, మొహబ్బత్). ఇక్కడి నిర్మాణరీతులు అద్భుతం. చార్మినార్, చౌమొహల్లా ప్యాలెస్‌లను సందర్శించా. ఆ కట్టడాలు నా మనసుపై చెరగని ముద్రవేశాయి. ఉత్తరాది నుంచి వచ్చినా ఇక్కడి ప్రజలు నన్ను ఎంతో ఆదరించారు. హైదరాబాద్ నా సొంత ఇల్లులా అనిపించింది.

ఈ తరం అమ్మాయిలకు మీరిచ్చే సందేశం ఏంటి?

ఎక్కడినుంచి వచ్చావన్నది కాదు. ఎక్కడికెళ్లాలన్నది నిర్ణయించుకో. నీ హద్దులు నువ్వే నిర్ణయించుకో. దానికి అనుగుణంగానే ముందుకెళ్లు. ..ఇదే ఈ తరం అమ్మాయిలకు నేనిచ్చే సందేశం.

మీ జీవితంలో అత్యంత ఆనందకరమైన సందర్భం ఏది?

మిస్ ఇండియా వరల్డ్ పోటీలో గెలిచాక మా నాన్న ఏడ్చారు. ఏడుస్తూ నన్ను కౌగిలించుకున్నారు. ఆయన నన్ను హత్తుకోవడం జీవితంలో అదే మొదటిసారి. ఆయన కళ్ల వెంట ఆనందభాష్పాలు వచ్చాయి. ఒక కొడుకు పుడితే బాగుండు అనుకునే సంప్రదాయ కుటుంబంలో పుట్టిన నేను.. నాన్న కళ్లల్లో నీళ్లు తెప్పించేంత సంతోషం ఇవ్వగలిగా. ఆ క్షణం ఎంతో సంతోషకరంగా అనిపించింది.

టీవీలో, వాణిజ్యప్రకటనల్లో కనిపిస్తున్నారు.. సినిమాల్లోకి వస్తారా?

కచ్చితంగా. సినిమాల్లోకి రావడానికి ఆసక్తిగా ఉన్నా. తెలుగులో కూడా రావొచ్చు. మహేష్‌బాబు అంటే ఇష్టం. తెలుగు సినీ పరిశ్రమ కూడా చాలా పెద్దది. చూద్దాం.

భువనేశ్వర్‌లో చేనేత కళాకారుల కోసం ఏర్పాటుచేసిన ఫ్యాషన్ వీక్‌లో పాల్గొన్నారు. ఇప్పుడు తెలంగాణ చేనేతను అంతర్జాతీయ వేదికమీద ప్రదర్శించేందుకు ఏమైనా చేస్తారా?

తప్పకుండా. తెలంగాణ చేనేత గురించి నాకు తెలుసు. గద్వాల, పోచంపల్లి గురించి విన్నా. తెలంగాణ చేనేత చీరలనే కాదు.. ఇక్కడి ఆభరణాలనూ ప్రపంచం ముందుకు తీసుకెళ్లేందుకు మిస్ వరల్డ్ పోటీలు ఉపకరిస్తాయి. అందులో నేనూ భాగస్వామిని అవుతా. ఇప్పుడు మిస్ వరల్డ్ పోటీలతో ప్రపంచం తెలంగాణ ముందుకు వస్తోంది. ప్రతి ఒక్కరు దీనికి మద్దతివ్వాలి. ప్రతినిధులకు స్వాగతం పలకాలి. మన ఆతిథ్యాన్ని, సంస్కృతిని వారికి చూపించాలి.

మిస్ వరల్డ్ పోటీల్లో చేనేత అందం!

తెలంగాణ చేనేత కళను ప్రపంచానికి చాటేందుకు ప్రభుత్వం కసరత్తు

- పోటీల్లో రాష్ట్ర చేనేత వస్త్రాలను ధరించనున్న సుందరీమణులు
- పోచంపల్లికి పోటీదారులు, ఐరోపా దేశాల ప్రతినిధులు
- పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మే 15న పర్యటన
- గొల్లభామ కాటన్, గద్వాల్ సిల్క్, నారాయణపేట వస్త్రాల ప్రదర్శన
- యాదగిరిగుట్టకు మరో బృందం.. అతిథులకు బహుమతులుగా చేనేత వస్త్రాలు

హైదరాబాద్, యాదాద్రి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వేదికగా జరగనున్న 72వ ప్రపంచ అందాల పోటీలను తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా ఉపయోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా తెలంగాణ చేనేత వస్త్రాలను ఫ్యాషన్ ప్రపంచానికి మరింత చేరువ చేసి.. నేతన్నలకు అండగా నిలిచేందుకు ప్రణాళికలు చేస్తోంది. ఇందులో భాగంగా ఫ్యాషన్ ప్రపంచానికి ప్రతీకగా నిలిచే ఐరోపా దేశాల ప్రతినిధులతో పోచంపల్లి వస్త్రాలను ధరింప చేసి.. ఆ వస్త్రాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలని అనుకుంటుంది. మే 7 నుంచి 31 వరకు జరిగే అందాల పోటీల్లో 140 దేశాల నుంచి పోటీదారులు పాల్గొంటారు. అందాల పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతోపాటు గ్రాండ్ ఫినాలే హైదరాబాద్‌లోనే జరగనున్నాయి. అయితే, ఈ పోటీలకు వచ్చే ఐరోపా దేశాల ప్రతినిధులు, పలువురు పోటీదారులను రాష్ట్ర ప్రభుత్వం మే 15న పోచంపల్లికి తీసుకెళ్లాలని నిర్ణయించింది. వారితో పోచంపల్లి చేనేత వస్త్రాల ధరింప చేసి, వాటిని ప్రమోట్ చేయించాలని అనుకుంటుంది. ఇందుకోసం పోచంపల్లి చేనేత కళాకారులతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించనుంది. స్థానిక చేనేత కళపై అతిథులకు అవగాహన కల్పించడమే కాక ఆయా వస్త్రాల ప్రత్యేకతలను తెలియజేయనుంది. ఆ ప్రతినిధులు స్థానిక చేనేత కళాకారులతో మాట్లాడడానికి భాషాపరమైన సమస్యలు లేకుండా ట్రాన్స్‌లేటర్లను కూడా సిద్ధం చేస్తుంది. అలాగే, గద్వాల్ సిల్క్, సిద్దిపేట దగ్గరలోని గొల్లభామ కాటన్, నారాయణపేట వస్త్రాలకు సంబంధించిన స్టాల్స్‌ను కూడా పోచంపల్లిలో ఏర్పాటు చేస్తుంది. పోచంపల్లి పర్యటనకు వచ్చిన వారంతా ఈ స్టాల్స్‌ను కూడా సందర్శిస్తారు. ఆయా స్టాల్స్‌లో ప్రదర్శించే వస్త్రాల విశేషాలు కూడా విదేశీయులకు అర్థమయ్యేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ పర్యటన అంతా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరగనుండగా.. విదేశీ అతిథుల కోసం పోచంపల్లిలో తెలంగాణ జానపద కళా ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.



విభిన్న డిజైన్లతో రూపొందించిన పోచంపల్లి చేనేత వస్త్రాలు

పోటీల్లో చేనేత థీమ్ !

మిస్ వరల్డ్-2025 పోటీల్లో చేనేత థీమ్ ప్రత్యేకంగా నిలవనుంది. పోటీలో భాగంగా నిర్వహించే ఫ్యాషన్ రౌండ్, సాంస్కృతిక ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాల్లో పోటీదారులు తెలంగాణ చేనేత వస్త్రాలను ధరించనున్నారు. ఇందుకోసం సంప్రదాయ, ఆధునిక డిజైన్‌ల కలయికగా చేనేత వస్త్రాలను సిద్ధం చేస్తున్నారు. అలాగే, మిస్ వరల్డ్ టాప్ మోడల్ అండ్ ఫ్యాషన్ ఫినాలేలో కూడా చేనేత వస్త్రాలను ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు.

చేనేత వస్త్రాలు ధరించి నృసింహుడి దర్శనం

ప్రపంచ అందాల పోటీల్లో పాల్గొనే వివిధ దేశాల ప్రతినిధులతో కూడిన ఓ బృందం యాదగిరిగుట్టపై ఉన్న లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోనుంది. ఆ బృందమంతా చేనేత వస్త్రాలు ధరించి స్వామివారిని దర్శించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అంతేకాక, అతిథులకు బహుమతిగా కూడా చేనేత వస్త్రాలనే ప్రభుత్వం బహుకరించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా చేనేత వస్త్రాలను తయారు చేయిస్తుంది. కాగా, పోచంపల్లి వెళ్లే యూరప్ బృందం, యాదగిరిగుట్టకు వెళ్లే మరో ప్రతినిధి బృందం ధరించే చేనేత వస్త్రాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా వీడియో ఆల్బమ్ రూపొందిస్తుంది. ఈ చర్యల ద్వారా తెలంగాణ చేనేత కళకు మరింత ప్రాచుర్యం లభించి నేతన్నకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వ ఆలోచన.

దుస్తులు విప్పించి.. రోడ్డుపై నగ్నంగా నిలబెట్టి..

- భార్యాభర్తల గొడవలో మధ్యవర్తిగా.. మాట్లాడేందుకు వెళ్లిన యువకుడిపై దాడి
- తీవ్రంగా కొట్టి.. పాదాలు నాకించి దుర్మార్గం
- పైగా వీడియో తీసి వైరల్ చేసిన తీరు
- పేట్ బషీరాబాద్‌లో ఆలస్యంగా వెలుగులోకి ఘటన

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల గొడవ విషయంలో మధ్యవర్తిగా మాట్లాడటానికి వెళ్లిన యువకుడిపై కొందరు దాడికి దిగారు. దుస్తులు విప్పించి, నగ్నంగా రోడ్డుపై నిలబెట్టి విచక్షణారహితంగా కొట్టారు. కర్రలతో, పదునైన ఆయుధాలతో దాడి చేశారు. అక్కడితో ఆగకుండా ఈ దారుణాన్ని వీడియోలు తీసి స్నేహితులకు పంపి వైరల్ చేశారు. ఎలాగోలా వారి చెర నుంచి బయటపడిన యువకుడు ఆస్పత్రిలో చేరాడు. ఆ యువకుడిపై దాడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లికి చెందిన అనీషా, వినీత అక్కాచెల్లెళ్లు. వీరిలో వినీతకు గుండ్లపోచంపల్లికి చెందిన కిరణ్‌యాదవ్‌తో వివాహం జరిగింది. కానీ భార్యాభర్తల మధ్య గొడవలతో.. వినీత సికింద్రాబాద్ ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు చేసుకుని, కిరణ్ యాదవ్‌కు నోటీసు పంపింది. కానీ తర్వాత మనసు మార్చుకుని భర్తతో కలసి ఉండాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని తన సోదరి అనీషాకు చెప్పింది. దీంతో మధ్యవర్తిత్వం వహించి ఈ విషయాన్ని కిరణ్‌యాదవ్‌కు చెప్పాల్సిందిగా.. తమ కుటుంబ స్నేహితుడు అఫ్జల్‌గంజ్ ఉస్మాన్‌షాహీకి చె ందిన తరుణ్‌కుమార్‌ను అనీషా, వినీత కోరారు. కిరణ్ తనకు కూడా పరిచయమున్న నేపథ్యంలో తరుణ్ ఇందుకు అంగీకరించాడు. మార్చి 26న రాత్రి పదిన్నర గంటల సమయంలో గుండ్లపోచ ంపల్లిలోని కిరణ్ ఇంటికి వెళ్లాడు. కానీ తన దగ్గరికి ఎందుకు వచ్చావంటూ తరుణ్‌పై కిరణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన స్నేహితులు బోయిన్‌పల్లికి చెందిన జయంత్‌యాదవ్, సుచిత్రకు చెందిన సోహెల్, అంగడిపేటకు చెందిన తరుణ్‌గౌడ్, గుండ్లపోచంపల్లికి చెందిన పవన్‌లతో కలసి.. పదునైన ఆయుధాలు, కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేశాడు. దుస్తులను విప్పించి నగ్నంగా రోడ్డుపై నిలబెట్టి కులం పేరుతో బూతులు తిట్టాడు. తన కాళ్లు నాకించుకున్నాడు. ఇదంతా ఫోన్‌లో వీడియోలు తీసి తరుణ్ స్నేహితులకు పంపారు. తీవ్రంగా గాయపడిన తరుణ్.. ఆస్పత్రిలో చేరాడు. తర్వాత ఏప్రిల్ 13న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులంతా పరారీలో ఉన్నారని తెలిపారు.



గాయాలతో తరుణ్‌కుమార్

చిత్రజ్యోతి

SINCE 1965

అలరించే ప్రేమగీతం



పాతతరం గ్రామీణ ప్రేమకథ నేపథ్యంలో అల్లుకున్న ఓ ఆసక్తికర కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'దూరదర్శని'. 'కలిపింది ఇద్దరినీ' అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకుడు. బి. సాయిప్రతాప్ రెడ్డి, జయశంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై రూపొందించిన ప్రేమగీతాన్ని దర్శకుడు సుకుమార్ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. సురేశ్ బనిశెట్టి సాహిత్యం అందించగా, ఆనంద్ గుర్రాన బాణీలు సమకూర్చారు. సింధుజ, శ్రీనివాసన్ ఆలపించారు. తొంభైల నాటి కాలానికి ప్రేక్షకులను తీసుకెళ్లి, నాటి ప్రేమకథలను గుర్తుకు తెచ్చేలా ఈ చిత్రం ఉంటుందని దర్శకుడు చెప్పారు. చాలా పరిశోధన చేసి రూపొందించిన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని నిర్మాతలు తెలిపారు.

క్లైమాక్స్ మెప్పిస్తోంది

కల్యాణ్‌రామ్

'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన ఆనందాన్ని ఇస్తోంది. విజయశాంతి గారితో కలసి ఈ సినిమా చేయడం గొప్ప అనుభూతినిచ్చింది. తల్లీ కొడుకుల అనుబంధం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. శ్రీకాంత్ గారి పాత్రకు ప్రేక్షకుల నుంచి చక్కని స్పందన వస్తోంది. 'ఇలాంటి క్లైమాక్స్ ఇండియన్ స్ర్కీన్ మీద ఇప్పటివరకూ చూడలేదు' అని ప్రశంసలు అందుతున్నాయి. దర్శకుడు ప్రదీప్, నిర్మాత సునీల్, అశోక్ కష్టం వల్లే ప్రేక్షకులకు చేరువయ్యాం' అని కల్యాణ్‌రామ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి చక్కటి ప్రేక్షకాదరణ దక్కుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. దర్శకుడు ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ 'కల్యాణ్‌రామ్, విజయశాంతి గారి నటన ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోంది. ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు. ఒక మంచి సినిమాలో భాగమైనందుకు సంతోషంగా ఉందని నిర్మాత సునీల్ బలుసు తెలిపారు. అన్ని ఏరియాల నుంచి సినిమాకు అద్భుతమైన స్పందన వస్తోంది అని శ్రీకాంత్ తెలిపారు.





ఒక్కరూ 'ఐ లవ్ యూ' చెప్పలేదు

కమల్ హాసన్

మణిరత్నం దర్శకత్వంలో తాను హీరోగా నటించిన 'థగ్‌లైఫ్' చిత్రంలో ఇద్దరు హీరోయిన్లు నటించారని, వారిలో ఏ ఒక్కరూ తనకు ఐ లవ్ యూ చెప్పలేదని అగ్ర నటుడు కమల్ హాసన్ చమత్కరించారు. రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం జూన్ 5న విడుదలకానుంది. శుక్రవారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో మూవీలోని తొలి పాటను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మణిరత్నం, కమల్ హాసన్, ఏఆర్ రెహ్మాన్, శింబు, త్రిష, అభిరామి తదితరులు పాల్గొన్నారు. ఇందులో కమల్ హాసన్ మాట్లాడుతూ, 'మణిరత్నం దర్శకత్వంలో 37 యేళ్ళ క్రితం 'నాయగన్' చిత్రంలో నటించాను. ఆయనలో అప్పటికీ ఇప్పటికీ ఎలాంటి మార్పు లేదు. అది ఆయన గొప్పతనం. త్రిష, అభిరామి హీరోయిన్లుగా నటించారు. వారిలో ఒక్కరు కూడా ఐ లవ్ యూ చెప్పలేదు. ఏఆర్ రెహ్మాన్ సంగీతం నా మనసుకు దగ్గరగా ఉంటుంది. చిత్రపరిశ్రమలో హీరో శింబు లాంటి వ్యక్తి చాలా అరుదుగా ఉంటారు. ఈ సినిమాలో భాగమైన అందరికీ కృతజ్ఞతలు. ఇప్పుడు భారతీయ చిత్రపరిశ్రమ ఎంతగానో అభివృద్ధి చెందింది. తమిళం తర్వాత భారతీయ అనుసంధాన భాష ఆంగ్లమే' అని కమల్ హాసన్ స్పష్టం చేశారు. దర్శకుడు మణిరత్నం మాట్లాడుతూ, 'చాలా సంవత్సరాల తర్వాత కమల్‌తో పనిచేసే అవకాశం వచ్చింది. ఆయన గొప్ప నటుడు. సినిమాను ప్రేమిస్తారు. షూటింగ్ సమయంలో ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అన్నారు. హీరోయిన్ త్రిష మాట్లాడుతూ, "థగ్‌లైఫ్' మూవీలో కమల్ వంటి గొప్ప నటుడితో స్ర్కీన్ షేర్ చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. హీరో శింబు మాట్లాడుతూ, 'ఎంతోమంది గొప్ప నటులు ఈ సినిమా కోసం పనిచేశారు. వారితో కలిసి నటించినందుకు ఆనందంగా ఉంది. ఏఆర్ రెహ్మాన్ నాకు గురువుతో సమానం' అన్నారు. ఏఆర్ రెహ్మాన్ మాట్లాడుతూ, 'కమల్ - మణిరత్నంలది హిట్ కాంబినేషన్. ఈ సినిమా పాటల్లో ఒక మేజిక్ ఉంది. ఈ పాటలు ఎంతగానో ఆలరిస్తాయి. నాలుగు నెలలుగా సినిమా కోసం శ్రమిస్తున్నాం' అన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ఉత్కంఠకు గురిచేసే రాత్రి



లవ్, సెంటిమెంట్, హారర్, సస్పెన్స్ అంశాల మేళవింపుగా తెరకెక్కుతోన్న చిత్రం 'బ్లైండ్ స్పాట్'. నవీన్‌చంద్ర కథానాయకుడిగా రాకేశ్‌వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. రామకృష్ణ వీరపనేని నిర్మించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది. క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిదని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ సందర్భంగా నవీన్‌చంద్ర మాట్లాడుతూ 'ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా కథ ఉంటుంది. ఒక రాత్రిలో జరిగే సంఘటనలతో కొందరి జీవితాలు ఎలా ప్రభావితమయ్యాయి అనేది ఆసక్తికరంగా చూపించబోతున్నాం. నటుడిగా నాకు కొత్త అనుభూతిని ఇచ్చిన చిత్రమిది' అన్నారు. రాశీ సింగ్ మాట్లాడుతూ 'కథలో నాది కీలకపాత్ర. నాకు ఇష్టమైన జానర్‌లో రూపొందిన చిత్రమిది' అని చెప్పారు. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం అని దర్శకుడు చెప్పారు.

మేలో శుభం విడుదల



హీరోయిన్ సమంత తన సొంత బేనర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బేనర్‌పై నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. శుక్రవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. మే 9న 'శుభం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. మన జీవితాలతో ముడిపడిన అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని ప్రేక్షకులను ఆకట్టుకొనే అన్ని అంశాలతో తెరకెక్కించిన చిత్రమిదని యూనిట్ తెలిపింది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. హర్షిత్‌రెడ్డి, శ్రియా కొంతం, గవిరెడ్డి శ్రీనివాస్ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, క్లింటన్ సెరజో

వినోదం పంచుతుంది



ఆమిర్‌ఖాన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'సితారే జమీన్ పర్'. ఆయన స్వీయ దర్శకత్వంలో వచ్చిన 'తారే జమీన్ పర్' చిత్రానికి ఇది సీక్వెల్. ఆర్ ఎస్ ప్రసన్న దర్శకుడు. ఆమిర్‌ఖాన్ సరసన జెనీలియా నటిస్తున్నారు. మే 1న ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు యూనిట్ శుక్రవారం ప్రకటించింది. "తారే జమీన్ పర్ ప్రేక్షకులను భావోద్వేగానికి గురి చేసింది. మనవైన జీవితాల్ని, పరిస్థితుల్ని ఆవిష్కరిస్తూ తెరకెక్కించిన చిత్రమది. కానీ 'సితారే జమీన్ పర్' వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. అందరినీ నవ్విస్తుంది' అని ఆమిర్‌ఖాన్ ఈ సందర్భంగా తెలిపారు. జూన్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

యూఎఫ్‌ఓ.. క్యూబ్‌లకు సీసీఐ జరిమానా

ప్రముఖ డిజిటల్ సినిమా డిస్ట్రిబ్యూషన్, సినిమా అడ్వర్టైజింగ్ సంస్థ యూఎఫ్‌ఓ మూవీస్‌పై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జరిమానాను విధించింది. అలాగే దాని అనుబంధ సంస్థలైన క్యూబ్ సినిమా టెక్నాలజీస్, స్క్రాబిల్ డిజిటల్స్‌తో సహా మూడింటికీ కలిపి దాదాపు రూ.2.70 కోట్ల పెనాల్టీని విధించింది. ఈ సంస్థలు.. అక్రమ వ్యాపార విధానాలను అవలంబిస్తున్నట్లు సీసీఐ పేర్కొంది. ఈ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్న థియేటర్ల నుంచి పోస్ట్ ప్రొడక్షన్ సర్వీసులు, సినిమా కంటెంట్‌ను అందించే ఇతర పోటీ సంస్థలకు ఎలాంటి వ్యాపార అవకాశాలు దక్కకుండా గుత్తాధిపత్య ధోరణిని ప్రదర్శిస్తున్నట్లు తెలిపింది. ఇకపై ఇలాంటి అనైతిక పద్ధతులను కొనసాగించవద్దని ఆ సంస్థలను ఆదేశించింది.

స్పోర్ట్స్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
ఢిల్లీ	6	5	1	0	10	0.744
పంజాబ్	7	5	2	0	10	0.308
గుజరాత్	6	4	2	0	8	1.081
బెంగళూరు	7	4	3	0	8	0.446
లఖ్‌నవూ	7	4	3	0	8	0.086
కోల్‌కతా	7	3	4	0	6	0.547
ముంబై	7	3	4	0	6	0.239
రాజస్థాన్	7	2	5	0	4	-0.714
హైదరాబాద్	7	2	5	0	4	-1.217
చెన్నై	7	2	5	0	4	-1.276

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర.రే: నెట్ రన్‌రేట్

క్రికెటర్లు నగ్న చిత్రాలు పంపేవారు



అనయ బంగర్

న్యూఢిల్లీ: లింగ మార్పిడి చేయించుకున్న మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె అనయ బంగర్ సంచలన వ్యాఖ్యలు చేసింది. కొంత మంది క్రికెటర్లు తనకు వారి నగ్న చిత్రాలు పంపి వేధించేవారని పేర్కొంది. ఆర్యన్ బంగర్‌గా ఉన్న అతడు.. గతేడాది అమ్మాయిగా మారిన విషయం తెలిసిందే. అబ్బాయిగా ఉన్నప్పుడు అనయకు అండర్-19 స్థాయిలో ముషీర్, సర్ఫరాజ్, జైస్వాల్ తదితర ఆటగాళ్లతో క్రికెట్ ఆడిన అనుభవం ఉంది. 'లింగ మార్పిడి చేయించుకున్నాక సహచర ఆటగాళ్ల నుంచి మిశ్రమ స్పందన లభించింది. కొందరి నుంచి లైంగిక వేధింపులు ఎదుర్కొన్నా. వారు తరచూ నాకు నగ్న ఫొటోలు పంపి ఇబ్బందిపెట్టేవారు. ఒకతను అందరి ముందు నన్ను తిడుతూ.. ఎవరూ లేనప్పుడు నా ఫొటోలు అడిగేవాడు. ఒకసారి సీనియర్ క్రికెటర్‌కు నా ఇబ్బందికర పరిస్థితి గురించి చెబితే.. పద కారులో వెళ్దామని చెప్పి, నాతో పడుకోవాలనుందని అన్నాడు' అని ప్రస్తుతం ఇంగ్లండ్‌లో చదువుకుంటున్న అనయ ఓ ఇంటర్వ్యూలో పేర్కొంది.

చెన్నై జట్టులోకి బ్రెవిస్

చెన్నై: దక్షిణాఫ్రికా డాషింగ్ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ ఈ ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరపున బరిలోకి దిగనున్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జప్‌నీత్ సింగ్ గాయంతో ఈ సీజన్‌కు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానాన్ని 21 ఏళ్ల బ్రెవిస్‌తో భర్తీ చేస్తున్నట్టు చెన్నై ఫ్రాంచైజీ ప్రకటించింది. రూ.75 లక్షల కనీస ధర కలిగిన బ్రెవిస్‌ను వేలంలో ఎవరూ కొనుగోలు చేయలేదు. అయితే ఇప్పుడు అతడిని గుర్జప్ ధర అయిన రూ. 2.2 కోట్లకు చెన్నై జట్టు తీసుకోవడం విశేషం. లీగ్‌లో అత్యంత పేలవ బ్యాటింగ్ లైనప్ కలిగిన ధోనీ సేనకు హిట్టర్ బ్రెవిస్ రాకతో కాస్త బలం చేకూరినట్టయ్యింది. గత మూడు సీజన్లపాటు అతడు ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్నాడు.

వాంఖడేలో స్టాండ్..అరుదైన గౌరవం



రోహిత్

ముంబై: స్థానిక వాంఖడే మైదానంలోని దివేచా పెవిలియన్ లెవెల్ 3 స్టాండ్‌కు తన పేరును పెట్టడం.. అరుదైన గౌరవంగా భావిస్తున్నానని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. 'వాంఖడేలో నా పేరుపై ఓ స్టాండ్‌ను ఊహించలేదు. ఇది నాకు దక్కిన గౌరవం' అని రోహిత్ తెలిపాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన ముంబై టీ20 లీగ్ కార్యక్రమంలో రోహిత్ పాల్గొన్నాడు. ఇక, క్రికెట్‌కు అందించిన సేవలకు గుర్తుగా స్టేడియంలో ఓ స్టాండ్‌కు రోహిత్, అలాగే మరో రెండు స్టాండ్లకు భారత మాజీ కెప్టెన్ అజిత్ వాడేకర్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శరద్ పవార్ పేర్లను పెట్టినట్టు ముంబై క్రికెట్ సంఘం తెలిపింది.

సెమీస్‌కు అనహత్, వీర్



కౌలాలంపూర్: ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ ఈవెంట్ (ఆసియా)లో భారత స్టార్లు అనహత్ సింగ్, వీర్ చోత్రాని పతకాల దిశగా దూసుకెళుతున్నారు. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో 17 ఏళ్ల అనహత్ 11-1, 11-7, 11-5తో జపాన్‌కు చెందిన అకారి మిదోరికవాను ఓడించి సెమీఫైనల్ చేరింది. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ వీర్ చోత్రాని 9-11, 11-6, 11-6, 11-7తో ఆరో సీడ్ మహ్మద్ సైఫిక్ కమల్ (మలేసియా)పై గెలిచాడు. సెమీఫైనల్స్‌లో 8వ సీడ్ హెలెన్ తాంగ్ (హాంకాంగ్)తో అనహత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ టోర్నీ విజేతలు వచ్చేనెల 9 నుంచి 17 వరకు చికాగోలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధిస్తారు.

'ఫిక్సింగ్'లో ఫ్రాంచైజీ మాజీ యజమానిపై నిషేధం

న్యూఢిల్లీ: ముంబై టీ20 లీగ్-2019 సందర్భంగా క్రికెటర్లు ధవల్ కులకర్ణి, భవానీ ఠక్కర్‌ను ఫిక్సింగ్ ఉచ్చులో లాగేందుకు యత్నించిన.. లీగ్‌లో సోబో సూపర్ సోనిక్స్ జట్టు ఫ్రాంచైజీ మాజీ సహ యజమాని గుర్మీత్ సింగ్ భమ్రాపై వేటు పడింది. ఈమేరకు గుర్మీత్‌పై నిషేధం విధిస్తూ బీసీసీఐ అంబుడ్స్‌మన్, విశ్రాంత జస్టిస్ అరుణ్ మిశ్రా శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. 2019లో ముంబై టీ 20 లీగ్ ఆరంభమైంది. అయితే కొవిడ్ కారణంగా మళ్లీ నిర్వహించలేదు. ఈ ఏడాది తిరిగి లీగ్‌ను ప్రారంభిస్తున్నారు. కాగా గుర్మీత్‌పై ఎన్నేళ్ల నిషేధం విధిస్తున్నది మాత్రం వెల్లడించలేదు.

పంజాబ్ అదుర్స్

సొంతగడ్డపై బెంగళూరుకు హ్యాట్రిక్ ఓటమి

బెంగళూరు: పంజాబ్ కింగ్స్ నుంచి మరో అదిరిపోయే ప్రదర్శన. పటిష్ట బ్యాటింగ్ లైనప్ కలిగిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఆ జట్టు బౌలర్లు వంద పరుగుల్లోపే కట్టడి చేయగా.. బ్యాటింగ్‌లో నేహల్ వధేరా (19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 33 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. దీంతో శుక్రవారం జరిగిన ఈ లోస్కోరింగ్ థ్రిల్లర్‌లో పంజాబ్ 5 వికెట్ల తేడాతో గెలిచింది. అటు తమ సొంత మైదానంలో బెంగళూరుకిది హ్యాట్రిక్ ఓటమి. అంతకుముందు సాయంత్రం నుంచే వర్షం కురవడంతో నిర్ణీత సమయానికి టాస్ వీలు పడలేదు. అంతకంతకూ వర్షం తీవ్రం కావడంతో మ్యాచ్ నిర్వహణపై కూడా సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే రాత్రి తొమ్మిది గంటలకు కాస్త తెరిపినివ్వడంతో మ్యాచ్‌ను 14 ఓవర్లకు కుదించారు. దీంతో రాత్రి 9.45కు మ్యాచ్ ఆరంభమైంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 14 ఓవర్లలో 9 వికెట్లకు 95 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్ (26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 50 నాటౌట్), రజత్ పటీదార్ (18 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 23) మినహా తొమ్మిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పెవిలియన్‌కు చేరారు. జాన్సెన్, చాహల్, హర్‌ప్రీత్, అర్ష్‌దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో పంజాబ్ 12.1 ఓవర్లలో 5 వికెట్లకు 98 పరుగులు చేసి నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా టిమ్ డేవిడ్ నిలిచాడు.

నేహల్ అండతో..: స్వల్ప ఛేదనే అయినా పంజాబ్ కూడా తడబడింది. బెంగళూరులా టపటపా వికెట్లు కోల్పోకున్నా.. పరుగులు మాత్రం అంత సులువుగా రాలేదు. చివర్లో నేహల్ వధేరా అండగా నిలిచి జట్టును గట్టెక్కించాడు. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (16), ప్రభ్‌సిమ్రన్ (13) మాత్రం ఉన్న కాసేపే అయినా జోరు ప్రదర్శించారు. తొలి వికెట్‌కు 22 పరుగులు జోడించాక మూడో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్‌ను భువీ అవుట్ చేశాడు. హాజెల్‌వుడ్ తన వరుస ఓవర్లలో ప్రియాన్ష్, శ్రేయాస్ (7)లతో పాటు కుదురుకున్న ఇన్‌గ్లి‌స్ (14)ను అవుట్ చేయడంతో పంజాబ్‌పై ఒత్తిడి పెరిగింది. అయితే ఆరంభంలో ఇబ్బందిపడిన నేహల్ ఆ తర్వాత బ్యాట్ ఝుళిపించాడు. తొమ్మిదో ఓవర్‌లో 4,6తో 10 రన్స్ సాధించగా.. హాజెల్‌వుడ్ తన చివరి ఓవర్‌లో రెండు పరుగులే ఇచ్చి కట్టడి చేశాడు. ఈ దశలో నేహల్ 11వ ఓవర్‌లో 6,4తో పాటు బైస్ రూపంలో బౌండరీ రావడంతో 15 రన్స్ సమకూరాయి. అయినా 18 బంతుల్లో 17 రావాల్సి ఉండడంతో ఈ పిచ్‌పై ఏమైనా జరగవచ్చని అంతా అంచనా వేశారు. పైగా 12వ ఓవర్‌లో శశాంక్ (1)ను భువీ అవుట్ చేసి బెంగళూరులో కాస్త జోష్ నింపాడు. కానీ వధేరా అదే ఓవర్ ఆఖరి రెండు బంతులను 6,4గా మలిచి సమీకరణం 12 బంతులు 5 పరుగులకు మార్చడంతో ఫలితం అర్థమైంది. అటు స్టొయినిస్ (7 నాటౌట్) సిక్సర్‌తో 11 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.



నేహల్ వధేరా (33 నాటౌట్)

1 నాలుగేళ్ల ఐపీఎల్ కెరీర్‌లో టిమ్ డేవిడ్ హాఫ్ సెంచరీ సాధించడం ఇదే తొలిసారి.

ఒకే వేదికపై ఎక్కువ మ్యాచ్‌లు (బెంగళూరులో 46) ఓడిన జట్టుగా ఆర్‌సీబీ.

నేటి మ్యాచ్‌లు

మ్యాచ్	సమయం	వేదిక
గుజరాత్ x ఢిల్లీ	మ.3.30 నుంచి	వేదిక: అహ్మదాబాద్
రాజస్థాన్ x లఖ్‌నవూ	రా.7.30 నుంచి	వేదిక: జైపూర్

డేవిడ్ ఒక్కడే..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు ఇన్నింగ్స్‌లో ఏడో నెంబర్ బ్యాటర్ టిమ్ డేవిడ్ ఆటతీరు మినహా చెప్పుకోవడానికేమీ లేదు. అతనొక్కడే 50 పరుగులు చేయగా.. మిగిలిన జట్టు చేసింది 45 పరుగులే కావడం గమనార్హం. కెప్టెన్ రజత్ పటీదార్ పర్వాలేదనిపించాడు. ఇక మిగిలిన బ్యాటర్లు పంజాబ్ బౌలర్ల జోరుకు ఇలా వచ్చి అలా పెవిలియన్ చేరారు. పిచ్ స్లోగా మారినా భారీ స్కోరు ప్రత్యర్థి ముందుంచాలనే ఆలోచనతో షాట్లకు వెళ్లడం దెబ్బతీసింది. అటు పంజాబ్ ఫీల్డర్లు అద్భుత క్యాచ్‌లతో ఆకట్టుకున్నారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఫిల్ సాల్ట్ (4)ను అవుట్ చేసిన పేసర్ అర్ష్‌దీప్, తన తర్వాతి ఓవర్‌లోనే విరాట్ కోహ్లీ (1) పనిబట్టాడు. ఇక ఆ తర్వాత బౌలర్లు జాన్సెన్, చాహల్ కట్టడి చేయడంతో 42/7 స్కోరుతో బెంగళూరు పీకల్లోతు కష్టాల్లో పడింది. అప్పటికి తొమ్మిది ఓవర్లు కూడా పూర్తి కాలేదు. ఈ స్థితిలో జట్టుకు టిమ్ డేవిడ్ ఆపద్బాంధవుడయ్యాడు. భువనేశ్వర్ (8)తో ఎనిమిదో వికెట్‌కు 21 పరుగులు జోడించాడు. ఇక, చివరిదైన 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లతో జట్టు స్కోరును 90 దాటించిన డేవిడ్.. 26 బంతుల్లో అర్ధ సెంచరీని కూడా పూర్తి చేసుకున్నాడు. అలాగే హాజెల్‌వుడ్ (0 నాటౌట్)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు అజేయంగా 32 పరుగులు జోడించాడు.



డేవిడ్ (50 నాటౌట్)

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (సి) ఇంగ్లిస్ (బి) అర్ష్‌దీప్ 4, కోహ్లీ (సి) జాన్సెన్ (బి) అర్ష్‌దీప్ 1, పటీదార్ (సి) బార్ట్‌లెట్ (బి) చాహల్ 23, లివింగ్‌స్టోన్ (సి) ఆర్య (బి) బార్ట్‌లెట్ 4, జితేశ్ (సి) వధేరా (బి) చాహల్ 2, క్రునాల్ (సి అండ్ బి) జాన్సెన్ 1, టిమ్ డేవిడ్ (నాటౌట్) 50, మనోజ్ భండగె (ఎల్బీ) జాన్సెన్ 1, భువనేశ్వర్ (సి) బార్ట్‌లెట్ (బి) హర్‌ప్రీత్ 8, యశ్ దయాల్ (ఎల్బీ) హర్‌ప్రీత్ 0, హాజెల్‌వుడ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 14 ఓవర్లలో 95/9; వికెట్ల పతనం:** 1-4, 2-21, 3-26, 4-32, 5-33, 6-41, 7-42, 8-63, 9-63; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-23-2, బార్ట్‌లెట్ 3-0-26-1, జాన్సెన్ 3-0-10-2, చాహల్ 3-0-11-2, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-25-2.

పంజాబ్: ప్రియాన్ష్ ఆర్య (సి) డేవిడ్ (బి) హాజెల్‌వుడ్ 16, ప్రభ్‌సిమ్రన్ (సి) డేవిడ్ (బి) భువనేశ్వర్ 13, శ్రేయాస్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 7, ఇంగ్లిస్ (సి) సుయాశ్ (బి) హాజెల్‌వుడ్ 14, నేహల్ వధేరా (నాటౌట్) 33, శశాంక్ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 1, స్టొయినిస్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 12.1 ఓవర్లలో 98/5; వికెట్ల పతనం:** 1-22, 2-32, 3-52, 4-53, 5-81; **బౌలింగ్:** భువనేశ్వర్ 3-0-26-2, యశ్ 2.1-0-18-0, హాజెల్‌వుడ్ 3-0-14-3, క్రునాల్ 1-0-10-0, సుయాశ్ 3-0-25-0.

పారా స్విమ్మర్ గణేష్ రికార్డు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): శ్రీలంకలోని తలైమన్నార్ నుంచి భారత్‌లోని ధనుష్కోటి తీరాన్ని అత్యంత తక్కువ సమయంలో ఈదిన పారా స్విమ్మర్‌గా గణేష్ రికార్డు సృష్టించాడు. శుక్రవారం ఉదయం 5.50 గంటలకు శ్రీలంకలో ఈత మొదలు పెట్టిన గణేష్ సాయంత్రం 4.20 గంటలకు ధనుష్కోటి తీరానికి చేరుకున్నాడు. మొత్తం 28 కిలోమీటర్ల దూరాన్ని గణేష్ 10 గంటల 30 నిమిషాల్లో ముగించాడు. ఎన్ఐఎస్ కోచ్ అయిన గణేష్ ప్రస్తుతం ఏలూరులో జిల్లాలో శాప్ స్విమ్మింగ్ కోచ్‌గా పని చేస్తున్నాడు.

హంపి-హారిక గేమ్ డ్రా

పుణె: ఇద్దరు తెలుగు గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి-ద్రోణవల్లి హారిక మధ్య అత్యంత ఆసక్తి రేపిన మహిళల గ్రాండ్ ప్రీ చెస్ ఐదో రౌండ్ గేమ్ డ్రా అయ్యింది. శుక్రవారం జరిగిన ఈ గేమ్‌లో హంపి-హారిక అతి జాగ్రత్తగా ఆడడంతో కేవలం 19 ఎత్తులలో ఫలితం తేలకుండా ముగిసింది. ఈ రౌండ్ అనంతరం హంపి (3.5 పాయింట్లు) తన రెండో స్థానాన్ని కొనసాగిస్తోంది. హారిక (2.5) ఐదో స్థానంలో నిలిచింది. ఝు జినెర్ (చైనా, 4) అగ్రస్థానంలోనే నిలిచింది.

హిమాన్షుకు స్వర్ణం

ఆసియా అండర్-18 అథ్లెటిక్స్



న్యూఢిల్లీ: భారత యువ అథ్లెట్ హిమాన్షు ఆసియా అండర్-18 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాడు. సౌదీ అరేబియాలోని దమ్మామ్‌లో శుక్రవారం జరిగిన జావెలిన్ త్రోలో హిమాన్షు.. ఈటెను 67.57 మీటర్లు విసిరి విజేతగా నిలిచాడు. ఇక దేవక్ భూషణ్ హైజంప్‌లో రజతం నెగ్గగా, పురుషుల మెడ్లే రిలే ఈవెంట్‌లో భారత జట్టు రజతం సాధించింది. ఇక, ఇప్పటికే డిస్కస్ త్రోలో కాంస్యం సాధించిన 16 ఏళ్ల నిశ్చయ్.. తాజాగా షాట్‌పుట్‌లో రజతంతో టోర్నీలో రెండో పతకం అందుకున్నాడు. మహిళల 200 మీటర్ల రేసులో ఆర్తి కాంస్యం పతకం గెలిచింది.

రూ.6.83 లక్షల కోట్లు

ఆర్‌బీఐ వద్ద ఉన్న బంగారం విలువ ఇది



879 టన్నులకు చేరిన నిల్వలు

మన విదేశీ మారక నిల్వల్లో 11.4 శాతానికి పెరిగిన వాటా

ముంబై:భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వద్ద ఎంత బంగారం ఉందో తెలుసా..? ఈ ఫిబ్రవరి నాటికి ఆర్‌బీఐ 879 టన్నులు పోగేసింది. ఆర్‌బీఐ తాజా డేటా ప్రకారం.. ఈ నిల్వల ప్రస్తుత విలువ 7,999 కోట్ల డాలర్లు. అంటే, మన కరెన్సీలో దాదాపు రూ.6.83 లక్షల కోట్లు. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలను వివిధీకరించడంతో పాటు మారకం రేటు హెచ్చుతగ్గుల కారణంగా నిల్వల విలువ తగ్గకుండా ఉండేందుకు ఆర్‌బీఐ గడిచిన కొన్నేళ్లుగా పసిడి నిల్వలను వేగంగా పెంచుకుంటూ వస్తోంది. గత ఏడాది చివరి నాటికి మన ఫారెక్స్ నిల్వల్లో బంగారం వాటా 11.4 శాతానికి పెరిగింది. 2019లో ఇది కేవలం 6.7 శాతంగా ఉంది.

3,300 డాలర్లు దాటిన ఔన్స్ గోల్డ్

అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు 3,300 డాలర్లు దాటేసింది. గురువారం ఒక దశలో ఔన్స్ ధర 3,371 డాలర్ల వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. ట్రంప్ సుంకాలు, వాణిజ్య యుద్ధం, మాంద్యం భయాలు పసిడిని రోజుకో రికార్డు స్థాయికి చేరుస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు గోల్డ్ రేటు 25 శాతం పెరిగింది. 2024లోనూ 28 శాతం ఎగబాకింది. 2023లో 15 శాతం వృద్ధి నమోదైంది. గడిచిన ఏడాది కాలంలో ఔన్స్ గోల్డ్ 1,000 డాలర్ల మేర పెరిగింది. పసిడి చరిత్రలో ఇదే అత్యంత వేగవంతమైన వార్షిక ధర పెరుగుదల. మాంద్యం భయాలు, డాలర్ బలహీనపడుతుండటం, సెంట్రల్ బ్యాంక్‌ల కొనుగోళ్లతో ముున్ముందు బంగారం ధర మరింత ఎగబాకేందుకే అవకాశాలెక్కువని బులియన్ విశ్లేషకులు అంటున్నారు. సుంకాల విధ్వంసం తీవ్రతరమైతే ఈ ఏడాది చివరినాటికి ఔన్స్ గోల్డ్ 4,500 డాలర్ల వరకు పెరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంతర్జాతీయ ఆర్థిక సలహాల సంస్థ డెవెర్ గ్రూప్ అంటోంది.

సంవత్సరాల వారీగా ఈ నెలలో ఔన్స్ గోల్డ్ ధర

ఏప్రిల్	డాలర్లు
2021	1,725
2022	1,920
2023	2,000
2024	2,350
2025	3,300

2024లో 72.6 టన్నులు కొనుగోలు

ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) డేటా ప్రకారం.. గత సంవత్సరంలో ఆర్‌బీఐ 72.6 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. తద్వారా వీటి నిల్వలను మరో 9 శాతం పెంచుకుంది. ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు 2024లో మొత్తం 1,045 టన్నుల బంగారాన్ని పోగేయగా.. అందులో ఆర్‌బీఐదే రెండో అత్యధిక కొనుగోలు. గత ఏడాదిలోని 12 నెలల్లో 11 నెలలు ఆర్‌బీఐ ఈ నిల్వలను పెంచుకుంటూ వచ్చింది.

- 2023లో పోగేసిన 16 టన్నులతో పోలిస్తే, 2024లో ఆర్‌బీఐ నాలుగు రెట్లకు పైగా బంగారం కొనుగోలు చేసింది.
- ఇంతక్రితం 2021లోనూ ఇదే స్థాయిలో కొనుగోళ్లు జరిపింది. ఆ ఏడాది నిల్వలను 77.5 టన్నుల మేర పెంచింది.
- ఈ ఏడాదిలోనూ మొదటి రెండు నెలల్లో (జనవరి, ఫిబ్రవరి) 2.8 టన్నులు కొనుగోలు చేసింది.
- ఆర్‌బీఐ సహా ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లన్నీ పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటున్నాయి. గత మూడేళ్లుగా ఏటా 1,000 టన్నులకు పైగా కొనుగోళ్లు జరిపాయి.

పసిడి కొనుగోళ్లు (టన్నులు)

ఏడాది	ఆర్‌బీఐ	ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు
2021	77.5	------
2022	33.3	1,082
2023	16.2	1,037
2024	72.6	1,045
2025	2.8	44

(ఫిబ్రవరి వరకు)

67,783 కోట్ల డాలర్లకు ఫారెక్స్ నిల్వలు

ఈ నెల 11తో ముగిసిన వారంలో మన విదేశీ మారక నిల్వలు మరో 156.7 కోట్ల డాలర్ల మేర పెరిగి మొత్తం 67,783.50 కోట్ల డాలర్లకు చేరాయని ఆర్‌బీఐ వెల్లడించింది. ఫారెక్స్ నిల్వలు పెరగడం వరుసగా ఇది ఆరో వారం. కాగా, గత సెప్టెంబరులో నిల్వలు ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 70,488.5 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఆ తర్వాత కాలంలో మళ్లీ తగ్గుతూ వచ్చిన నిల్వలు గత నెల నుంచి కాస్త పుంజుకున్నాయి.

బంగారం దిగుమతులు 192% అప్

మార్చిలో 447 కోట్ల డాలర్లకు చేరిక

గత నెలలో దేశంలోకి బంగారం దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 192.13 శాతం పెరిగి 447 కోట్లకు డాలర్లకు చేరాయని కేంద్ర వాణిజ్య శాఖ శుక్రవారం వెల్లడించింది. ఈ మధ్యకాలంలో బంగారం ధరలు వేగంగా పెరగడం దిగుమతుల విలువ పెరుగుదలకు కారణమని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ఏడాది తొలి త్రైమాసికం (జనవరి-మార్చి)లో పసిడి దిగుమతులు 27.27 శాతం పెరిగి 5,800 కోట్ల డాలర్లకు చేరాయి. గత ఏడాదిలో ఇదే కాలానికి దిగుమతులు 4,554 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ట్రంప్ సుంకాల నేపథ్యంలో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు పెరిగాయి. ఈ సమయంలో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరుండటంతో మదుపరులు పసిడిలో పెట్టుబడులు పెంచుకుంటున్నారు.

'బేర్'మంటున్న డాలర్

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధంతో అమెరికా కరెన్సీ డాలర్ కూడా 'బేర్'మంటోంది. కీలకమైన ఆరు ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు ఇప్పటికే మూడేళ్ల కనిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది జనవరి 15 నుంచి ఇప్పటి వరకు చూసినా ఈ కరెన్సీలతో డాలర్ మారకం రేటు 9 శాతం నష్టపోయింది. ఇక ఈ నెల ప్రారంభం నుంచి చూసినా యూరో, బ్రిటిష్ పౌండ్, జపాన్ యెన్‌లతో డాలర్ మారకం రేటు 5 నుంచి 6 శాతం పడిపోయింది. ట్రంప్ దుందుడుకు ఆర్థిక విధానాలతో డాలర్ మారకం రేటు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

డాలర్ ఆధిపత్యానికి గండి: డాలర్ మారకం రేటు పడిపోవడం అమెరికా ఆర్థికవేత్తలను కలవరపరుస్తోంది. ఈ పతనానికి వెంటనే తెరపడకపోతే ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా డాలర్ తన స్థానాన్ని కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ చెల్లింపుల్లో డాలర్‌దే అగ్రస్థానం. డాలర్ మారకం రేటు మరింత క్షీణిస్తే ఆ ఆధిపత్యానికీ తెరపడినట్టే.

మళ్లీ ట్రూజెట్ విమాన సర్వీసులు!

అనుమతుల కోసం ప్రయత్నాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రాంతీయ విమానయాన సంస్థ 'ట్రూజెట్' మళ్లీ తన విమాన సర్వీసులు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం తన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్ఓసీ) పునరుద్ధరించాలని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ (ఎంఓసీఏ)కు ట్రూజెట్ దరఖాస్తు చేసినట్లు తెలిసింది. ఎంఓసీఏ ఇందుకు ఆమోదం తెలిపితే పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నుంచి కంపెనీ తన పాత ఎయిర్ ఆపరేషన్స్ పర్మిట్ (ఏఓపీ)ను పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. వీటికి తోడు కంపెనీ బోర్డులోని సభ్యుల నియామకాలకూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతి అవసరం. ఈ అనుమతులన్నీ పూర్తి చేసి ఈ ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబరు మధ్య కాలంలో హైదరాబాద్ నుంచి మళ్లీ కొద్దిపాటి ఏటీఆర్ టర్బో విమానాలతో ప్రాంతీయ విమాన సర్వీసులు ప్రారంభించాలని ట్రూజెట్ భావిస్తోంది.

రూ.100 కోట్ల పెట్టుబడి: విమాన సర్వీసుల పునరుద్ధరణ కోసం ట్రూజెట్ యాజమాన్యం రూ.100 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్టు సమాచారం. దీంతో ఐదు ఏటీఆర్ విమానాలతో పాటు దేశంలోని కొన్ని ప్రధాన నగరాల మధ్య ఎయిర్‌బస్ ఏ-320 విమాన సర్వీసులూ ప్రారంభించాలని యోచిస్తోంది. ఖర్చులు తగ్గించుకునేందుకు ఏ-320 పాత విమానాలను ఆఫ్రికా లేదా ఇతర దేశాల నుంచి కొనాలని కంపెనీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సంవత్సరాంతం నాటికి లేదా వచ్చే ఏడాది ఆరంభంలో ఈ విమానాలను అందుబాటులోకి తీసుకురావాలని ట్రూజెట్ చూస్తోంది. ఈ ఎయిర్‌బస్ విమానాలకు విశాఖ విమానాశ్రయం, ఏటీఆర్ విమానాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవాలని ట్రూజెట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కేంద్రంగా 2015 నుంచి 2022 వరకు ట్రూజెట్ కార్యకలాపాలు సాగించింది. అయితే కొవిడ్ కారణంగా పరిస్థితులు తలకిందులు కావటంతో 2022 ఫిబ్రవరిలో తన కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసింది.

బిజినెస్


అంతర్జాతీయ ఫార్మా కంపెనీతో దివీస్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయంగా పేరొందిన ఫార్మా కంపెనీతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందం కుదుర్చుకున్నట్లు దివీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. అయితే ఆ కంపెనీ పేరును మాత్రం దివీస్ వెల్లడించలేదు. ఈ ఒప్పందం అమలులో భాగంగా తమ తయారీ కేంద్రాల్లో అదనపు సామర్థ్యాల జోడింపుపై రూ.650-700 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. ఈ సొమ్మును అంతర్గత వనరుల ద్వారానే సమీకరించుకోనున్నట్లు దివీస్ తెలిపింది. రెండు కంపెనీల మధ్య కుదిరిన వాణిజ్య నిబంధనావళి ప్రకారం దివీస్.. అడ్వాన్స్‌డ్ ఇంటర్మీడియేటరీలు తయారుచేసి, సరఫరా చేస్తుంది.

ఎంఎస్ఎన్ రియల్టీ నుంచి వన్ బై ఎంఎస్ఎన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎంఎస్ఎన్ గ్రూప్ అనుబంధ సంస్థ ఎంఎస్ఎన్ రియల్టీ.. హైదరాబాద్‌లో తొలి రెసిడెన్షియల్ రియల్టీ ప్రాజెక్టును ప్రారంభించింది. కోకాపేట నియోపోలిస్‌లో వన్ బై ఎంఎస్ఎన్ పేరుతో 7.7 ఎకరాల్లో రూ.2,750 కోట్లతో ఈ లగ్జరీ ప్రాజెక్ట్‌ను కంపెనీ అభివృద్ధి చేస్తోంది. 55 ఫ్లోర్లతో మొత్తం ఐదు టవర్లలో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో 655 ఫ్లాట్లు ఉంటాయని ఎంఎస్ఎన్ గ్రూప్ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి తెలిపారు. 5,250 నుంచి 7,460 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఫ్లాట్స్ ఉంటాయని ఆయన చెప్పారు. ఒక్కో ఫ్లాట్ ధర రూ.7 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు ఉండనుంది. 2030 నాటికల్లా వన్ బై ఎంఎస్ఎన్ పూర్తిగా అందుబాటులోకి రానుందన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	395
చిత్తూరు	460	విశాఖపట్నం	425
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	120
వరంగల్	120	గుంటూరు	120
కరీంనగర్	120	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	85
కర్నూలు	120	నెల్లూరు	90
విశాఖపట్నం	109	అనంతపురం	90
గోదావరి	120		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,580 ▲	89,450 ▲	1,09,800 ▼
విజయవాడ	98,600 ▲	91,000 ▼	98,500 ▲
విశాఖపట్నం	97,580 ▼	89,450 ▼	1,10,000 ▼
రాజమండ్రి	97,580 ▲	89,450 ▲	98,100 ▼
ప్రొద్దుటూరు	94,200 ▼	86,670 ▼	98,500 ▲
ముంబై	94,910 ▲	86,940 ▲	95,150 ▼

కంచ గచ్చిబౌలి భూముల వివాదం

విచారణకు హాజరైన మన్నె క్రిశాంక్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకులు మన్నె క్రిశాంక్ కంచ గచ్చిబౌలి భూముల విషయంపై గచ్చిబౌలి పోలీసు స్టేషన్లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు విచారణకు హాజరయ్యారు. ఆ సమయంలో ఆయన ధరించిన టీ షర్ట్‌పై 'సుప్రీం కోర్టు రాక్స్' అని ఇంగ్లీషులో రాసి ఉంది. అంతకు ముందు ఈ నెల 9వ తేదీన పోలీసుల విచారణకు హాజరైనప్పుడు సైతం క్రిశాంక్ నల్ల రంగు టీ షర్ట్‌ను ధరించగా దానిపై 'డెమోక్రసీ' అనే ఇంగ్లీషు పదంలో ఆర్ఆర్ అనే రెండు అక్షరాలు పెద్దగా ముద్రించి ఉన్నాయి. ఇలా రెండుసార్లు పోలీసుల విచారణకు తనదైన శైలిలో ఒక సందేశం ఉన్న టీ షర్టులను ధరించి ఆయన హాజరయ్యారు. సోషల్ మీడియాలో చేసిన పోస్టులపై నమోదైన 4 కేసులకు సంబంధించి పోలీసులు క్రిశాంక్‌ను విచారించారు. సుమారు 6 గంటలకు పైగానే ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఉన్నారు. ఫేక్ వీడియోలు వైరల్ చేశారనే ఆరోపణలతో కేసు నమోదు కాగా, పలుమార్లు విచారణకు హాజరయ్యారు. సోషల్ మీడియా మాధ్యమమైన 'ఎక్స్'లో కంచ గచ్చిబౌలి భూములపై చేసిన పోస్టులపైనే పోలీసులు ఆయన్ను ప్రశ్నించినట్లు సమాచారం. కాగా, విచారణ పేరుతో పోలీసులు ఉదయం పిలిచి రాత్రి వరకు కూర్చోబెట్టారని మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మళ్లీ 23న నాలుగో సారి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారని, విచారణ పేరుతో రేవంత్ ప్రభుత్వం వేధిస్తోందని అన్నారు.

గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేయండి

- అవకతవకలపై ప్రభుత్వం స్పందించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రూప్-1 పరీక్షలు రాసిన నిరుద్యోగుల జీవితాలు అగాథంలో పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. గ్రూప్-1 పరీక్షల నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి శుక్రవారం ఆమె లేఖ రాశారు. పరీక్ష నిర్వహణ తీరు, ఫలితాల వెల్లడిలో అవకతవకలున్నాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం తగదన్నారు. 21,075 మంది మెయిన్స్ పరీక్షలకు హాజరయితే.. ఫలితాలు ప్రకటించే సమయానికి వారి సంఖ్య 21,085 మందికి చేరిందని ఈ 10 మంది ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. కేవలం రెండు పరీక్ష కేంద్రాల్లో మెయిన్స్‌కు హాజరైన రెండు కోచింగ్ సెంటర్లకు చెందిన 71 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హత సాధించడం వెనుక ఏదో జరిగిందన్న అనుమానాలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు.

అంజన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న బీజేపీ శ్రేణులు

- కిషన్‌రెడ్డికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఉద్దేశించి అంజన్‌కుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలపై కమలం శ్రేణులు భగ్గుమన్నాయి. అంజన్‌కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు పలు ప్రాంతాల్లో ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. అంజన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అంజన్ కుమార్ యాదవ్ క్షమాపణ చెప్పనిపక్షంలో తగిన బుద్ధి చెప్తామని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్ రెడ్డి హెచ్చరించారు. అమీర్‌పేటలో అంజన్ కుమార్ యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేసిన తర్వాత ఆయన మాట్లాడుతూ అసభ్య పదజాలంతో దూషించడం సిగ్గుచేటని విమర్శించారు. అంజన్‌కుమార్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ మల్లంపేట రమేష్‌రామ్ డిమాండ్ చేశారు. ఆర్టీసీక్రాస్ రోడ్స్‌లో ముషీరాబాద్ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అండ ఉందని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించబోమని, తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతరం చిక్కడపల్లి పీఎస్‌లో అంజన్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు.

ఉద్యోగుల సంపూర్ణ ఆరోగ్యమే సంస్థకు అసలైన సంపద: ఆర్టీసీ ఎండీ సజ్జనార్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీకి ప్రధాన వనరులైన ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ ఆరోగ్యంగా ఉంటుందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో నూతనంగా అందుబాటులోకి తెచ్చిన క్యాథ్ లాబ్ సేవలను, 12 బెడ్లకు విస్తరించిన ఎమర్జెన్సీ కేర్ యూనిట్‌ను సజ్జనార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తార్నాక ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా తీర్చిదిద్దామన్నారు. ఆసుపత్రిలో గతంలో ప్రతి రోజు సగటున 6 వందల ఓపీలు ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య సుమారు 2 వేలకు పెరిగిందని తెలిపారు. గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌లో భాగంగా ఉద్యోగులతో పాటు వారి జీవిత భాగస్వాములకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి.. అందరికి హెల్త్ ప్రొఫైల్స్ అందజేస్తున్నామని చెప్పారు. క్యాథ్ ల్యాబ్, క్రిటికల్ కార్డియాక్ కేర్ యూనిట్‌తో పాటు ఎమర్జెన్సీ కేర్ యూనిట్ విస్తరణకు సహకరించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఫ్యాక్ట్ ఫౌండేషన్, అశోక్ లేలాండ్ సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా సజ్జనార్ అభినందించారు.

నేటి నుంచి ఎప్‌సెట్ హాల్‌టికెట్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్-2025 అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ అభ్యర్థులు శనివారం(19వ తేదీ) నుంచి హాల్‌టికెట్లను జేఎన్టీయూ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్ అభ్యర్థులు ఈ నెల 22 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షాకేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ నెల 29, 30వ తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్, మే 2 నుంచి 4వ తేదీ వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం జేఎన్టీయూలో యూనివర్సిటీ రెక్టార్, ఎప్‌సెట్ కో కన్వీనర్ డాక్టర్ విజయ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయని ఉదయం సెషన్ 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామని. ప్రతి సెషన్‌కు 90 నిమిషాల ముందే అభ్యర్థులను పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తామని చెప్పారు. అభ్యర్థులు ఎంచుకున్న జోన్ పరిధిలోనే పరీక్షాకేంద్రాలను కేటాయించామని, పరీక్షాకేంద్రాల లొకేషన్‌ను తెలుసుకునేందుకు వీలుగా అభ్యర్థుల హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించామని చెప్పారు. ఇంకా దరఖాస్తు చేయని అభ్యర్థులు ఈ నెల 24 వరకు ఆలస్య రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హాల్‌టికెట్లలో వివరాలు ఏవైనా తప్పుగా నమోదైతే అభ్యర్థులు వీలైనంత త్వరగా ఎప్‌సెట్ ఆఫీసుకు మెయిల్ ద్వారా సమాచారం పంపి అప్‌డేట్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టీచర్ల ప్రమోషన్ విధానంలో జోక్యం చేసుకోం

- నేరుగా ప్రభుత్వాన్నే ఆశ్రయించండి..హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టుల భర్తీపై ప్రస్తుతం ప్రభుత్వం పాటిస్తున్న విధానంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టంచేసింది. నేరుగా చేపట్టే నియామకాల ద్వారా ఎంత శాతం పోస్టులు భర్తీ చేయాలి, ప్రమోషన్ల ద్వారా ఎన్ని పోస్టులు భర్తీ చేయాలన్నది ప్రభుత్వ విధాన నిర్ణయమని, అందులో కల్పించుకోబోమని పేర్కొంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అధిక శాతం నేరుగా చేపట్టే నియామకాల ద్వారా భర్తీ చేయాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయవచ్చని పేర్కొంది. ఎస్ఏ పోస్టుల్లో 66 శాతం సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)లకు ప్రమోషన్లు ఇవ్వడం ద్వారా భర్తీ చేస్తున్నారని, నేరుగా బీఈడీ అభ్యర్థుల ద్వారా చేపట్టే నియామకాలకు కేవలం 33 శాతం మాత్రమే కేటాయించారని దీనివల్ల నష్టపోతున్నామని పేర్కొంటూ పిటిషన్ దాఖలయింది. దీనిపై జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ ఎస్ నర్సింగ్‌రావుల ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసే కోటాను తగ్గించాలని, శాతాలు మార్చాలని ప్రభుత్వానికి చెప్పలేమని తెలిపింది. పిటిషన్ దాఖలు చేసిన బీఈడీ అభ్యర్థులు ఈ విషయమై ప్రభుత్వాన్ని ఆశ్రయించవచ్చని తెలిపింది. పిటిషన్ విచారణను ముగించింది.

గ్రామస్థాయి నుంచి జన సమీకరణ చేయాలి

- సమన్వయంతో పని చేసి సభను సక్సెస్ చేద్దాం
- బీఆర్ఎస్ వైభవాన్ని మరో సారి చూపిద్దాం: కేసీఆర్



మర్కుక్/హైదరాబాద్/వరంగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గ్రామస్థాయి నుంచి జనసమీకరణ చేయాలని, నేతలందరూ సమన్వయంతో పనిచేసి సభను సక్సెస్ చేయాలని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సూచించారు. బీఆర్ఎస్ వైభవాన్ని మరో సారి కాంగ్రెస్‌కు చూపించాలని పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో 27న నిర్వహించనున్న రజతోత్సవ సభ ఏర్పాట్లపై శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి వద్ద జరుగుతున్న సభ ఏర్పాట్ల గురించి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఒడితెల సతీష్ వివరించారు. 1200 ఎకరాల్లో సభ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని, పార్కింగ్‌కు సంబంధించి పనులు పూర్తి చేశామని తెలిపారు. 16కిలో మీటర్ల అప్రోచ్ రోడ్లు, 11కిలో మీటర్ల వరకు రోడ్డు పొడవునా ర్యాంపులు నిర్మించామని వెల్లడించారు. 10లక్షల వాటర్ బాటిళ్లు, 10లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. శనివారం నుంచి సభా వేదిక నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ కవిత సారథ్యంలో సభా ప్రాంగణంలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

ఎర్రబెల్లి, పల్లా డుమ్మా

ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాటికొండ రాజయ్య పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ నేతల మధ్య సమన్వయం లేదని, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి విషయంలో ఎర్రబెల్లికి వ్యతిరేకంగా ఓ వర్గం పావులు కదిపిందనీ ఇటీవల ప్రచారం జరిగింది. ఈ కారణంగానే దేవన్నపేట వద్ద నిర్వహించాల్సిన సభను ఎల్కతుర్తికి తరలించారన్న వాదన ఉంది. అయితే సన్నాహక సమావేశాల్లో బిజీగా ఉండటం వల్లే ఎర్రబెల్లి సమీక్ష రాలేదని, తమలో ఎలాంటి విభేదాలు లేవని పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

మీ కాలేయం సురక్షితమేనా?

తెలియకుండానే కబళించే లివర్ వ్యాధులు.. సమస్యేమిటో గుర్తించే సరికే ప్రాణాపాయ స్థితి

- రాష్ట్రంలో పెరుగుతున్న బాధితులు
- అధిక కొవ్వు, రసాయనాలున్న ఆహారం, మద్యం.. ఊబకాయం, హెపటైటిస్ ఇన్ఫెక్షన్లే కారణం
- నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శరీరంలోని అత్యంత కీలకమైన అవయవాల్లో కాలేయం ఒకటి. అది ఏమాత్రం దెబ్బతిన్నా ఎన్నో రకాల సమస్యలు తప్పవు. కానీ కొన్నేళ్లుగా కాలేయ వ్యాధుల బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. కాలేయ క్యాన్సర్లు నిశ్శబ్దంగా కబళిస్తున్నాయి. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కాలేయ సమస్యలను నివారించవచ్చు. పరిస్థితి ప్రమాదకరంగా మారిన వారికి కాలేయ మార్పిడి చికిత్సతో మంచి జీవితాన్ని అందించవచ్చు. కానీ కాలేయ దాతల కొరత ఇబ్బందిగా మారుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 926 మంది బాధితులు కాలేయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవలి కాలంలో కాలేయ సమస్యల బాధితుల సంఖ్య పెరుగుతోంది. హైపటైటిస్-బి వ్యాధి, విపరీతంగా మద్యం అలవాటు, అధిక కొవ్వు ఉండే ఆహారం తీసుకోవడం, ఫ్యాటీ లివర్, కొన్ని రకాల మందుల దుష్ప్రభావాలు వంటివి కాలేయ సమస్యలకు దారితీస్తున్నాయి. ఫ్యాటీలివర్, హై గ్లిజరైడ్ ఫాట్, సిర్రోసిస్, క్యాన్సర్ వంటి సమస్యలు వస్తున్నాయి. 42 ఏళ్లు దాటిన వారిలో కాలేయ సమస్యలు పెరిగిపోతున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

కాలేయ సమస్యలను ఎలా గుర్తించవచ్చు

ఆకలి తగ్గిపోవడం, కడుపులో నొప్పి, రక్తపు వాంతులు, కామెర్లు, కడుపులో నీరు చేరడం, మల విసర్జనలో రక్తం పడటం, బరువు తగ్గిపోతుండటం, తరచూ జ్వరం, ముఖం, కాళ్ల వాపు వంటివి కాలేయ సమస్యలకు లక్షణాలని వైద్యులు చెబుతున్నారు. కాలేయ జబ్బులను ప్రారంభ దశలో గుర్తిస్తే.. తేలికగా మందులతోనే బయటపడొచ్చని స్పష్టం చేస్తున్నారు. మరీ తీవ్రస్థాయికి చేరితే కాలేయ మార్పిడి అవసరమని వివరిస్తున్నారు. ఆల్కాహాల్ అలవాటును వదులుకోవడం, అధిక బరువును నియంత్రించుకోవడం మంచిదని సూచిస్తున్నారు. రాష్ట్రంలో జీవన్‌దాన్ ద్వారా 2013 నుంచి ఇప్పటివరకు 1,473 మందికి కాలేయ మార్పిడి చికిత్సలు నిర్వహించారు. ఇంకా 926 మంది జీవన్‌దాన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని కాలేయం కోసం ఎదురుచూస్తున్నారు. సాధారణంగా పూర్తి ఆరోగ్యంతో ఉన్న 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య వయసువారు ఎవరైనా కాలేయ దానం చేయవచ్చని వైద్యులు తెలిపారు. దానం చేసినవారిలో 3 నుంచి 6 నెలల్లో కాలేయం పెరిగి యథాస్థితికి వస్తుందని వివరించారు.

ఇది సైలెంట్ కిల్లర్..



కాలేయ వ్యాధి సైలెంట్ కిల్లర్. ఫ్యాటీ లివర్, హెపటైటిస్ వంటివి తీవ్రస్థాయికి చేరే వరకు పెద్దగా లక్షణాలేవీ చూపించవు. తరచూ అలసట, కడుపులో అసౌకర్యం, కామెర్ల వంటివి బాధపెడుతున్నవారు వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.

- డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి, సీనియర్ హెపటాలజిస్టు, స్టార్ ఆస్పత్రి

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రాసెస్డ్ ఆహారం, కొవ్వు ఎక్కువగా ఉండే పదార్థాలు, కృత్రిమ రంగులు కలిగిన పానీయాలకు దూరంగా ఉండాలి. తాజా ఆహారం, తక్కువ కొవ్వు, ఫైబర్ అధికంగా ఉన్న పదార్థాలను తీసుకోవాలి. బీ, సీ, ఈ విటమిన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం కాలేయాన్ని రక్షించడానికి దోహదపడుతుంది. నీరు సమృద్ధిగా తాగాలి. మద్యపానం మానాలి. తగినంత శారీరక శ్రమ ఉండాలి. వ్యాయామం చేయాలి. బరువును అదుపులో ఉంచుకోవాలి.

- డాక్టర్ మహమ్మద్ నయీమ్, క్లినికల్ డైరెక్టర్, కేర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైజెస్టివ్ డిసీజెస్- లివర్ ట్రాన్స్‌ప్లాంట్

మొదటి దశలో ఏ లక్షణాలూ కనిపించవు



కాలేయ క్యాన్సర్ మొదటి దశలో పెద్దగా ఎలాంటి లక్షణాలూ కనిపించవు. మద్యం ఎక్కువగా తాగేవారు. హెపటైటిస్ బీ, సీ వ్యాధులున్నవారు, మెటబాలిక్ (జీవక్రియలసంబంధ) వ్యాధులున్నవారు తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. కాలేయ క్యాన్సర్‌కు ప్రత్యేక టార్గెట్ థెరపీ, ఇమ్యునోథెరపీ అవసరం. కొంత మందికి కాలేయ మార్పిడి అవసరం కూడా పడొచ్చు. దేశంలో ఏటా 5వేలకు పైగా కాలేయ మార్పిడులు జరుగుతున్నాయి.

- డాక్టర్ రావుల ఫణికృష్ణ, సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, కిమ్స్

మాటల్లో కాదు చేతల్లో చూపండి

- కంచ గచ్చిబౌలి భూముల అంశంపై విచారణ జరిపించండి
- పర్యావరణ పరిరక్షణపై చిత్తశుద్ధి నిరూపించుకోండి
- ప్రధాని మోదీకి కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కంచగచ్చిబౌలి భూముల అంశంలో మాటలతో సరిపెట్టకుండా.. అక్కడ జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. పర్యావరణ పరిరక్షణపై చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో శుక్రవారం ఓ పోస్టు చేశారు. కంచగచ్చిబౌలి అంశం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన రూ.10వేల కోట్ల ఆర్థిక మోసమని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ భూములు కేంద్రంగా జరిగిన ఆర్థిక అక్రమాలపై విచారణ చేపట్టి.. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటికాదని నిరూపించాలని కోరారు. కంచగచ్చిబౌలి భూములు తనఖాతో రూ.10,000 కోట్ల మేర జరిగిన ఆర్థిక కుంభకోణంపై దర్యాప్తు చేపట్టాలని సీబీఐ, ఆర్‌బీఐ, సెబీ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్ తదితర సంస్థలకు తాము ఇప్పటికే ఫిర్యాదు చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. కంచగచ్చిబౌలి భూముల అంశంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని సుప్రీంకోర్టుకు చెందిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ కూడా నిర్ధారించిందని, కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయాలని సూచించిందని కేటీఆర్ తెలిపారు. నగరాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశమని అన్నారు. వ్యవస్థలను మోసం చేసి పర్యావరణ విధ్వంసం చేసిన రేవంత్‌రెడ్డి లాంటి నాయకులను ప్రజల ముందు నిలబెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కంచ గచ్చిబౌలిలో రూ.10వేల కోట్ల ఆర్థిక అక్రమాలపై ప్రధాని తక్షణమే చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

అవును.. అంబేడ్కర్ భగవంతుడే!

రాముడు, అల్లా, యేసు తర్వాత ఈ దేశ ప్రజలకు అంబేడ్కర్, మహాత్మాగాంధీ, నెహ్రూ దేవుళ్లే

- అంబేడ్కర్ వల్లే ప్రధానిగా మోదీ, హోంమంత్రిగా షా ఉన్నారు
- రాహుల్ రాజ్యాంగాన్ని ఆరాధిస్తే.. మోదీ, షా అవమానిస్తున్నారు
- త్వరలోనే సంగారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తా
- జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): "అంబేడ్కర్ ఏమైనా భగవంతుడా అంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయన్ను కించపరిచాడు. అవును అంబేడ్కర్ ముమ్మాటికీ భగవంతుడే. శ్రీరాముడు, అల్లా, యేసు తర్వాత ఈ దేశ ప్రజలకు అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ దేవుళ్లే" అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో శుక్రవారం ఆయన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగంలో అంబేడ్కర్ కల్పించిన ఓటు హక్కుతోనే ఇప్పుడు ప్రధానిగా మోదీ, హోంమంత్రిగా అమిత్ షా పని చేస్తున్నారని చెప్పారు. వీరిద్దరూ రాజ్యాంగాన్ని అవమానిస్తుండగా.. రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని ఆరాధిస్తున్నారని గుర్తుచేశారు. అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు అమిత్ షా, బీజేపీ నేతలు బేషరతుగా క్షమాపణలు చెప్పేదాకా కాంగ్రెస్ పోరాటం ఆగదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని త్వరలోనే సంగారెడ్డికి ఆహ్వానిస్తానని జగ్గారెడ్డి చెప్పారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల అవసరాలు నెరవేరేలా సమావేశం ఏర్పాటు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో నిర్వహించిన మాక్ పోలింగ్‌లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల

బీఆర్ఎస్ హయాంలో రంగులేసి అభివృద్ధి అన్నారు

- జీహెచ్ఎంసీలో వీధి లైట్లు కొనడానికీ డబ్బుల్లేవు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో హైటెక్ సిటీలో రంగులు వేసి దాన్నే అభివృద్ధి అని చెప్పుకొంటూ ప్రచారం చేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కువ ఉన్న ప్రాంతాల్లోనే కొన్ని పనులు చేశారని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం వచ్చినపుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. "హైదరాబాద్ అంటే కేవలం హైటెక్ సిటీయే కాదు.. అంబర్ పేట్, సనత్‌నగర్, మల్కాజ్‌గిరి, దిల్ సుఖ్‌నగర్, చార్మినార్, కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లో సౌకర్యాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు. బేగంపేట్ హరిత ప్లాజాలో జరిగిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కిషన్‌రెడ్డి బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. జీహెచ్ఎంసీ ఆర్థికస్థితి దారుణంగా మారిందన్నారు. వీధిలైట్లు కొనడానికి కూడా డబ్బుల్లేని స్థితికి దిగజారిందన్నారు. "రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు విదేశీ పెట్టుబడులను తెచ్చామంటున్నారు. కానీ అవి ఏవి. ఎక్కడికి వెళ్లాయి" అని ప్రశ్నించారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్‌కు సహకరిస్తున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎందుకు పోటీ చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "మజ్లిస్ పార్టీకి వంగి వంగి సలాం కొడుతున్న రాహుల్ గాంధీ, కేసీఆర్‌లకు బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదు" అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మజ్లిస్ పార్టీ నుంచి హైదరాబాద్‌ను రక్షించాలంటే ప్రజలు చైతన్యంతో ఓటు వేయాలన్నారు. ప్రజలను జాగృతం చేయాలనే పవిత్ర ఉద్దేశంతోనే ఈ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి గౌతంరావు గారిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త ఐకమత్యంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గౌతం రావు పాల్గొన్నారు.

నేషనల్ హెరాల్డ్ ఆస్తులను కాజేసేందుకు..

డూప్లికేట్ గాంధీ కుటుంబం కుట్ర

- రాజ్యాంగానికి, చట్టాలకు వారేమైనా అతీతులా?
- విచారణ ప్రారంభమైంది యూపీఏ హయాంలోనే
- మజ్లిస్ సభకు రేవంత్ సర్కారు ఆర్థికసాయం
- బెంగాల్ తరహా పరిస్థితులు తలెత్తే ప్రమాదం
- అల్లర్లు జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత: బండి సంజయ్



హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ కుటుంబం డూప్లికేట్ గాంధీ కుటుంబమని, నేషనల్ హెరాల్డ్‌కు చెందిన రూ.వేల కోట్ల ఆస్తులను కాజేసేందుకు కుట్ర పన్నిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆ కుటుంబం ఏమైనా రాజ్యాంగానికి అతీతమా? ఇటలీ మూలాలున్నందున భారతీయ చట్టాలు వర్తించవనుకుంటున్నారా? అని మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసులో హీరో, విలన్, జోకర్, బ్రోకర్ అంతా కాంగ్రెస్సేనన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంజయ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. "కాంగ్రెస్ పార్టీ వాళ్లదే. నేషనల్ హెరాల్డ్ పేపర్ వాళ్లదే. యంగ్ ఇండియా ట్రస్ట్ వాళ్లదే. నష్టాల పేరుతో రూ.90 కోట్లు అప్పు ఇచ్చింది వాళ్లే. యంగ్ ఇండియా ట్రస్ట్ పెట్టి ఆ సంస్థ ఆస్తులను కొట్టేయాలనుకుంది వాళ్లే. దీనిపై ఈడీ, సీబీఐ విచారణ ప్రారంభమైందీ యూపీఏ హయాంలోనే. కోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకుందీ వారి హయాంలోనే. ఇందులో ప్రధాని మోదీకి, బీజేపీకి ఏం సంబంధం?" అని అన్నారు. 2013లో యూపీఏ ప్రభుత్వ ఆదేశాల మేరకే సీబీఐ ఈ కేసులో దర్యాప్తు ప్రారంభించిందని, అరెస్ట్ కాకుండా బెయిల్ తెచ్చుకుని బయట ఉన్న నిందితులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలేనని సంజయ్ తెలిపారు. ఈ కేసు విచారణ పూర్తి చేసిన ఈడీ.. ఇటీవల చార్జిషీట్ దాఖలు చేసిందన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రికలో 5వేల మంది స్వాతంత్ర్య సమరయోధులు వాటాదారులుగా ఉన్నారని, ఆ ఆస్తుల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు సైతం వాటా ఉందని అన్నారు. కాంగ్రెస్ నేతలు ధర్నా చేయాల్సింది ఈడీ ఆఫీస్ ముందు కాదని, ఆ ఆస్తులను కాజేసేందుకు కుట్ర చేసిన సోనియాగాంధీ నివాసం ఎదుట అని సూచించారు. హైదరాబాద్‌లో ధర్నా సందర్భంగా ప్రధాని పట్ల, కేంద్రమంత్రి పట్ల గౌరవం లేకుండా బూతులు మాట్లాడిన కాంగ్రెస్ నేతలను ఏమి అనాలో మీనాక్షి నటరాజన్, డిప్యూటీసీఎం భట్టివిక్రమార్క సమాధానంచెప్పాలన్నారు. తెలంగాణలో కూడా యంగ్ ఇండియా బ్రాండ్ లాగా ఫోర్త్ సిటీ పేరుతో 50 వేల కోట్ల దోపిడీకి రంగం సిద్ధం చేశారని ఆరోపించారు.

ఇక్కడా బెంగాల్ తరహా అల్లర్లకు అవకాశం..

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆర్థికసాయంతోనే ఎంఐఎం ఆందోళనలు చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. శనివారం ఎంఐఎం నిర్వహించనున్న సభకు కర్త, కర్మ, క్రియ.. రేవంత్ సర్కారేనన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అక్కడి సీఎం మమతా బెనర్జీ కూడా ఈ చట్ట సవరణను వ్యతిరేకించారని, ఫలితంగా అక్కడ అల్లర్లు చెలరేగాయని తెలిపారు. తెలంగాణలో కూడా అలాంటి పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని, దానిని రేవంత్ సర్కార్ కూడా నియంత్రించే అవకాశం ఉండదని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే రేవంత్ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రికి దమ్ముంటే తెలంగాణలో వక్ఫ్ ఆస్తులు, ఆదాయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తుల్లో మజ్లిస్ నేతలు నిర్మించిన ఆస్పత్రుల్లో వైద్యం ఉచితంగా ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. పైగా ఆ ఆస్పత్రుల నుంచి ఉగ్రవాదులను తయారు చేస్తున్నారని ఆరోపణ చేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు మజ్లిస్‌కు వ్యతిరేకంగా ఓటేస్తేనే ఆ పార్టీకి దూరంగా ఉన్నట్లు అని పేర్కొన్నారు. ఇక సీఎం రేవంత్ జపాన్ పర్యటన కూడా దావోస్ పర్యటన లాగే అవుతుందని ఎద్దేవా చేశారు. దావోస్ వెళ్లివచ్చిన తర్వాత రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చినట్లు ప్రకటించుకున్నారని, కానీ.. ఎంతమేర వచ్చాయో అందరికీ తెలుసునని వ్యాఖ్యానించారు. కాగా, బండి సంజయ్ రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలుసుకున్నారు. సుమారు అరగంటపాటు భేటీ అయ్యారు. ఈ భేటీ మర్యాదపూర్వకమేనని సంజయ్ కార్యాలయం వెల్లడించింది.

ఉస్మానియా వైద్యులకు సీఎం రేవంత్ అభినందనలు

» ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో విశ్వాసం పెంచారని వ్యాఖ్య

» 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో పోస్టు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న రోగికి చికిత్స చేసేందుకు ప్రైవేటు ఆస్పత్రి నిరాకరించగా.. ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు విక్రమ్, రంగా అజ్మీరా శస్త్రచికిత్స చేసి కాపాడిన విషయం తెలిసిందే. గత నెల 29న ఈ ఘటన జరగ్గా.. "ప్రైవేటు ఆసుపత్రి పొమ్మంటే.. సర్కారు దవాఖానా ప్రాణాలు నిలిపింది" శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ కథనాన్ని ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో సీఎం రేవంత్ పోస్టు పెట్టారు. విశాఖకు చెందిన హేమంత్ అనే వ్యక్తికి సకాలంలో శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన చేసిన వైద్యులు విక్రమ్, రంగా అజ్మీరాను ప్రత్యేకంగా అభినందించారు. "నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అనే నానుడిని తిరగరాసి.. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు తలచుకుంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలరని రుజువు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిన ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అజ్మీరా, డాక్టర్ విక్రమ్.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్యులు, సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. మీకు నా అభినందనలు" అని పేర్కొన్నారు.

పుట్టపర్తికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో జరిగే సత్యసాయిబాబా శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనే వారి కోసం తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వారాంతాల్లో హైదరాబాద్ నుంచి పుట్టపర్తికి ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. లహరి బస్సులతో పాటు ఇతర సర్వీసులనూ నడుపుతున్నామని, బుకింగ్, మరింత సమాచారం కోసం ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ tgsrtcbus.in, టోల్‌ఫ్రీ నెంబర్లు 040-69440000, 040-23450033 లను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

న్యాయవాదుల తొలగింపును రద్దు చేయండి

» సుప్రీం కోర్టులో పిటిషన్.. విచారణ మే 5కు వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించిన ప్రభుత్వ న్యాయవాదులను కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించిందని, ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ కొందరూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు షోయెబ్ ఆలం, పీ మోహిత్ రావు (ఏవోఆర్), అక్షిత, వెంకట్ సాయి, తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాదులు దేవినా సెహగల్(ఏవోఆర్), ఉదయ్‌భాను వాదనలు వినిపించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా న్యాయవాదులను తొలగించడం సరికాదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తెలిపారు. ప్రభుత్వం ఇటీవల నూతన మార్గదర్శకాలు జారీ చేసిందని, కావున వాదనలు వినిపించేందుకు మరికొంత సమయం కావాలని దేవినా సెహగల్ ధర్మాసనాన్ని కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది.

2.43 లక్షల ఎకరాలకు పామాయిల్ సాగు

హైదరాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగు విస్తీర్ణం ఏడాదికేడాది పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 65 వేల మంది రైతులు పామాయిల్ సాగులోకి దిగారు. గతంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకే పరిమితమైన పామాయిల్ తోటలు ఇప్పుడు 31 జిల్లాలకు విస్తరించాయి. పామాయిల్ తోటల సాగు విస్తీర్ణం 2,43,498 ఎకరాలకు పెరిగింది. ఈ ఏడాది మరో లక్ష ఎకరాల్లో పామాయిల్ మొక్కలు నాటించేందుకు వ్యవసాయశాఖ ప్రణాళిక తయారుచేసింది.

గత ఏడాది 26.6లక్షల కుటుంబాలకు 'ఉపాధి'

» లిబ్‌టెక్ ఇండియా సంస్థ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో 26.68లక్షల కుటుంబాలు లబ్ధి పొందాయి. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 5.3శాతం ఎక్కువ. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా ఉపాధి హామీ కింద లబ్ధి పొందిన కుటుంబాల సంఖ్య 3.5% తగ్గింది. గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలుపై లిబ్‌టెక్ ఇండియా సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. శుక్రవారం ఈ సర్వే నివేదికను విడుదల చేశారు. తెలంగాణలో మొత్తం పనిదినాలు 12.1కోట్ల నుంచి 12.2కోట్లకు పెరిగాయి. అయితే, కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్ణయించిన ప్రకారం రాష్ట్రంలోని ఉపాధి కూలీకి రోజుకు నగటున రూ.300వరకు వేతనం దక్కాల్సి ఉండగా.. రూ.213మాత్రమే అందుతోందని నివేదిక వెల్లడించింది. మరోవైపు, తెలంగాణలో 2024-25ఆర్థిక సంవత్సరం ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్న కుటుంబాల సంఖ్య పెరిగినా.. కొత్తగా కుటుంబాల నమోదు, కార్డుల జారీ జరగలేదని, ఇప్పటివరకు నమోదైన కుటుంబాల సంఖ్య 53లక్షలుగానే ఉందని సర్వే నివేదిక తెలిపింది.

టీచర్ల ప్రమోషన్ విధానంలో జోక్యం చేసుకోం

» నేరుగా ప్రభుత్వాన్నే ఆశ్రయించండి..హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టుల భర్తీపై ప్రస్తుతం ప్రభుత్వం పాటిస్తున్న విధానంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టంచేసింది. నేరుగా చేపట్టే నియామకాల ద్వారా ఎంత శాతం పోస్టులు భర్తీ చేయాలి, ప్రమోషన్ల ద్వారా ఎన్ని పోస్టులు భర్తీ చేయాలన్నది ప్రభుత్వ విధాన నిర్ణయమని, అందులో కల్పించుకోబోమని పేర్కొంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అధిక శాతం నేరుగా చేపట్టే నియామకాల ద్వారా భర్తీ చేయాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయవచ్చని పేర్కొంది. ఎస్ఏ పోస్టుల్లో 66 శాతం సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)లకు ప్రమోషన్లు ఇవ్వడం ద్వారా భర్తీ చేస్తున్నారని, నేరుగా బీఈడీ అభ్యర్థుల ద్వారా చేపట్టే నియామకాలకు కేవలం 33 శాతం మాత్రమే కేటాయించారని దీనివల్ల నష్టపోతున్నామని పేర్కొంటూ పిటిషన్ దాఖలలయింది. దీనిపై జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ ఎన్ నర్సింగ్‌రావుల ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసే కోటాను తగ్గించాలని, శాతాలు మార్చాలని ప్రభుత్వానికి చెప్పలేమని తెలిపింది. పిటిషన్ దాఖలు చేసిన బీఈడీ అభ్యర్థులు ఈ విషయమై ప్రభుత్వాన్ని ఆశ్రయించవచ్చని తెలిపింది. పిటిషన్ విచారణను ముగించింది.

మనూలో కొత్త కోర్సులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)లో పలు కొత్త కోర్సులను అందుబాటు లోకి తెస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఇష్తిఫాక్ అహ్మద్ వెల్లడించారు. 2025- 26 విద్యా సంవత్సరం నుంచి మనూలో పీహెచ్‌డీ ఇన్ అప్లైడ్ హెల్త్ సైన్సెస్, అడ్వాన్స్‌డ్ డిప్లమా ఇన్ పాష్తో, డిప్లమా ఇన్ తెలుగు, టర్కిష్, ఉర్దూ కాలిగ్రఫీ, సివిల్ ఇంజనీరింగ్, మాస్టర్ ఆఫ్ లా (ఎల్ఎల్ఎం)కోర్సులను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. ఎంట్రన్స్ బేస్డ్ కోర్సులకు మే 13 వరకు, మెరిట్ బేస్డ్ కోర్సులకు జూన్ 4 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అగ్నిమాపక శాఖ 'అవగాహన' ర్యాలీ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగితే ఎలా స్పందించాలనే దానిపై అగ్నిమాపక శాఖ వారోత్సవం సందర్భంగా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. అందులో భాగంగానే ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్ చుట్టూ సుమారు 100 అగ్నిమాపక శకటాలతో శనివారం ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. హోంశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రవిగుప్తా ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభిస్తారని సమాచారం. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటుచేసి ప్రజలు, పాఠశాల విద్యార్థులకు అగ్నిమాపక శాఖ పని తీరు, ఉపయోగించే పరికరాల గురించి అవగాహన కల్పిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి, పాల్గొంటారని వారు తెలిపారు.

తెలంగాణకు 'జై'పాన్

(మొదటిపేజీ తరువాయి)



జపాన్‌లోని సుమిదా నదిని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, అధికారులు

రెండ్రోజుల్లో రూ.12,062 కోట్ల పెట్టుబడులు

రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా జపాన్ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం రెండ్రోజుల్లో రూ.12,062 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. మూడు కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. దీంతో, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయా కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచంలోనే పేరొందిన ఎన్‌టీటీ డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్‌వర్క్స్ సంయుక్తంగా తెలంగాణ ప్రభుత్వంతో కలిసి హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నాయి. టోక్యోలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్ నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా, డైరెక్టర్ తడావోకి నిషిమురా, ఎన్టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బాజ్‌పాయ్, నెయిసా సీఈవో, ఎన్టీటీ గ్లోబల్ డేటా చైర్మన్ శరద్ సంఘీ త్రైపాక్షిక ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా 400 మెగావాట్ల డాటా సెంటర్‌ను హైదరాబాద్‌లో నిర్మిస్తారు. 25 వేల గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ల (జీపీయూ)తో దేశంలోనే అత్యంత శక్తిమంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూరుస్తారు. ఏఐ- ఫస్ట్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తారు. దీనిని 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో నిర్వహిస్తారు. ఇక్కడ లిక్విడ్ ఇమర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంబిస్తారు. ఎన్టీటీ డాటా కంపెనీ ప్రధాన కార్యాలయం టోక్యోలో ఉంది. ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్లో పేరొందిన ఈ కంపెనీ.. ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఒకటి. ఇందులో 50కిపైగా దేశాల్లో 1,93,000 మంది పని చేస్తున్నారు. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్ కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికం వంటి రంగాలకు సేవలందిస్తుంది.

రూ.562 కోట్లతో తోషిబా పెట్టుబడులు

తోషిబా కార్పొరేషన్ అనుబంధ సంస్థ ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ) తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో సీఎం రేవంత్ సమక్షంలో తోషిబా కార్పొరేషన్ ఎనర్జీ బిజినెస్ డైరెక్టర్ హిరోషి కనెటా, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, టీటీడీఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హిరోషి ఫురుటాలు విద్యుత్తు సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలను ప్రోత్సహించే ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ప్రకారం.. హైదరాబాద్ సమీపంలోని రుద్రారంలో సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీని టీటీడీఐ ఏర్పాటు చేస్తుంది. అలాగే, పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్ గేర్ (జీఐఎస్) తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి ఇప్పటికే ఇక్కడున్న ఫ్యాక్టరీలను అప్‌గ్రేడ్ చేయనుంది. ఇందుకు కంపెనీ రూ.562కోట్ల పెట్టుబడులను పెట్టనుంది. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించే ఈ కొత్త ఫ్యాక్టరీ విద్యుత్ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంతోపాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఈసందర్భంగా టీటీడీఐ చైర్మన్ హిరోషి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు ఆకట్టుకుంటున్నాయన్నారు.

రండి.. పెట్టుబడులు పెట్టండి: రేవంత్

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని జపాన్ పారిశ్రామిక, వ్యాపారవేత్తలను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. టోక్యోలోని హోటల్ ఇంపీరియల్‌లో శుక్రవారం ఇండియా-జపాన్ ఎకనమిక్ పార్టనర్‌షిప్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలంగాణ రైజింగ్ బృందం వివరించింది. వివిధ రంగాలకు చెందిన దాదాపు 150 మందికిపైగా జపాన్ పారిశ్రామికవేత్తలు ఇందులో పాల్గొన్నారు. రెండు పెట్టుబడులపై సంతకాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో సీఎం రేవంత్ మాట్లాడుతూ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు హృదయపూర్వకంగా స్వాగతం పలుకుతున్నామని చెప్పారు. "జపాన్‌ను ఉదయించే సూర్యుడి దేశమని పిలుస్తారు. మా ప్రభుత్వ నినాదం 'తెలంగాణ రైజింగ్'. ఈరోజు తెలంగాణ జపాన్‌లో ఉదయిస్తోంది" అని వ్యాఖ్యానించారు. టోక్యో గొప్ప నగరమని, ఇక్కడి సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతంగా ఉన్నాయన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నానని చెప్పారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యంతో కూడిన ప్రతిభ, స్థిరమైన విధానాలను తమ ప్రభుత్వం అందిస్తుందని జపాన్ వ్యాపారవేత్తలకు హామీ ఇచ్చారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్తు సరఫరా, సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తుందని, ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉన్నారని చెప్పారు. ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తోందన్నారు. భారత్, జపాన్ కలిసికట్టుగా ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఆర్థికాభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందని, అన్ని రంగాల్లో ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని తెలిపారు. ఏడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆ ర్‌ఎల్ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల సరసన ఎన్‌టీటీ క్లస్టర్‌తో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని చెప్పారు. సమావేశంలో పాల్గొన్న భారత రాయబారి సీబీ జార్జ్ మాట్లాడుతూ.. భారత్-జపాన్ మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాలను వివరించారు. తెలంగాణతో సహకారాన్ని బలోపేతం చేయాలని జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో) బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటానీ పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రియల్ సిటీగా హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై ప్రచార వీడియోలను రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు వేదికపై ప్రదర్శించారు. ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్‌టైల్స్, గ్రీన్‌ఎనర్జీ తదితర రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ వివరించారు. అనంతరం, తెలంగాణ ప్రతినిధి బృందం జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశమైందని సీఎంవో ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే, టోక్యోలోని సుమిద రివర్ ఫ్రంట్‌ను తెలంగాణ ప్రతినిధి బృందం సందర్శించింది.


కిషన్‌రెడ్డీ.. రాష్ట్రానికి ఏం చేశావ్?

మతం, ఒవైసీ జపం తప్ప అభివృద్ధి ఏదీ..?

మెట్రో విస్తరణ, విభజన హామీలు పట్టవా

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ-బీఆర్ఎస్ కుమ్మక్కు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్ల రాజకీయ ప్రస్థానంలో రెండు సార్లు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి.. తెలంగాణకు ఏం చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. కనీసం అంబర్‌పేట నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలన్నారు. గాంధీ భవన్‌లో శుక్రవారం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. బీజేపీకి మతం తప్ప.. అభివృద్ధి గురించి ధ్యాస లేదని, రజాకార్ల గురించి ఇంకెన్నాళ్లు మాట్లాడతారని ప్రశ్నించారు. పొద్దున లేస్తే ఒవైసీ జపం చేయడం కిషన్‌రెడ్డి అలియాస్ కిస్మత్‌రెడ్డికి అలవాటుగా మారిందని విమర్శించారు. గత జన్మలో వారు అన్నదమ్ములు అయి ఉండొచ్చని అన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలతో రజాకార్ల రాజ్యం ఎలా వస్తుందో కిషన్‌రెడ్డికే తెలియాలన్నారు. కేంద్ర మంత్రిగా ఉండి.. ఇంత దిగజారుడు వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు అవసరమైన సంఖ్యా బలం లేకున్నా.. ఎవరి అండ చూసుకుని బీజేపీ పోటీ చేస్తోందని కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో ఒప్పందం చేసుకున్నది వాస్తవం కాదా..? అని నిలదీశారు. సబర్మతీ ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి.. మూసీ సుందరీకరణకు ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. మెట్రో విస్తరణ, విభజన హామీలూ ఆయనకు పట్టవన్నారు. కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న బండి సంజయ్ దిగజారుడు భాష మాట్లాడటం సరికాదన్నారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ నేతలకు లేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం పథకాన్ని అమలు చేసి.. అక్కడి రేషన్ షాపుల్లో ప్రధాని మోదీ ఫొటో పెట్టుకోవాలని మహేశ్ సూచించారు.

బీఆర్ఎస్‌కు కడుపు మంట

రాష్ట్రంలో నిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తుంటే.. బీఆర్ఎస్ నేతలకు కడుపు మండుతోందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మొదటి నుంచీ గ్రూప్-1 పరీక్షలపై ఆ పార్టీ నేతలు కేసులు వేస్తూనే ఉన్నారని, నోటిఫికేషన్లను ఆపాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్‌కు ఎందుకంత అక్కసని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడతారంటూ కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు.

ఇంటికి పంపిన వాళ్లలో 2 వేల మందికి మళ్లీ చాన్స్?

(మొదటిపేజీ తరువాయి)

విభాగాధిపతులు చక్రం తిప్పుతున్నారు. కొన్ని కీలకశాఖల కార్యదర్శులు వీరి కోసం పట్టుబట్టి కూర్చోవడం అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తొలగించిన వారి స్థానంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు తొలగించిన వారిలో ఎక్కువ మంది ఉద్యోగులు కార్పొరేషన్లు, పంచాయతీరాజ్, నీటిపారుదలశాఖ, పురపాలక శాఖ, పరిశ్రమల శాఖల్లో ఉన్నారు. పురపాలక శాఖలో 177 మందిని, పరిశ్రమల శాఖలో 179 మందిని తొలగించారు. సుమారు 6,729 మందిని తొలగించకముందు వారి జీతభత్యాలు ఇతర ఖర్చుల కోసం సర్కారు నెలకు రూ.70 కోట్ల వరకు ఖర్చు చేసేది. ఏటా రూ.840 కోట్ల వీరి వేతనాల కిందనే వెచ్చించాల్సి వచ్చేది. సదరు ఖాళీలను భర్తీ చేస్తే.. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపినట్లవుతుందని సర్కారు ఆలోచన చేస్తోంది. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగ విరమణ చేసిన వారినే ఏళ్లుగా కొనసాగించడంపై అటు నిరుద్యోగుల్లోనూ అసంతృప్తి వ్యక్తమైంది. ఈ పరిస్థితిని గుర్తించిన రేవంత్ సర్కారు.. ఒకవైపు ఖాళీలను భర్తీ చేస్తూనే.. మరోవైపు కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్న ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల స్థానంలోనూ కొత్తవారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది.

ఈనెలాఖరులోపే నియామక ఉత్తర్వులు?

తొలగించిన ఉద్యోగుల్లో కొంతమందిని మళ్లీ తీసుకునేందుకు కొందరు కార్యదర్శులు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. సుమారు 2 వేల మందికి మరోసారి అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదనలు పలు విభాగాల కార్యదర్శుల నుంచి ప్రభుత్వానికి చేరాయి. కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకాలు చేయడంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ ఏడాది జనవరిలో ఒక ఉత్తర్వు జారీ చేశారు. అందులో ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాంటి తాత్కాలిక నియామకాలు చేయొద్దని, ఇది అన్ని శాఖలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. తాత్కాలిక నియామకాల కోసం ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు. అయితే ఇవేమీపట్టని కొన్ని కీలక శాఖల కార్యదర్శులు.. వారికి నచ్చిన వారిని మళ్లీ తీసుకొచ్చేందుకు తెరవెనుక సన్నాహాలు చేస్తున్నారనే ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. ఇప్పటికే ఆర్థికశాఖ అనుమతి లేకుండా కొంతమందిని నియమించగా.. ఇదేబాటలో మరికొంత మందికి ఈ నెలాఖరులోపు నియామక ఉత్తర్వులు ఇచ్చేందుకు కొన్ని శాఖల విభాగాధిపతులు సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి జపాన్ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే నియామకాలపై స్పష్టత వస్తుందని సదరు ఉద్యోగులకు కార్యదర్శులు భరోసా ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

దొరల కోసమే ధరణి

(మొదటిపేజీ తరువాయి)



మారిందని, అందుకే తమ ప్రభుత్వం దానిని బంగాళాఖాతంలోకి విసిరేసి.. సామాన్య ప్రజలకు చుట్టంలా ఉండే భూభారతి చట్టాన్ని తెచ్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం-2025పై శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలో, ఆదిలాబాద్ జిల్లా బోరజ్ మండలంలో పూసాయి గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులకు మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం 18 లక్షల ఎకరాలను పార్టు బీలో పెండింగ్‌లో పెట్టిందని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది రైతులు భూ సమస్యల కోసం ప్రాణాలు తీసుకునే పరిస్థితి ఎదురైందని తెలిపారు. తమ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయంలో తప్పు జరిగితే దానిని సరిదిద్దుకుంటామని, గత ప్రభుత్వంలో మాత్రం దొర ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే వెనక్కి తగ్గేదే లేదన్నట్లు వ్యవహరించేవారని దుయ్యబట్టారు. భూభారతి సమస్యల పరిష్కారానికి త్వరలో టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. గిరిజన, గిరిజనేతరులుండే ప్రాంతాల్లో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఓ కమిటీని నియమిస్తామని ప్రకటించారు.

గ్రామాలకు రెవెన్యూ అధికారులు..

భూ సమస్యల విషయంలో రైతులు ఇకపై అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి అన్నారు. జూన్ 2 నుంచి రెవెన్యూ అధికారులే గ్రామాలకు వస్తారని, దరఖాస్తులను పూర్తి చేసి ఇస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో 9.26 లక్షల సాదా బైనామా దరఖాస్తులు రాగా.. వాటికి పరిష్కారం చూపలేదని విమర్శించారు. భూ భారతిలో వీటికి పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక ప్రతి మనిషికీ ఆధార్‌కార్డు ఉన్నట్లుగానే ప్రతి రైతుకూ భూధార్ నంబర్‌ను కేటాయిస్తామన్నారు. త్వరలోనే 6వేల మంది సర్వేయర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి లైసెన్సులు అందజేస్తామని, మరో వెయ్యి మందికి సర్వేయర్లను కొత్తగా నియమిస్తామని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భూమితోనే మానవుని మనుగడ కొనసాగుతుందని, రైతులకు భూమితో తల్లీబిడ్డల అనుబంధం ఉంటుందని అన్నారు. కానీ, గత ప్రభుత్వం ధరణి పేరుతో రైతులను దగా చేసిందని ఆరోపించారు. ధరణి బాధలు తొలగిపోయి భూభారతితో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారని తెలిపారు. మళ్లీ తప్పులు జరగకుండా అధికారులు పని చేయాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తరువాతే రిజిస్ట్రేషన్‌లు చేయాలని సూచించారు. గత ప్రభుత్వం అధికారులను దొంగలను చేసిందని మండిపడ్డారు. కాగా, రైతుల కళ్లలో నీళ్లు చూడలేకనే సీఎం రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చారని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీలు బలరాంనాయక్, గోడం నగేష్, ఎమ్మెల్యేలు, ప్రిన్స్‌పల్ సెక్రటరీ(ఫైనాన్స్) రామకృష్ణారావు, రెవెన్యూ సెక్రటరీ బుద్ధ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై తప్పుడు సమాచారం.. బిల్ కలెక్టర్ సస్పెన్షన్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చారన్న కారణంతో ఓ బిల్ కలెక్టర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో 18 మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ దశను నిర్మించకముందే.. నిర్మించారంటూ తప్పుడు సమాచారాన్ని బిల్ కలెక్టర్ జగదీశ్ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీనిపై జగదీశ్‌కు ఉన్నతాధికారులు మెమో జారీ చేయగా .. తాను పొరపాటున ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశానని సంజాయిషీ ఇచ్చారు. విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించినందుకు జగదీశ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే అంశంపై గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో అవకతవకలకు పాల్పడినా, అలసత్వం వహించినా ఉపేక్షించేదిలేదని స్పష్టంచేశారు. ఈ మేరకు సమాచార శాఖ శుక్రవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది.

పసికందు మృతదేహంతో మంత్రుల ఎదుట నిరసన

» ప్రసవం అనంతరం మృతి చెందిన శిశువు

» వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ధర్నా

» విచారణ చేయిస్తామన్న మంత్రి సీతక్క



ములుగు జిల్లా కేంద్రంలో మంత్రులు పొంగులేటి, సీతక్కలకు పసికందు మృతదేహాన్ని చూపుతున్న కుటుంబ సభ్యులు

ములుగు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం అనంతరం ఓ పసికందు మృతి చెందింది. ప్రసవం ఆలస్యంగా చేయడమే పసికందు మృతికి కారణమంటూ కుటుంబ సభ్యులు శుక్రవారం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. అదే సమయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క రెవెన్యూ సదస్సుకు వెళ్తుండగా.. బాధిత కుటుంబ సభ్యులు కాన్వాయ్ వద్ద నిరసన తెలిపారు. మంత్రులకు పసికందు మృతదేహాన్ని చూపుతూ న్యాయం చేయాలని కోరారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన రవళి పురిటినొప్పులతో గురువారం సాయంత్రం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. రవళికి నార్మల్ డెలివరీ కాగా.. పాప పుట్టింది. అయితే.. కాసేపటికే తల్లీబిడ్డల ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు. వారిని వరంగల్‌కు తీసుకెళ్తున్న క్రమంలో శిశువు మృతి చెందింది. అయితే నార్మల్ డెలివరీ అవుతుందంటూ ములుగు ఆస్పత్రిలో వైద్యులు నిర్లక్ష్యంగా ఆలస్యం చేయడం వల్లే పసికందు మృతి చెందిందంటూ కుటుంబసభ్యులు నిరసనకు దిగారు. ఈ క్రమంలోనే అటుగా వచ్చిన మంత్రుల ఎదుట నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి సీతక్క ఈ ఘటనపై కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపడతామని, వైద్యుల నిర్లక్ష్యమని తేలితే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో పసికందు కుటుంబ సభ్యులు శాంతించారు.

ఇద్దరి మృతదేహాలు రేపు హైదరాబాద్‌కు

» గత వారం హత్యకు గురైన ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్

» శవపరీక్షల అనంతరం అనుమతిచ్చిన దుబాయి పోలీసులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయిలో హత్యకు గురైన ఇద్దరు తెలంగాణ వాసుల మృతదేహాలను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి దుబాయి నుంచి బయలుదేరే ఎయిరిండియా విమానంలో మృతదేహాలను తీసుకురావాలని భావించారు. అయితే మృతదేహాల గుర్తింపులో జాప్యం జరిగింది. దీంతో శనివారం అర్ధరాత్రి లేదా ఆదివారం ఇద్దరి మృతదేహాలు హైదరాబాద్ చేరుకోనున్నాయి. దుబాయిలోని ఖుబూస్‌లు తయారు చేసే కేంద్రంలో ఓ పాకిస్థానీ.. నిర్మల్ జిల్లా సోన్ మండలానికి చెందిన అష్టపు ప్రేమ్‌సాగర్, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలానికి చెందిన స్వర్గం శ్రీనివాస్‌ను హత్య చేసిన సంగతి తెలిసిందే. శవ పరీక్షల అనంతరం మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు దుబాయి పోలీసులు అనుమతించారు. దీంతో హత్య జరిగిన ఎనిమిది రోజుల తర్వాత మృతదేహాలు వారి కుటుంబ సభ్యులకు అందనున్నాయి. దుబాయి పోలీసులు తమ విచారణలో ఏ రకమైన విదేశీ జోక్యాన్నీ అనుమతించరు. ఈ కేసులో కూడా ఎవరి ప్రమేయం లేకుండా విచారణ జరిపిన దుబాయి పోలీసులు.. శవపరీక్షలను నిర్వహించి, మృతదేహాల తరలింపునకు అనుమతి ఇచ్చారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలంటూ దుబాయిలోని భారత అధికారులకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వేర్వేరుగా సూచించారు.

బాధితుల కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగం..

హత్యకు గురైన ఇద్దరు తెలంగాణ వాసుల కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు ఇవ్వాలని జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి ఓ ప్రకటనలో తెలిపారు.

దుబాయి నుంచి స్వదేశానికి తీసుకెళ్లండి

» సీఎం రేవంత్‌కు తెలంగాణ వాసుల వేడుకోలు



గోపాల్, చొప్పరి లింగయ్య

హన్వాడ, హుస్నాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం వారు దుబాయి వెళ్లారు. తిరిగి ఇంటికి రాలేక ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో తమను స్వదేశానికి తీసుకురావాలని వారు వేడుకుంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పెద్దదర్పలి గ్రామానికి చెందిన మ్యాతరి గోపాల్.. దుబాయికి వెళ్లి ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. గతేడాది సెప్టెంబరులో స్వదేశానికి వచ్చేందుకు ఎయిర్‌పోర్టుకు వెళ్లగా అక్కడి పోలీసులు ట్రావెల్ బాండ్ కేసు నమోదు చేశారు. జరిమానా విధించగా డబ్బుల చెల్లించలేకపోవడంతో మూడు నెలల జైలు శిక్ష విధించారు. తన ఐడీపై ఎవరో సిమ్ కార్డు తీసుకొని చట్టవిరుద్ధమైన కాల్స్ చేసినందుకు జరిమానా విధించినట్లు తెలిపారు. జైలు నుంచి బయటకు వచ్చినా పాస్‌పోర్టు హోల్డ్‌లో ఉందని, తన పరిస్థితి దారుణంగా ఉందని గోపాల్ ఓ వీడియో ద్వారా కుటుంబీకులకు చెప్పాడు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చొరవ తీసుకొని తనను స్వదేశానికి తీసుకురావాలని వేడుకుంటున్నాడు. కాగా 'ఏజెంట్ చేసిన మోసానికి దుబాయిలో కష్టాలు పడుతున్నా. ఆరోగ్యం క్షీణించింది. కాళ్లవాపులతో నడవలేకపోతున్నా.. కంపెనీ వారు పాస్‌పోర్టు తీసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం స్పందించి నన్ను స్వదేశానికి తీసుకెళ్లండి' అంటూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన చొప్పరి లింగయ్య వేడుకున్నాడు. ఈ మేరకు ఆయన పంపిన సెల్ఫీ వీడియో వైరల్‌గా మారింది. తన భర్తను ఇంటికి రప్పించాలని లింగయ్య భార్య మంత్రి పొన్నంను కోరారు.



హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో భారీగా నిలిచిన వరద నీరు



జగిత్యాల జిల్లా మాదాపూర్‌లో రాలిన మామిడి కాయలు



కామారెడ్డి జిల్లా ఇస్రోజివాడిలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన గొర్రెలు

జడివాన

(మొదటిపేజీ తరవాయి)

పేలిపోయింది. చార్మినార్, అఫ్జల్‌గంజ్, ఖైరతాబాద్, పంజాగుట్ట, కోఠి, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ సమస్యలు నెలకొన్నాయి. బడంగ్‌పేట, మలక్‌పేట, హబ్సిగూడ ప్రాంతాల్లో రాత్రి 9 గంటల వరకు విద్యుత్తు సిబ్బంది మరమ్మతులు చేపట్టి కరెంటు సరఫరాను పునరుద్ధరించారు. రోడ్లపై వరద నీరు నిలవకుండా డీఆర్‌ఎఫ్ బృందాలు, విరిగిపడ్డ చెట్లను తొలగించేందుకు హైడ్రా బృందాలు చర్యలు చేపట్టాయి. భారీ వర్షంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్త చర్యలు చేపట్టాలని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. పోలీసు, జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్తు అధికారుల సమన్వయంతో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కూలిన, విరిగిన చెట్లను తొలగించడంతో పాటు రోడ్లపై నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

పలు జిల్లాల్లోనూ వర్ష బీభత్సం..

పలు జిల్లాల్లోనూ గాలివాన బీభత్సం కొనసాగింది. వరి, మామిడి, మొక్కజొన్నతో పాటు పసుపు, నువ్వులు, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. కొన్ని చోట్ల పిడుగులు పడి మూగ జీవాలు ప్రాణాలు కోల్పోయాయి. వికారాబాద్ జిల్లా మర్పల్లి సమీప ప్రాంతాల్లో బొప్పాయి, అరటి, మొక్కజొన్న పంటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. వికారాబాద్‌లో ఈదురు గాలులకు భారీ వృక్షం విరిగిపడగా ట్రాక్టర్‌పై వెళ్తున్న ఇద్దరు గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో ఈదురు గాలులకు పశువుల దొడ్లు నేలకూలాయి. తాండూరు, మొయినాబాద్ మండలాల్లో భారీ వర్షానికి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఇబ్రహీంపట్నంలో ఈదురుగాలులకు మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఆలింపురంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పిడుగు పడి 12 మంది రైతులు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. గాలి వానకు నిర్మల్ జిల్లా మామడ ఎంపీడీవో కార్యాలయం ముందు గల భారీ వృక్షం నేలకూలింది. మామడలో కోతకు వచ్చిన నువ్వు పంట, పసుపు పంట పూర్తిగా తడిసిపోయింది. కామారెడ్డి జిల్లాలోని ఇస్రోజివాడిలో పిడుగుపాటుతో కదారి దేవయ్యకు చెందిన 40 గొర్రెలు మృతి చెందాయి. జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి, భీమారం, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం కథలాపూర్ మండలాల్లో వరి, నువ్వుల పంటలు నేలవాలాయి. జగిత్యాల జిల్లాలో 200 ఎకరాల్లో మామిడి, 200 ఎకరాల నువ్వులు, సుమారు 5 వేల ఎకరాల్లో వరి పంట నేల వాలి పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. ఇటు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వెయ్యి క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. సిరిసిల్ల జిల్లాలో గంభీరావుపేట మండలం, ముస్తాబాద్ ప్రాంతాల్లో వడగళ్ల వానతో కొంత పంట నష్టం జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో గాలివానకు పలు గ్రామాల్లో రేకుల ఇళ్లు, పౌల్ట్రీ ఫాంల షెడ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. కావేరమ్మపేట సమీపంలో పిడుగుపాటుకు రెండు పాడి గేదెలు మృతి చెందాయి. మిడ్జిల్ మండలంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. సంగారెడ్డి జిల్లాలో కోహీర్, కంగ్టి, ఝరాసంగం మండలాల్లో వరి, మామిడి పంటలకు నష్టం వాటిలిల్లింది. మెదక్ జిల్లా చేగుంట, మాసాయిపేట మండలాల్లో రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడిసింది. వడగండ్ల వానలకు మామిడికాయలు నేలరాలాయి.

రెండు రోజులు వానలు

రాష్ట్రంలో రెండు రోజుల పాటు వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శని, ఆదివారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. ముఖ్యంగా శనివారం నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. శుక్రవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో అత్యధికంగా 42.7 డిగ్రీలు, జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో 42.1, ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో 41.7 ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని పేర్కొంది.

'వక్ఫ్' సవరణను వ్యతిరేకిస్తూ నేడు బహిరంగ సభ

» దారుల్‌సలాం మైదానంలో ఏర్పాట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిరసన బహిరంగసభ నిర్వహించనున్నారు. ఇందుకోసం దారుల్‌సలాంలోని మజ్లిస్ పార్టీ ప్రధాన కార్యాలయ మైదానంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సభలో ముస్లిం మత సంస్థల నాయకులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, వైసీపీపార్టీల ప్రతినిధులు ప్రసంగించనున్నారు. కాగా వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జులై 7వరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ఏఐఎంపీఎల్‌బీ పిలుపునిచ్చింది.

కూతురు నిశ్చితార్థానికి అప్పుదొరక్క తండ్రి ఆత్మహత్య

వర్గల్ మండలం తునికిఖాల్సాలో ఘటన

వర్గల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కూతురి నిశ్చితార్థం కోసం అప్పు దొరక్కపోవడంతో ఓ తండ్రి తీవ్రంగా మనస్తాపం చెంది నిశ్చితార్థం రోజున ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికిఖాల్సా గ్రామంలో శుక్రవారం జరిగింది. అదే గ్రామానికి చెందిన కొడగళ్ల అంజయ్య (57) రోజుకూలిగా పనిచేసేవాడు. ఇటీవలే తన చిన్న కూతురు ప్రవళిక వివాహం నిశ్చయం కావడంతో శుక్రవారం నిశ్చితార్థానికి ఏర్పాట్లు చేసుకున్నారు. బంధువులను, గ్రామస్థులను ఆహ్వానించడానికి, నిశ్చితార్థానికి అయ్యే ఖర్చుల కోసం అప్పు తీసుకురావడానికి గురువారం ఇంటి నుంచి వెళ్లిన అంజయ్య తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని రైతు వేదిక దగ్గరలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం అంజయ్య తన పెద్ద కూతురు విజయ పెళ్లి కోసం రూ.5లక్షల అప్పు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక, చిన్న కూతురు నిశ్చితార్థానికి డబ్బు అందకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు అతని భార్య స్వరూప పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జూన్ 10 నుంచి అగ్నివీర్వాయు రిక్రూట్‌మెంట్ ర్యాలీ

అల్వాల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): భారత వాయుసేనలో అగ్నివీర్వాయు(మ్యూజిషియన్)ల కోసం రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుంది. జూన్ 10 నుంచి 18వ తేదీ వరకు న్యూఢిల్లీ, బెంగళూరులలో ఈ ర్యాలీ నిర్వహిస్తారు. ఏదైనా ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాల లేదా బోర్డు నుంచి మెట్రిక్యులేషన్ లేదా 10వ తరగతి లేదా సమాన విద్యార్హత పొందిన పెళ్లి కాని యువతీయువకులు ఈ పోస్టులకు అర్హులు. అభ్యర్థులు 2005 జనవరి 1 నుంచి 2008 జూలై 1 మధ్య జన్మించి ఉండాలి. రిజిస్టర్ చేసుకున్న వారికే ఈ ర్యాలీలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఈనెల 21వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మే 11వ తేదీ రాత్రి 11 గంటలకు వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం defenderrollers@gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించ

3న ఛలో బస్‌భవన్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)లో ఉద్యోగులపై రోజురోజుకూ పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించడానికి, కార్మికులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ), ఐఎన్‌టీయూసీ ఛలో బస్‌భవన్‌కు పిలుపునిచ్చాయి. మే 3న బస్‌భవన్‌ను ముట్టడిస్తున్నట్లు ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర కమిటీ వెల్లడించింది. పదవీ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పలు దఫలుగా వినతిపత్రాలు ఇచ్చినా యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదని రాష్ట్ర కమిటీ పేర్కొంది. కార్మికులపై పెరిగిన పనిభారం, ఖాళీలు భర్తీ చేయకపోవడం, ఉద్యోగులపై అధికారుల వేధింపులు, ఇతర ప్రధాన సమస్యలనుప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని రాష్ట్రకమిటీ తెలిపింది.

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం తవ్వకానికి..

ఇక డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం

» ఇన్‌లెట్ నుంచి టీబీఎంతో తవ్వకం క్లిష్టతరం కావడంతో సర్కారు నిర్ణయం

» కేంద్రం అనుమతి కోసం త్వరలో దరఖాస్తు

» వచ్చేవారం సాంకేతిక కమిటీ సమావేశం

» ఔట్‌లెట్ నుంచి తవ్వకం టీబీఎంతోనే

» అమెరికా నుంచి వచ్చిన కొత్త బేరింగ్

» 2 నెలల్లో పనులు ప్రారంభమయ్యే చాన్స్



ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఔట్‌లెట్ వద్దకు చేరిన టీబీఎం బేరింగ్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం ఇన్‌లెట్ వైపు తవ్వకానికి ఇకపై డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానాన్ని అనుసరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇన్‌లెట్ వైపు నుంచి టన్నెల్ తవ్వకం క్లిష్టతరం కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం అనుమతి కోరుతూ త్వరలో కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేయనుంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడం, అందులోనూ అమ్రాబాద్ పులుల అభయారణ్యం కింది నుంచి టన్నెల్ తవ్వకం జరుపుతుండడంతో కేంద్రం నుంచి తగిన అనుమతులు కోరనుంది. ఇన్‌లెట్ వైపు 13.954 కిలోమీటర్ల వరకు టన్నెల్ తవ్వకం జరిపాక ఫిబ్రవరి 22న ప్రమాదం చోటుచేసుకోవడం తెలిసిందే. టన్నెల్ పైకప్పు కూలడంతో టన్నెల్ బోరింగ్ మెషిన్(టీబీఎం) మధ్య భాగంలో పనిచేస్తున్న 8 మంది చిక్కుకుపోయారు. వారిలో ఇద్దరి మృతదేహాలను మాత్రమే ఇప్పటిదాకా వెలికితీశారు. మరోవైపు టీబీఎం పూర్తిగా దెబ్బతిన్నది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇప్పటికే హెచ్చరించింది. 13.850 కిలోమీటర్ల నుంచి 13.9 కిలోమీటర్ల మధ్య టన్నెల్ పైభాగం షీర్‌జోన్‌లో ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఇన్‌లెట్ వైపు టన్నెల్ తవ్వకానికి బ్లాస్టింగ్ అండ్ డ్రిల్లింగ్ విధానం తప్ప.. మరో మార్గం లేకుండా పోయింది. 1000 టన్నుల బరువు ఉండే టీబీఎంను ముక్కలు ముక్కలుగా కత్తిరించి దాదాపు 850 టన్నుల భాగాలను తొలగించారు. మరో 150 టన్నుల భాగాలు టన్నెల్ లోపలే ఉన్నాయి. ప్రస్తుతం టన్నెల్ లోపల 13.805 కిలోమీటర్ల వరకు లోకోమోటివ్ రాకపోకలను పునరుద్ధరించారు. అయితే టన్నెల్‌లో 13.6 కిలోమీటర్ల తర్వాత ముందుకు వెళ్లడం ఏమాత్రం సురక్షితం కాదని, ఏదైనా జరిగే అవకాశం ఉందని ఇదే విషయాన్ని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరిస్తూ.. కేంద్రం నుంచి తగిన అనుమతులు సాధించాలని సూచించారు. సీఎం ఆదేశాలతో ఇప్పటికే సాంకేతిక కమిటీని కూడా నియమించారు. వచ్చేవారం ఈ కమిటీ సమావేశమై కేంద్రం నుంచి అనుమతులు తీసుకోవడానికి తగిన చర్యలు చేపట్టనుంది.

ఔట్‌లెట్ వద్దకు చేరుకున్న టీబీఎం బేరింగ్

దేవరకొండ: ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ఔట్‌లెట్ వైపు తవ్వకాన్ని టీబీఎంతోనే కొనసాగించనున్నారు. టీబీఎంకు అమర్చడానికి వీలుగా అమెరికా నుంచి తెప్పించిన బేరింగ్ శుక్రవారం ఉదయం టన్నెల్ వద్దకు చేరింది. ఔట్‌లెట్‌లో అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి నుంచి ఇప్పటికే 20.435 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వారు. టీబీఎం బేరింగ్ పాడైపోవడంతో రెండున్నరేళ్లుగా తవ్వకాన్ని నిలిపివేశారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అమెరికాలో పర్యటించి.. టీబీఎం తయారీ సంస్థ రాబిన్స్ ప్రతినిధులతో చర్చించారు. దీంతో వారు బేరింగ్‌ను అమెరికా నుంచి సముద్రమార్గంలో పంపించగా చెన్నై పోర్టుకు చేరుకుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఔట్‌లెట్ వద్దకు తీసుకొచ్చారు. ఈ బేరింగ్‌ను టీబీఎంకు అమర్చి రెండు నెలల్లో పనులను పునఃప్రారంభించనున్నారు.

మిస్టరీగానే అత్యాచార యత్నం కేసు!

» బాధితురాలు రీల్స్ చేస్తూ రైలు నుంచి పడిందని ప్రచారం

» తనకు రీల్స్ చేసే అలవాటు లేదంటున్న బాధితురాలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంచలనం సృష్టించిన ఎంఎంటీఎస్ అత్యాచార యత్నం కేసు కొలిక్కి రావడం లేదు. ఎంఎంటీఎస్ రైలులో అత్యాచార యత్నమే జరగలేదని, రైలులో రీల్స్ తీస్తూ ప్రమాదవశాత్తు యువతి కింద పడిపోయిందని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని బాధిత యువతి ఖండించింది. తనకు రీల్స్ చేసే అలవాటు లేదని, స్నాప్‌లు మాత్రమే తీసుకుంటానని, ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణిస్తున్న సమయంలో స్నాప్ కూడా తీసుకోలేదని చెప్పింది. రీల్స్ చేస్తూ రైలు నుంచి జారిపడినట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని స్పష్టంచేసింది. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఆర్‌జీపీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపారు. కాగా, గత నెల 22వ తేదీ రాత్రి సుచిత్ర వద్ద రైలు పట్టాల సమీపంలో ఓ యువతి గాయాలతో పడి ఉండగా.. పోలీసులు ఆస్పత్రికి తరలించారు. తనపై రైలులో ఓ వ్యక్తి అత్యాచారం చేయబోగా తప్పించుకునే యత్నంలో కిందకు దూకానని ఆ యువతి చెప్పడం సంచలనం రేపింది. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు 250 సీసీ కెమెరాల ఫుటేజీని జల్లెడ పట్టి, 100మందిని ప్రశ్నించినట్లు తెలిసింది. సాక్షులు లేకపోవడం, బాధితురాలు చెప్పిన వివరాలు పొంతన లేకుండా ఉండటంతో దర్యాప్తు కొలిక్కి రాలేదు.

సాగర్ స్పిల్‌వేపై గుంతలకు మోక్షం

» పూడ్చేందుకు కొలతలు తీసుకున్న అధికారులు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ స్పిల్‌వేపై పడిన గుంతలు పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ప్రాజెక్టు ఇంజనీర్లు స్పిల్‌వే వద్దకు పుట్టిపై వెళ్లి కొలతలు తీసుకున్నారు. 2009 సంవత్సరంలో వచ్చిన వరదలకు స్పిల్‌వేపై భారీ గుంతలు పడ్డాయి. 2011లో వాటికి మరమ్మతులు చేశారు. ఆ తర్వాత స్పిల్‌వేను పట్టించుకోకపోవడంతో గుంతలు పెరిగాయి. దీంతో పలుమార్లు ప్రాజెక్టు ఇంజనీర్లు నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు అందజేశారు. దీంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతులకు 2023లో రూ.19.64 కోట్లు మంజూరు చేసింది. ఆ ఏడాది మార్చి నెలలో పనులు చేపట్టేందుకు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించగా పనులు నిర్వహించారు. 2024 ఆగస్టు నెలలో వచ్చిన కొద్దిపాటి వరదలకే స్పిల్‌వేపై మళ్లీ గుంతలు పడిన వైనంపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ప్రధాన సంచికలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రి ఉత్తమ్ ఈ ఏడాది జనవరి నెలలో జలసౌధలో సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. సాగర్ స్పిల్‌వేపై గుంతల కొలతలు తీసుకునే విషయంపై సాగర్ ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్‌ఈ మల్లిఖార్జున్‌రావును ఫోన్‌లో వివరణ కోరగా ఈఎన్‌సీ సీఈ అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు స్పిల్‌వే పై పడిన గుంతలను కొలతలు వేస్తున్నట్లు తెలిపారు. గుంతలను కొలిచిన తర్వాత నివేదికలు తయారుచేసి ఈఎన్‌సీకి అందజేస్తామని తెలిపారు.



మధ్యవర్తిత్వంతో సత్ఫలితాలు

వివాదాలను శాంతియుతంగా పరిష్కరించే బాధ్యతలను కమ్యూనిటీ పెద్దలు తీసుకోవాలి

కేరళలో ఈ విధానం విజయవంతమైంది

హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్

కమ్యూనిటీ మధ్యవర్తులకు శిక్షణ ప్రారంభం

వరంగల్ లీగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని వ్యక్తులు, సమూహాల మధ్య ఏర్పడే వివాదాలను కమ్యూనిటీ మధ్యవర్తిత్వం ద్వారా శాంతియుతంగా పరిష్కరించగలిగితే సత్ఫలితాలు ఉంటాయని, ప్రశాంతమైన సమాజ స్థాపనకు కమ్యూనిటీ పెద్దలు నడుం బిగించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు. హనుమకొండలోని సహకార భవన్‌లో శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని కమ్యూనిటీ మధ్యవర్తులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత చీఫ్ జస్టిస్ మాట్లాడారు. "ఏ వివాదమైనా... ఇద్దరు వ్యక్తుల మధ్యనో లేదా రెండు సమూహాల మధ్యనో ఏర్పడుతుంది. అయితే, ఆ వ్యక్తిగానీ సమూహంగానీ ఏదో ఒక కమ్యూనిటీకి చెందిన వారై ఉంటారు. అలాంటి పరిస్థితుల్లో అదే కమ్యూనిటీకి చెందిన పెద్దలు వారికి నచ్చజెప్పినట్లయితే వివాదాలు సుహృద్భావ వాతావరణంలో పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది. ఈ బృహత్తర ఆలోచన నుంచి ఉద్భవించిందే కమ్యూనిటీ మధ్యవర్తిత్వ విధానం. మొదటి సారిగా కేరళలో ఈ విధానం విజయవంతమైంది. అక్కడి కమ్యూనిటీ పెద్దలు కోర్టుల దాకా రాకుండా వేలాది వివాదాలను పరిష్కరించారు" అని అన్నారు. 2023లో వచ్చిన మధ్యవర్తిత్వ చట్టం... ఈ విధానానికి చట్టబద్ధత కల్పించిందని గుర్తు చేశారు. ప్రస్తుత సమాజంలో భార్యాభర్తలు, తల్లిదండ్రులు-పిల్లల మధ్య తగాదాలు పెరిగిపోతున్నాయని, వీటికి చక్కటి పరిష్కారం కమ్యూనిటీ మధ్యవర్తిత్వ విధానమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఒక విశ్రాంత వైస్ చాన్సలర్ కమ్యూనిటీ మధ్యవర్తిగా సాధించిన విజయాలను జస్టిస్ సుజోయ్ పాల్ వివరించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి మాట్లాడుతూ నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్‌ల్లో కమ్యూనిటీ మధ్యవర్తిత్వ వలంటీర్లు విజయవంతంగా పని చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వీబీ నిర్మలా గీతాంబ, సీహెచ్ రమేష్‌బాబు, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయి కుమార్, క్షమా దేశ్ పాండే తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' పనుల దృఢత్వ పరిశీలన

» కూలిన పిల్లర్ ప్రాంతాన్ని సందర్శించిన అధికారుల బృందం

» ఎల్లుండి మరోసారి క్షేత్రస్థాయి పర్యటన!

అశ్వారావుపేట/ములకలపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు పనుల దృఢత్వం, నాణ్యతా ప్రమాణాలు, డిజైన్ తదితరాలను ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతోంది. ములకలపల్లి మండలం, కమలాపురం వద్ద సీతారామ ప్రాజెక్టు 4వ ప్యాకేజీ 48.3 కి.మీ. వద్ద నిర్మించిన సూపర్ పాసేజ్ పిల్లర్ కూలిన సంగతి తెలిసిందే. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనాలు వెలువడ్డాయి. ప్రాజెక్టు పనుల నాణ్యత విషయమై సీఎం రేవంత్‌రెడ్డికి స్వయంగా ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన ప్రాజెక్టు దృఢత్వ పరిశీలనకు ప్రత్యేక కమిటీని నియమించారు. ఈ నేపథ్యంలోనే గురువారం కూలిన పిల్లర్ ప్రదేశాన్ని కమిటీలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ సీఈ మోహన్‌కుమార్, మైనర్ ఇరిగేషన్ సీఈ రఘునాథరావు, క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ, ఇరిగేషన్ సీఈ రమేశ్‌బాబు పరిశీలించారు. పిల్లర్ ఎలా కూలింది, అక్కడ నేల స్వభావం ఎలా ఉంది, వరద ఏ మేర వచ్చింది, డిజైన్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంపుహౌస్-3 వద్ద ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులతో సమీక్ష జరిపారు. కాలువ పొడవు ఎంత, ఏయే ప్యాకేజీల్లో ఏయే సంస్థలు నిర్మాణాలు చేపట్టాయి, ఎంత మేర పూర్తయ్యాయి, డిజైన్లను రూపొందించింది ఎవరు.. తదితర వివరాలను సేకరించారు. గురువారం సాయంత్రం వరకు కాల్వలను పరిశీలించి జిల్లా కేంద్రం కొత్తగూడెం వెళ్లారు. శుక్రవారం ఉదయం కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. అయితే తిరిగి వారు సోమవారం క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టును మరోసారి పరిశీలించి మరిన్ని వివరాలు సేకరించనున్నారని తెలిసింది. ఏదేమైనా 15 రోజుల్లోపే పరిశీలన జరిపి పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారని సమాచారం.

'ఊరంతా కిడ్నీ వ్యాధిగ్రస్తులే' కథనానికి స్పందన

» మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయండి: మంత్రి దామోదర

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామంలో ప్రజలు కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్న ఉదంతంపై 'ఊరంతా కిడ్నీ వ్యాధిగ్రస్తులే' పేరిట శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. ఆ గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి, గ్రామస్థులందరికీ వైద్య పరీక్షలు చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఎంతమంది కిడ్నీ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారో గుర్తించి, వారికి అవసరమైన వైద్య సదుపాయాల్ని ఉచితంగా అందించాలని చెప్పారు. ప్రజలు వినియోగిస్తున్న తాగునీటిని పరీక్షించాలన్నారు. దీనిపై పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఏసీబీకి చిక్కిన ఎస్సై..పోలీస్ స్టేషన్‌లో సోదాలు

నస్పూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రికవరీ చేసిన సొమ్మును బాధితుడికి ఇవ్వకుండా తిప్పించుకుంటున్న మంచిర్యాల జిల్లా నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సోదాలు చేశారు. జనవరి 25న నస్పూర్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో కొందరు క్షుద్రపూజల పేరుతో ప్రభంజన్‌ను బెదిరించి డబ్బులు లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మరుసటి రోజు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని, రూ.2రెండు లక్షలను సీజ్ చేశారు. రికవరీ చేసిన సొమ్మును ప్రభంజన్‌కు ఇచ్చేయాలని ఈనెల 4వ తేదీన కోర్టు ఆర్డర్ ఇచ్చింది. అయితే, రూ.50వేలు మాత్రమే ప్రభంజన్‌కు ఇచ్చి లక్షన్నర ఇచ్చినట్లు ఫొటోలు తీసుకుంటానని, సంతకం పెట్టమని ఎస్ఐ అడగ్గా.. అతడు నిరాకరించాడు. అప్పటినుంచి మళ్లీ ఇస్తానంటూ ఎస్ఐ బాధితుడిని తిప్పుకుంటున్నాడు. కేసుకు సంబంధించిన సొమ్మును దుర్వినియోగం చేసినందుకు ఎస్సైపై కేసు నమోదు చేశామని, రిమాండ్‌కు పంపుతున్నామని ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.